సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 68

మంగళవారం 30-5-2023



'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'



బ్యాక్ వాటర్ చేప భలే మజా!


సాగర్ ప్రాజెక్టు వెనక జలాల్లోని చేపలకు మార్కెట్లో మంచి డిమాండ్ -14లో



జీఎస్ఎల్వీ ప్రయోగం సక్సెస్

కక్ష్యలోకే నావిక్ 01 ఉపగ్రహం.. బలోపేతమవనున్న నావిగేషన్ వ్యవస్థ -6లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సీవీసీగా ప్రవీణ్ శ్రీవాస్తవ

సీవీసీగా ప్రవీణ్ కుమార్ శ్రీవాస్తవ నియమితులయ్యారు. సోమవారం ఉదయం ఆయన రాష్ట్రపతి సమక్షంలో ప్రమాణం చేశారు.

వివరాలు 6లో ▸



మధ్యప్రదేశ్‌లో అధికారం మాదే

మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో తాము 150 సీట్లు కచ్చితంగా గెలుచుకుంటామని రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు.

వివరాలు 6లో ▸



తుర్కియే అధ్యక్షుడిగా ఎర్డోగన్

రెండో రౌండ్ పోలింగ్‌లో స్పష్టమైన ఆధిక్యత సాధించడంతో తుర్కియే అధ్యక్షుడిగా ఎర్డోగన్ మరోసారి ఎన్నికయ్యారు.

వివరాలు 6లో ▸



లార్డ్ మేయర్‌గా చమన్ లాల్

బర్మింగ్‌హామ్ లార్డ్ మేయర్‌గా చమన్‌లాల్ ఎన్నికయ్యారు. తద్వారా తొలి బ్రిటిష్-ఇండియన్ మేయర్‌గా రికార్డు సృష్టించారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

అమరవీరుల స్తూపం నుంచి గాంధీభవన్ వరకు..



ఆవిర్భావ దినోత్సవం రోజున 'దశాబ్ది దగా' పేరుతో కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించిన టీపీసీసీ జూన్ 2న అమరవీరుల స్తూపం నుంచి గాంధీభవన్ వరకు వేలాది మందితో ర్యాలీ నిర్వహించనుంది. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ ర్యాలీలు చేపట్టనుంది.

- వివరాలు 3లో ▶

ఎమ్మెల్యే రఘునందన్‌కు పరువు నష్టం నోటీసు



తమ సంస్థపై తప్పుడు, నిరాధార ఆరోపణలతో పరువు నష్టం కలగజేశారంటూ.. బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ రూ. వెయ్యికోట్లకు లీగల్ నోటీస్ ఇచ్చింది. ఆయన వ్యాఖ్యలు భవిష్యత్తు వ్యాపారాన్ని దెబ్బతీసేవిగా ఉన్నాయని జారీచేసిన నోటీసుల్లో పేర్కొంది.

- వివరాలు 3లో ▶

ట్విన్ టవర్స్! హెచ్ఓడీలు ఒకేచోటికి..

కొత్త సచివాలయం సమీపంలోనే విభాగాధిపతుల కార్యాలయాల నిర్మాణానికి సర్కారు నిర్ణయం

ప్రభుత్వ స్థలాల లభ్యతపై సీఎం కేసీఆర్ ఆరా

అమరుల స్మారకం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం, ఫౌంటెయిన్లు

- కుల వృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయంపై రెండు రోజుల్లో విధి విధానాలు
- వచ్చే నెల 9న ఈ పథకానికి శ్రీకారం చుట్టేలా ఏర్పాట్లు
- దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై సమీక్షలో సీఎం కేసీఆర్ ఆదేశాలు



సోమవారం సచివాలయ సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పరిపాలనకు కేంద్రమైన నూతన సచివాలయం పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చింది. రాష్ట్రస్థాయిలో కీలకమైన పనులన్నీ ఒకే చోట జరిగేందుకు మార్గం పడింది. ఇదే తరహాలో అన్ని ప్రభుత్వ శాఖల పరిధిలోని వివిధ విభాగాధిపతుల (హెచ్ఓడీల) కార్యాలయాలను ఒకే గొడుగు కిందికి తేవాలని సీఎం కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. ఇందుకోసం కొత్త సచివాలయానికి సమీపంలో ట్విన్ (జంట) టవర్లు నిర్మించాలని.. దీనికి సంబంధించి స్థలాన్ని అన్వేషించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం సచివాలయంలో సీఎం సమీక్షించారు.

హెచ్ఓడీల వివరాలపై ఆరా..

దేశం గర్వించేలా నిర్మించుకున్న కొత్త సచివాలయం ఉద్యోగుల విధి నిర్వహణకు అత్యంత అనువుగా ఉందని.. ఆహ్లాదకర వాతావరణంలో ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారని సమీక్షలో సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. సచివాలయం ప్రారంభమై నెల రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో.. మౌలిక వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా హెచ్ఓడీల కార్యాలయాల కోసం ట్విన్ టవర్లను నిర్మించే అంశంపై అధికారులతో చర్చించారు. అన్ని శాఖల పరిధిలోని హెచ్ఓడీల వివరాలు, మొత్తం ఉద్యోగుల సంఖ్య, అవసరమైన స్థలం, సదుపాయాలు తదితర అంశాలపై ఆరా తీశారు. సచివాలయానికి సమీపంలో విశాలవంతమైన ప్రభుత్వ స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. మంచి స్థలాలను అన్వేషించాలని.. హెచ్ఓడీల అధికారులు, సిబ్బంది తరచూ సచివాలయానికి రావాల్సిన పరిస్థితి ఉన్న నేపథ్యంలో..

మిగతా 2వ పేజీలో ▶

ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్ స్థలంలో ట్విన్ టవర్స్?

ఆదర్శనగర్‌లోని న్యూఎమ్మెల్యే క్వార్టర్స్ భవనాలను కూల్చివేసి ఆ స్థలంలో హెచ్ఓడీల కార్యాలయాల కోసం ట్విన్ టవర్స్ నిర్మించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఈ కార్యాలయాల కోసం 40 లక్షల నుంచి 45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాలు అవసర మని అంచనా వేసినట్టు సమాచారం. అంతమేర భవనాల నిర్మాణానికి ఆదర్శనగర్ స్థలం అనువుగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. దీనికి సంబంధించి త్వరలోనే తుది నిర్ణయం తీసుకోవచ్చని అధికార వర్గాలు చెప్తున్నాయి.



'ఫైవ్'స్టార్ చెన్నై

ఐదోసారి ఐపీఎల్ చాంప్ సూపర్‌కింగ్స్

ఉత్కంఠ రేపిన పోరులో గుజరాత్ ఓటమి

సొంతగడ్డపై గుజరాత్ గర్జించినా... చెన్నై ఆఖరి బంతికి ఛేదించింది. సోమవారం జరిగిన ఐపీఎల్ ఫైనల్లో సూపర్‌కింగ్స్ 5 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. తొలుత గుజరాత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 214 పరుగుల భారీస్కోరు చేసింది. అయితే చెన్నై లక్ష్యాన్ని మొదలుపెట్టగానే వాన ముంచెత్తింది. గ్రౌండ్ సిబ్బంది చెమటోడ్చి మరీ మైదానాన్ని ఆరబెట్టడంతో ఆట అర్ధరాత్రి (12.15 గంటలకు) తర్వాత మొదలైంది. అప్పుడు లక్ష్యాన్ని డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 15 ఓవర్లలో 171 పరుగులుగా నిర్దేశించారు. ఇది కఠినమైనా... ఓపెనర్ల నుంచి బ్యాటింగ్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరు తలా ఓ చేయి వేయడంతో సూపర్‌కింగ్స్ సరిగ్గా 15 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసి గెలిచింది.

- వివరాలు 12లో

అన్ని పార్టీల్లో అడుగడుగునా కేసీఆర్ కోవర్టులు



ఆయన పొలి'ట్రిక్స్' అన్నీ నాకు తెలుసు: బీజేపీ నేత ఈటల

- కాంగ్రెస్‌ను ఎటూ కాకుండా చేయడాన్ని దగ్గరుండి చూశా..
- ఈసారి ఆ పార్టీని అమాంతం మింగేస్తారు
- పొంగులేటి, జూపల్లి వేరే పార్టీల్లో చేరకుండా ఆపగలిగా..
- వారితో జాతీయ నాయకత్వం మాట్లాడుతోందని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అమలు చేసే 'పొలిటికల్ ట్రిక్స్' అన్నీ తనకు తెలుసని.. ఎన్నికలు వచ్చినప్పుడు ఎలా వ్యవహరిస్తారో దగ్గరుండి చూశానని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. అన్ని పార్టీల్లోనూ కేసీఆర్ అడుగడుగునా కోవర్టులను పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని.. ఇటీవల వివిధ పార్టీల్లో చోటుచేసుకున్న పరిణామాలు దీనిని రుజువు చేస్తున్నాయని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనపై కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సోమవారం హైదరాబాద్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సందర్భంగా ఈటల మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలే ఓడించబోతున్నారన్నారు.

కాంగ్రెస్‌ను అమాంతం మింగేస్తారు

కాంగ్రెస్ పార్టీని ఎలా డీల్ చేయాలో కేసీఆర్‌కు బాగా తెలుసని, గత ఎన్నికల్లోనూ అదే జరిగిందని ఈటల చెప్పారు. 2018 ఎన్నికలకు ముందు కేసీఆర్ సర్కార్‌పై, అధికార బీఆర్ఎస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమై కాంగ్రెస్ పుంజుకుంటున్నదన్న దశలో.. ఆ పార్టీని ఎటూకాకుండా చేసిన తీరును తాను దగ్గరి నుంచి గమనించానని చెప్పారు. ఈసారి కూడా కాంగ్రెస్ పార్టీని కేసీఆర్ నాలుకకు కూడా తగలకుండా అమాంతం

మిగతా 3వ పేజీలో ▶

ప్రగతికి నమూనా..!

తొమ్మిదేళ్ల తెలంగాణ ప్రగతి ప్రస్థానంపై ప్రభుత్వం నివేదిక

రాష్ట్రంలో 74.32 లక్షల ఎకరాలకు సాగునీటి సదుపాయం

మూడేళ్లలో మరో 51.03 లక్షల ఎకరాలకు సాగునీరు

1.25 కోట్ల ఎకరాల మాగాణిగా మారనున్న తెలంగాణ

అభాగ్యుల ఆవేదనను తీర్చేలా 'ఆసరా' 44,82,254 మందికి ఏటా సగటున రూ.11,628 కోట్లు



కల్యాణలక్ష్మితో తగ్గిన బాల్య వివాహాలు

44,82,254 మందికి ఏటా సగటున రూ.11,628 కోట్లు

అన్ని వర్గాలకూ ప్రయోజనం కల్పించేలా సంక్షేమ పథకాలు

10లో



రిజిస్ట్రార్.. నేనంటే నేనే

తెయూలో మరోసారి 'కుర్చీ' వివాదం

- వాదులాడుకున్న ప్రొఫెసర్లు యాదగిరి, కనకయ్య
- ఇరువర్గాలుగా చీలిన వర్సిటీ వర్గాలు
- వీసీ, రిజిస్ట్రార్ చాంబర్లకు తాళాలు

14లో

రిజిస్ట్రార్ చాంబర్‌లో ప్రొఫెసర్ యాదగిరి, ప్రొఫెసర్ కనకయ్య, వాదులాడుతున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థి సంఘాల నేతలు

మైసూరులో ఘోర ప్రమాదం

- ఎదురెదురుగా ఢీకొన్న ప్రైవేట్ బస్సు, కారు
- 10 మంది మృత్యువాత

6లో




అంతులేని వ్యథ!

రెగ్యులరైజేషన్‌కు నోచుకోని కాంట్రాక్టు అధ్యాపకులు

30 ఏళ్లు పనిచేసినా కాంట్రాక్టు అధ్యాపకులుగానే రిటైర్!

- పదవీ విరమణ ప్రయోజనాలు లేవు.. చనిపోతే ఎక్స్‌గ్రేషియాకూ దిక్కులేదు
- మంజూరైన 2,837 పోస్టుల్లో 1,869 ఖాళీయే..
- కొన్ని వర్సిటీల్లో ఒక్క ప్రొఫెసర్ కూడా లేని వైనం
- క్రమబద్ధీకరణకు హామీ ఇచ్చీ కనికరించని ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న దాదాపు వెయ్యి మంది కాంట్రాక్టు అధ్యాపకులు ఎన్నో ఏళ్లుగా క్రమబద్ధీకరణకు నోచుకోవడం లేదు. రెగ్యులర్ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా, ఇంతవరకూ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. తాము చదువు చెప్పిన వాళ్ళు ఉన్నత స్థానాల్లోకి వెళ్ళినా, తమ పరిస్థితిలో మాత్రం మార్పు లేదని అధ్యాపకులు వాపోతున్నారు. వీరిలో పదవీ విరమణకు దగ్గరపడుతున్న అధ్యాపకులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్నవారు సైతం ఉండటం గమనార్హం. కాగా 60 ఏళ్ళు దాటిన కారణంగా రెండేళ్ళలో 11 మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను తొలగించారు. వీళ్ళంతా దాదాపు 30 ఏళ్ళుగా పనిచేస్తున్నవారు కావడం విశేషం. అయితే పర్మినెంట్ కాకపోవడంతో వీరికి ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందలేదు. మరోవైపు గత ఏడాది కాలంలో సర్వీస్‌లో ఉన్న ఏడుగురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు మృతి చెందారు. వీరు కనీసం ఎక్స్‌గ్రేషియాకు కూడా నోచుకోలేదు.

11 వర్సిటీల్లోనూ అధ్యాపకుల కొరత..

రాష్ట్రంలోని 11 యూనివర్సిటీల్లోనూ అధ్యాపకుల కొరత వేధిస్తోంది. అన్నిచోట్లా కాంట్రాక్టు అధ్యాపకులతోనే నెట్టుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో వర్సిటీల్లో

మిగతా 2వ పేజీలో ▶

ఆగిన 'సీతమ్మ సాగర్' పనులు

గ్రీన్ ట్రిబ్యునల్ ద్విసభ్య కమిటీని నియమించడంతో నిలిపివేత

- పని ప్రదేశం నుంచి కొంత మిషనరీ, కార్మికులు వెనక్కి
- గతంలో స్టే ఇచ్చినా పనులు కొనసాగడంపై ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన బాధితులు
- క్షేత్రస్థాయిలో పరిశీలించనున్న ద్విసభ్య కమిటీ



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరిపై చేపట్టిన సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. సీతమ్మ సాగర్ నిర్మాణ పనులకు సంబంధించి అభ్యంతరాలను లేవనెత్తుతూ కొందరు వేసిన పిటిషన్‌పై గ్రీన్ ట్రిబ్యునల్ ద్విసభ్య కమిటీని నియమించింది. గతంలో గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా ఏమైనా పనులు జరుగుతున్నాయా? లేదా ? అనే అంశాలను ద్విసభ్య కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలించనుంది. దీంతో బ్యారేజీ

మిగతా 2వ పేజీలో ▶

ఏప్రిల్‌లో స్టే.. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 320 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా బహుళార్థ సాధక ప్రాజెక్టుగా సీతారామ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం – దుమ్ముగూడెం మండలాల మధ్య గోదావరి నదిపై బ్యారేజీ నిర్మిస్తోంది. అయితే బ్యారేజీ నిర్మాణం కారణంగా గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాలు, పొలాలు, అడవులు మునిగిపోతాయనే ఆందోళన నెలకొంది. మరోవైపు నష్టపరిహారం సైతం తగు మొత్తం చెల్లించడం లేదంటూ రైతులు నిరసనలకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రాజెక్టు బాధితుల్లో కొందరు సరైన అనుమతులు తీసుకోకుండా బ్యారేజీ నిర్మాణ పనులు చేస్తున్నారంటూ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ 26న గ్రీన్ ట్రిబ్యునల్ పనులపై స్టే ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది.

4 వసంతాల నవచరిత

ఏపీ సీఎం వైఎస్ జగన్ పగ్గాలు చేపట్టి నాలుగేళ్లు

సంక్షేమాభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్ పరుగులు



ఏపీలో ముప్పై ఎనిమిది వేల స్కూళ్లు తమ రూపాన్ని మార్చుకున్నాయి. సకల సదుపాయాలతో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తయారయ్యాయి. గ్రామాల్లో రైతులకు భరోసానిచ్చేందుకు... ఏకంగా 10,778 ఆర్బీకేలు ఏర్పాటయ్యాయి. అవినీతికి తావులేని పౌర సేవల్ని ఏ ఊరికి ఆ ఊళ్లోనే అందించడానికి 15,004 గ్రామ, వార్డు సచివాలయాలు రూపుదిద్దుకున్నాయి. వైద్యుల్లేరనే మాటకు తావులేకుండా 10,592 గ్రామ, పట్టణ హెల్త్ క్లినిక్‌లు సేవలందిస్తున్నాయి. ఇవన్నీ సాధ్యమయింది కేవలం నాలుగేళ్లలో. 2019 మే 30న ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తరవాత!!. అందుకే ఇపుడు ఏపీ ఒక రోల్ మోడల్. 'నిన్నటికన్నా నేడు బాగుంటే.. అదే అభివృద్ధి. ఊరైనా... మనుషులైనా' అనేది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విధానం. ఈ సూత్రంతోనే ఆయన ప్రచారానికి విలువివ్వకుండా పని చేస్తూ పోతున్నారు.

అందుకే... గడిచిన నాలుగేళ్లూ ఆంధ్రప్రదేశ్‌కు కొత్త చరిత్ర.

ఇచ్చిన మాటే లక్ష్యంగా సుపరిపాలన

10లో

20 సార్లు కత్తితో పొడిచి.. తలపై మోది..



- దేశ రాజధాని ఢిల్లీలో ఓ పదహారేళ్ల బాలికను 20 ఏళ్ల యువకుడు అత్యంత పాశవికంగా అంతమొందించాడు. జేజే కాలనీలో ఉండే సాక్షి అనే బాలికకు ఫ్రిడ్జ్, ఏసీలు బాగుచేసే మెకానిక్ సాహిల్‌తో ప్రేమ వ్యవహారం ఉంది. వీరిద్దరూ శనివారం గొడవపడ్డారు. కోపం పెంచుకున్న సాహిల్ ఆమెపై కత్తితో దాడిచేసి 20సార్లకుపైగా పొడిచాడు. తర్వాత రోడ్డుపై పడి ఉన్న సిమెంట్ శ్లాబ్‌తో తలపై పలుమార్లు మోది చంపేశాడు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

6లో

ఔటర్ నిర్వహణకు 'గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే'



ఓఆర్ఆర్ లీజుపై మరో ముందడుగు

- స్పెషల్ పర్పస్ వెహికల్‌ను ఏర్పాటు చేసిన ఐఆర్‌బీ సంస్థ.. గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే – హెచ్ఎండీఏ మధ్య ఒప్పందంపై సంతకాలు
- 30 ఏళ్ల పాటు 'టోల్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్' బాధ్యతలు.. సర్వీస్‌రోడ్లు, పచ్చదనం పరిరక్షణకు పరిమితం కానున్న హెచ్‌జీసీఎల్

సాక్షి, హైదరాబాద్: నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లీజు వ్యవహారంలో ముందడుగు పడింది. 158 కిలోమీటర్ల ఓఆర్ఆర్ నిర్వహణ కోసం స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటైంది. లీజు ఒప్పందంలో భాగంగా 'ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే'ను ఎస్పీవీగా ఏర్పాటు చేశారు. ఇది ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా తరఫున ప్రాతినిధ్య సంస్థగా ఉంటుంది. ఈ మేరకు ఈ నెల 28న హెచ్ఎండీఏతో కుదుర్చుకున్న లీజు ఒప్పందంపై ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

31న గోపన్‌పల్లికి సీఎం

తెలంగాణ బ్రాహ్మణ సదన్ ప్రారంభించనున్న కేసీఆర్

గచ్చిబౌలి: నగర శివారులోని గోపన్‌పల్లి ప్రభుత్వం నిర్మించిన తెలంగాణ బ్రాహ్మణ సదన్‌ను సీఎం కేసీఆర్ ఈనెల 31న ప్రారంభించనున్నారు. మంగళవారం ఉదయం 7:30 గంటల నుంచి చండీయాగం, సుదర్శనయాగం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను, సైబరాబాద్ పోలీసులు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. సీఎం కేసీఆర్‌తోపాటు పలువురు మంత్రులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

రెజ్లర్లకు ఇచ్చే గౌరవం ఇదేనా?: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లింగ్ ఫెడరేషన్ చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో నిరసన చేపట్టిన భారతీయ రెజ్లర్లపై పోలీసులు వ్యవహరించిన తీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. 'చాంపియన్లపై వ్యవహరిస్తున్న తీరును ప్రపంచం గమనిస్తోందం'టూ పద్మశ్రీ అవార్డు గ్రహీత సాక్షిమాలిక్ చేసిన ట్వీట్‌పై కేటీఆర్ స్పందించారు. 'రెజ్లర్లపై ఈ తరహా వైఖరి ఎందుకో కేంద్ర ప్రభుత్వంలో బాధ్యత కలిగిన నాయకులు ఎవరైనా చెప్పగలరా?. ప్రపంచ వేదికపై మనకు విజయాలు సాధించిపెట్టిన రెజ్లర్లకు మన మద్దతు, గౌరవం అందించాల్సిన అవసరం ఉంది' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

అన్ని జిల్లాల్లో వ్యసన విముక్తి కేంద్రాలు

సాక్షి, హైదరాబాద్: అన్ని జిల్లాల్లో వ్యసన విముక్తి కేంద్రాలు (డీ–అడిక్షన్ సెంటర్స్) ఏర్పాటుచేశామని వైద్య విద్యా సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ రమేశ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రుల్లో 34 వ్యసన విముక్తి కేంద్రాలు పని చేస్తున్నాయన్నారు. వీటిల్లో డ్రగ్, ఆల్కహాల్ సహా ఇతర వ్యసనపరులకు చికిత్స అందిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని మెంటల్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్, గాంధీ ఆసుపత్రి, వరంగల్ ఎంజీఎంతో సహా ఇతరచోట్లా వీటిని ఏర్పాటు చేశామన్నారు.

3 నుంచి 'ప్రొ.జయశంకర్ బడిబాట'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నెల 3 నుంచి 17 వరకు 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. సదరు మార్గదర్శకాలను సోమవారం అన్ని జిల్లాల డీఈవోలు, ఇతర విద్యాశాఖ అధికారులకు పంపింది. గ్రామాలు, గ్రామశివార్లలో బడిమానేసిన పిల్లలను తిరిగి బడుల్లో చేర్పించేందుకు ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్న విషయాన్ని ఉపాధ్యాయులు ప్రతీ గ్రామ పరిధిలో పిల్లల తల్లిదండ్రులకు తెలపాలని, పిల్లల్ని సమీపంలోని అంగన్‌వాడీలు, స్కూళ్లలో చేర్పించాలని సమగ్రశిక్ష డైరెక్టరేట్ తన ఆదేశాల్లో పేర్కొంది.

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

ఎంపీ ఆర్.కృష్ణయ్య



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య కోరారు. దేశవ్యాప్తంగా బీసీల సంక్షేమానికి రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి బీసీల ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జాతీయ బీసీ కమిషన్(ఎన్సీబీసీ) చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాంకు సోమవారం వినతిపత్రం అందించారు. బీసీ సంఘాల నేతలు కర్రి వేణుమాధవ్, డాక్టర్ పద్మలత, పరుశురాం ఎన్సీబీసీ చైర్మన్‌తో భేటీ అయ్యారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు అమలు చేసే బీసీ పథకాలకు 60 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

వడదెబ్బతో ఇద్దరు మృతి

హుజూర్‌నగర్: వడదెబ్బతో సూర్యాపేట జిల్లాలో ఇద్దరు మృతిచెందారు. హుజూర్‌నగర్ పట్టణంలోని దీక్షిత్‌నగర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికురాలు పల్లపు మరియమ్మ (60), దద్దనాల చెరువు కాలనీకి చెందిన వృద్ధుడు పఠాన్ ముస్తఖ్‌ఖాన్ (74) వడదెబ్బకు నీరసించి అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

అధికారి హత్య కేసులో సర్కార్‌కు సుప్రీం నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అటవీ అధికారి శ్రీనివాసరావు హత్య కేసులో నిందితులకు బెయిల్ మంజూరుపై వైఖరి తెలియజేయాలని తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. హైకోర్టు ఆదేశాలను సవాల్‌చేస్తూ బెయిల్ కోసం నిందితులు మడకం తుల, పొడియం నంగ దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ కేవీ విశ్వనాథ్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. అనంతరం ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

ములుగు జిల్లా యువకుడితో వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని గిరిజన తండాకు చెందిన యువతికి వివాహమైంది. మొదటి సంతానంగా కుమార్తె జన్మించింది. రెండోసారి కూడా ఆడపిల్ల పుట్టబోతోందని తెలుసుకొని ఆరు నెలల కిందట నర్సంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో భర్తకు తెలియకుండా గర్భస్రావం చేశారు. తర్వాత గర్భస్రావంపై భర్త చేసిన గొడవ వైరల్‌గా మారింది.

వరంగల్ శ్రీనివాస కాలనీలోని ఓ ఆస్పత్రిలో ఏప్రిల్ 27న ఓ మహిళకు అబార్షన్ చేయడం వివాదాస్పదమైంది. ఖిలా వరంగల్‌కు చెందిన ఓ మహిళతో కరీమాబాద్‌కు చెందిన వ్యక్తితో ఆరునెలల క్రితం పెళ్లి అయింది. గర్భం దాల్చిన ఆమెకు కడుపు నొప్పిగా ఉండటంతో తల్లి, సోదరుడితో కలిసి ఆస్పత్రికి వెళ్లగా.. అక్కడ చేసిన అబార్షన్ బయటపడి పోలీసు కేసు వరకు వెళ్లింది.

మహబూబాబాద్ జిల్లా గంగారం మండలానికి చెందిన ఓ మహిళకు మొదటి కాన్పులో ఆడపిల్ల పుట్టింది. రెండోసారి ఆడబిడ్డే అని స్కానింగ్‌లో తెలుసుకున్న ఆ మహిళ నర్సంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. అక్కడి వైద్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి గర్భస్రావం చేశారు. దీనిపై అప్పట్లో అధికారులు విచారణ జరిపినా చర్యలు తీసుకోలేదు.

కడుపులోనే కరిగిస్తున్నారు!

<u>సాక్షి ప్రతినిధి, వరంగల్</u>

కాసులకు కక్కుర్తిపడుతున్న కొందరు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు, వైద్య సిబ్బంది లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ కడుపులోని బిడ్డను కరిగించేస్తున్నారు. ఆడపిల్లలు వద్దనుకునే వారి బలహీనతను ఆసరాగా చేసుకొని లింగనిర్ధారణ పరీక్షల పేరుతో విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్నారు. రెండేళ్ల కిందట హైదరాబాద్‌కు చెందిన వైద్యాధికారులు బృందాలుగా ఏర్పడి ఉమ్మడి వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఆస్పత్రులు, సెంటర్లపై పోలీసులతో కలిసి డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. దీంతో కొంతకాలం దందాకు అడ్డుకట్టపడింది. అనంతరం మళ్లీ ఈ దందా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో సాగుతోంది. దీనిని అరికట్టకపోతే 2031 జనాభా లెక్కల నాటికి ఆడపిల్లల సంఖ్య గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉందన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

అమ్మ కడుపులోనే ఆడశిశువుల భ్రూణహత్యలు

- నిబంధనలకు విరుద్ధంగా గర్భవిచ్ఛిత్తి
- కొన్ని స్కానింగ్ కేంద్రాలు, ఆస్పత్రుల దందా
- రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో దారుణాలు
- అరికట్టకపోతే పెను ప్రమాదం
- 2031 జనాభా గణన నాటికి తగ్గనున్న ఆడపిల్లల సంఖ్య



ఆందోళన కలిగిస్తున్న గణాంకాలు

గర్భస్థ లింగ నిర్ధారణ నేరం అని అన్ని స్కానింగ్ కేంద్రాల్లో, ఆస్పత్రుల్లో బోర్డు కనిపిస్తుంది. కానీ ఆయా కేంద్రాల నిర్వాహకులు, వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పవిత్రమైన వైద్య వృత్తికే కళంకం తెస్తున్నారు. వైద్యారోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణలోపంతో ఆడశిశువులు భ్రూణహత్యకు గురవుతున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 3,50,03,674. 2011లో దేశంలోని మొత్తం జనాభాలో 2.89 శాతం. జాతీయ జనాభా కమిషన్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ గణాంకాల ప్రకారం 2021లో తెలంగాణ జనాభా 3,77,25,000 కాగా, 2031 నాటికి 3,92,07,000కు చేరుకోగలదని అంచనా. ఇవి 2021, 2031 సంవత్సరాల్లో వరుసగా దేశ జనాభాలో 2.77 శాతం, 2.66 శాతం. 2011 గణాంకాల ప్రకారం రాష్ట్రంలో లింగ నిష్పత్తి (ప్రతి వెయ్యిమంది పురుషులకు మహిళల సంఖ్య) 988 కాగా, వివిధ జిల్లాల్లో ఇది 950 నుంచి 1046 వరకు నమోదైంది.

రాష్ట్రంలో జనాభా (రాష్ట్ర గణాంక సంక్షిప్త నివేదిక ప్రకారం)

మొత్తం జనాభా	3,50,03,674
పురుషులు	1,76,11,633 (50.31%)
స్త్రీలు	1,73,92,041 (49.69%)

దేశంలో లింగనిష్పత్తి మెరుగ్గా ఉన్న ఐదు రాష్ట్రాల్లో (ప్రతి వెయ్యిమంది పురుషులకు మహిళల సంఖ్య)

రాష్ట్రం	2011	2001	పెంపు
పుదుచ్చేరి	1,038	1,001	+37
కేరళ	1,084	1,058	+26
ఏపీ	992	978	+14
తమిళనాడు	995	986	+9
ఛత్తీస్‌గఢ్	991	990	+1

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవు



పోలీసు శాఖ సహకారంతో స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నాం. సంబంధిత చట్టంపై ఆరోగ్య సిబ్బంది ద్వారా గర్భిణులకు అవగాహన కల్పిస్తాం. మొదట ఆడ సంతానం కలిగి ఉండి తిరిగి గర్భం దాల్చిన వారిపై ప్రత్యేక దృష్టి పెడతాం. స్వచ్ఛంద సంస్థలు ఐసీడీఎస్, మెప్మాతో కలిసి స్కానింగ్ కేంద్రాలపై నిఘా పెంచుతాం. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే 104 లేదా 1098 లేదా డయల్ 100కు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ సాంబశివరావు, డీఎంహెచ్‌ఓ, హనుమకొండ

రాష్ట్రంలో లింగనిష్పత్తి మెరుగ్గా ఉన్న ఐదు జిల్లాలు (ప్రతి వెయ్యిమంది పురుషులకు మహిళల సంఖ్య)

జిల్లా	లింగ నిష్పత్తి	పురుషులు	స్త్రీలు
నిర్మల్	1,046	3,46,721	3,62,697
నిజామాబాద్	1,044	7,68,477	8,02,545
జగిత్యాల	1,036	4,84,079	5,01,338
కామారెడ్డి	1,033	4,78,389	4,94,236
మెదక్	1,027	3,78,634	3,88,774

లింగనిష్పత్తి దారుణంగా ఉన్న ఐదు జిల్లాలు... (ప్రతి వెయ్యిమంది పురుషులకు మహిళల సంఖ్య)

జిల్లా	లింగ నిష్పత్తి	పురుషులు	స్త్రీలు
రంగారెడ్డి	950	12,43,967	11,82,276
హైదరాబాద్	954	20,18,575	19,24,748
మేడ్చల్	957	12,56,883	12,03,212
వనపర్తి	960	2,94,883	2,82,925
సంగారెడ్డి	965	7,77,235	7,50,393

బేటీ బచావో బేటీ పఢావోతో అవగాహన

బాలురకు దీటుగా బాలికల సంఖ్యను పెంచేందుకు బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. అవకతవకలకు పాల్పడే స్కానింగ్ సెంటర్ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటున్నాం.

–సంతోష్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి

లేడీ కానిస్టేబుల్‌తో స్టింగ్ ఆపరేషన్..

- లింగనిర్ధారణ పరీక్షల ముఠా గుట్టు రట్టు.. ప్రభుత్వ డాక్టర్లు సహా 18 మంది అరెస్ట్



మొబైల్ స్కానర్లను పరిశీలిస్తున్న సీపీ

వరంగల్ క్రైం: లింగనిర్ధారణ పరీక్షలు జోరుగా సాగుతున్నాయన్న సమాచారం మేరకు వరంగల్ కమిషనరేట్ పోలీసులు.. మహిళా కానిస్టేబుల్‌తో స్ట్రింగ్ ఆపరేషన్ నిర్వహించి పరీక్షలు చేస్తున్న ముఠా గుట్టును రట్టు చేశారు. ముఠాలోని ప్రభుత్వ డాక్టర్లతో సహా 18 మందిని అరెస్ట్ చేశారు. సీపీ రంగనాథ్ సోమవారం ఈ ముఠా వివరాలను విలేకరులకు వెల్లడించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కొన్ని మండలాల్లో ఆడ, మగ పిల్లల నిష్పత్తిలో తేడాలు పెద్దగా ఉండడంతో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు అనుమానం వచ్చింది. దీనిపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. వేముల ప్రవీణ్ అనే వ్యక్తి సులభంగా డబ్బులు సంపాదించేందుకు భార్య సంధ్యారాణితో కలసి హనుమకొండ గోపాల్‌పూర్ ప్రాంతంలోని వెంకటేశ్వరకాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని పోర్టబుల్ స్కానర్ల సహాయంతో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నాడు. ఆర్ఎంపీలు, పీఆర్‌ఓలు, హాస్పిటల్ మేనేజ్‌మెంట్, సిబ్బంది, డాక్టర్లతో కలసి ఒక నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకొని దందా నడిపిస్తున్నాడు. ఆడపిల్ల అని తేలితే గర్భస్రావం కోసం హనుమకొండతోపాటు వరంగల్ జిల్లా నెక్కొండ, నర్సంపేటలలోని పలు ఆస్పత్రులకు పంపిస్తున్నాడు. ఒక్కో గర్భస్రావానికి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు డబ్బులు వసూలు చేస్తున్నారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్, టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా ఓ మహిళా కానిస్టేబుల్‌తో స్ట్రింగ్ ఆపరేషన్ చేపట్టింది. వారి పరిశీలనలో లింగనిర్ధారణ పరీక్షలు వాస్తవమని తేలడంతో నిందితుడు వేముల ప్రవీణ్‌తోపాటు అతని భార్య, పలువురు ప్రభుత్వ డాక్టర్లు, మరికొంతమంది సిబ్బంది మొత్తం 18 మందిని అరెస్ట్ చేశారు. ఈ ముఠా ఇప్పటివరకు 100కు పైగా గర్భస్రావాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఇక్కడికి రాష్ట్రం నలు మూలలనుంచి గర్భిణులు పరీక్షల కోసం వస్తున్నట్లు నిర్ధారించారు. కాగా, ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న డాక్టర్లపై శాఖా పరమైన చర్యలు ఉంటాయని వరంగల్, హనుమకొండ జిల్లాల వైద్యశాఖాధికారులు సాంబశివరావు, వెంకటరమణ తెలిపారు.

ఔటర్ నిర్వహణకు 'గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే'

▶ మొదటి పేజీ తరువాయి

సంతకాలు చేసింది. ఇక నిర్ణీత 120 రోజుల గడువు లోపు లీజు మొత్తం రూ.7,380 కోట్లను చెల్లించి ఔటర్ నిర్వహణ బాధ్యతలను చేపడతామని ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వీరేంద్ర డి.మహిస్కర్ తెలిపారు. ఔటర్ ప్రాజెక్టును తాము ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నట్టు చెప్పారు.

నిర్వహణ అంతా 'గోల్కొండ'దే..

ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)కు అనుబంధంగా ఉన్న హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ఔటర్ రింగ్‌రోడ్డు నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షిస్తోంది. ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాతో కుదిరిన లీజు ఒప్పందం మేరకు వచ్చే 30ఏళ్ల పాటు 'ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే' సంస్థ.. ఓఆర్ఆర్‌పై వాహనాల నుంచి టోల్ వసూలు చేయడం, రహదారుల నిర్వహణ, అవసరమైన మరమ్మతులు చేపట్టడం, ఇతర ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) బాధ్యతలను చేపట్టనుంది. హెచ్‌జీసీఎల్ ఇక ఓఆర్ఆర్‌ను అనుకుని ఉన్న సర్వీస్ రోడ్లు, ఔటర్ మాస్టర్‌ప్లాన్ అమలు, పచ్చదనం పరిరక్షణ వంటి బాధ్యతలకు పరిమితం కానుంది.

టోల్ రుసుముపై హెచ్ఎండీఏ పర్యవేక్షణ

2006లో హైదరాబాద్ మహానగరం చుట్టూ 8 లేన్లతో ఔటర్‌రింగ్‌రోడ్డును నిర్మించారు. 2018 నాటికి ఇది పూర్తయింది. జాతీయ రహదారుల సంస్థ 2008 నాటి నిబంధనల ప్రకారం ఇప్పటివరకు టోల్ చార్జీ వసూలు చేస్తున్నారు. భవిష్యత్తులోనూ టోల్ రుసుము పెంపుపై హెచ్ఎండీఏ నియంత్రణ, పర్యవేక్షణ ఉంటాయని అధికారులు చెప్తున్నారు.

ఏకమొత్తంగా రూ.7,380 కోట్ల చెల్లింపు!

'టోల్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (టీఓటీ) విధానంలో ఔటర్ రింగ్‌రోడ్డును 30 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు గతేడాది ఆగస్టు 11న ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అదే సంవత్సరం నవంబర్ 9న అంతర్జాతీయ సంస్థల నుంచి హెచ్ఎండీఏ టెండర్లను ఆహ్వానించింది. ఈ ఏడాది మార్చి 31 నాటికి 11 బిడ్లు వచ్చాయి. ఇందులో చివరికి 4 సంస్థలు తుది అర్హత సాధించగా.. ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాకు టెండర్ దక్కింది. ఒప్పందం మేరకు లీజు మొత్తం రూ.7,380 కోట్లను ఐఆర్‌బీ సంస్థ ఒకేసారి చెల్లిస్తుందని, ఇందులో ఎలాంటి మినహాయింపులు లేవని హెచ్ఎండీఏ అధికారి ఒకరు చెప్పారు. ఒప్పందంలోని నిబంధనలన్నింటినీ కచ్చితంగా అమలు చేస్తామని.. మొత్తం నిధులు చెల్లించాకే ఔటర్ బాధ్యతలను అప్పగిస్తామని తెలిపారు.

ట్విన్ టవర్స్!



ఉన్నతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

సమీపంలోనే ట్విన్ టవర్లు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. స్థలం ఎంపిక పూర్తయిన వెంటనే ట్విన్ టవర్ల నిర్మాణాన్ని చేపడతామని ప్రకటించారు.

ఘనంగా దశాబ్ది ఉత్సవాలు

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరగాలని, ఈ మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. జూన్ 2 నుంచి రోజువారీగా నిర్వహించనున్న కార్యక్రమాల విషయంలో.. సంబంధిత శాఖలు తీసుకుంటున్న చర్యలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి సీఎం కేసీఆర్‌కు వివరించారు.

జూన్ 9 నుంచి కుల వృత్తులకు ఆర్థిక సాయం

కుల వృత్తులకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎంబీసీ కులాలు, రజక, నాయీ బ్రాహ్మణ, పూసల, బుడగ జంగాల తదితర వృత్తి కులాలు, సంచార జాతుల ప్రజలకు దశల వారీగా రూ.లక్ష ఆర్థిక సాయం అందించి ఆదుకుంటుందని చెప్పారు. ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలను మరో రెండు రోజుల్లో ఖరారు చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి, మంత్రివర్గ ఉప సంఘం చైర్మన్ గంగుల కమలాకర్ ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు వివరించారు. దీంతో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జూన్ 9న నిర్వహించ తలపెట్టిన సంక్షేమ దినోత్సవం సందర్భంగా ఈ ఆర్థిక సాయం పంపిణీని ప్రారంభించాలని కేసీఆర్ ఆదేశించారు.

అమరుల స్మారకం వద్ద తెలంగాణ తల్లి విగ్రహం

సచివాలయంలో సమీక్ష అనంతరం సీఎం కేసీఆర్ లుంబినీ పార్కు స్థలంలో నిర్మిస్తున్న తెలంగాణ అమరుల స్మారకం వద్దకు చేరుకుని పనులను పరిశీలించారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. అమరుల స్మారకానికి ముందున్న విశాలమైన స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని.. విగ్రహానికి రెండు వైపులా అద్భుతమైన ఫౌంటెయిన్లతో సుందరంగా తీర్చిదిద్దాలని ఆర్అండ్‌బీ ఈఈ శశిధర్‌కు సూచించారు. దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్నన్ని రోజులు అమరుల స్మారకం వద్దకు వచ్చే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కొత్త సచివాలయ నిర్మాణం నేపథ్యంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా బీఆర్‌కేఆర్ భవన్ వద్ద నిర్మించిన వంతెనలను పరిశీలించారు.

ఆగిన 'సీతమ్మ సాగర్' పనులు

▶ మొదటి పేజీ తరువాయి

నిర్మాణ పనులు నిలిపివేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే పని ప్రదేశం నుంచి కొంత మిషనరీ, కార్మికులను వెనక్కి రప్పించింది. ఒకటి రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో పనులు నిలిపివేయనుంది.

బాధితుల ఫిర్యాదుతో..

గ్రీన్ ట్రిబ్యునల్ నిర్ణయాన్ని పునః పరిశీలించాలని కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు సీడబ్ల్యూసీ నుంచి పూర్తి స్థాయిలో అనుమతి పొందేందుకు తుది డీపీఆర్‌ను సిద్ధం చేశారు. అదే సమయంలో ప్రాజెక్టు నిర్మాణానికి అనుకూలమైన వేసవికాలం వృథా కాకూడదనే ఉద్దేశంతో బ్యారేజీ అనుబంధ పనులు కొనసాగిస్తూ వచ్చారు. దీంతో బాధితులు మరోసారి గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. పనులకు సంబంధించి కొన్ని ఫొటోలను సైతం సమర్పించారు. ఈ నేపథ్యంలోనే ట్రిబ్యునల్ ద్విసభ్య కమిటీని నియమించింది. మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్ రీజనల్ డైరెక్టర్ (హైదరాబాద్), గోదావరి బోర్డులో ఎస్ఈ ర్యాంక్‌కు తక్కువ కాని వారు సభ్యులుగా ఉండాలని ఆదేశించింది. సభ్యుల ఎంపిక పూర్తయిన తర్వాత కమిటీ జూన్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టనుంది. జూలై 12లోగా ఈ కమిటీ తమ నివేదికను అందించాల్సి ఉంటుంది.

ఆ ముద్ర పడకూడదని..

తెలంగాణలో చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వడంలో కేంద్రం తాత్సారం చేస్తోందనే ఆరోపణలు మొదట్నుంచీ ఉన్నాయి. ముఖ్యంగా 'సీతారామ' డిజైన్ల విషయంలో కొర్రీల మీద కొర్రీలు వేస్తూ వస్తోంది. ఈ సమయంలో గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారనే ముద్ర పడటం మంచిది కాదనే అభిప్రాయంతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఉన్నట్టు సమాచారం. ఈ కారణంగానే బ్యారేజీ, కరకట్టల దగ్గర జరుగుతున్న పనులు ఆపేయాలంటూ నిర్మాణ సంస్థలకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తోంది. దీనిపై వివరణ కోసం ఇంజనీర్లను సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

'డీఎస్సీ-1998' అభ్యర్థులకు ఉద్యోగాలివ్వండి

సాక్షి,హైదరాబాద్: రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా డీఎస్సీ–1998 క్వాలిఫైడ్ అభ్యర్థులందరికీ ఉద్యోగాలిచ్చి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డీఎస్సీ–1998 సాధన సమితి కోరింది. సోమవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని సాధన సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ నేతృత్వంలో ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం అందజేసింది. త్వరలో జరిగే మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో చర్చించి, సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించాలని బృందం కోరింది. ఈ విషయమై కేబినెట్ దృష్టికి తీసుకెళ్తానని, న్యాయం చేస్తామని మంత్రి హామీనిచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు.

అంతులేని వ్యథ!

▶ మొదటి పేజీ తరువాయి

ఖాళీలు, ప్రస్తుతం పని చేస్తున్న అధ్యాపకుల తాజా లెక్కలను విద్యాశాఖ తేల్చింది. 2021 జనవరి 31వ తేదీనాటికి 11 వర్సిటీల్లో 2,837 మంజూరైన పోస్టులు ఉంటే అందులో ఏకంగా 1,869 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంటే 968 మంది (34.12 శాతం) మాత్రమే రెగ్యులర్ అధ్యాపకులు ఉన్నారు. ప్రస్తుతం 157 మంది ప్రొఫెసర్లు ఉండగా 238 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 129 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు ఉండగా, 781 పోస్టులు, 682 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు పని చేస్తుండగా 850 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖ లెక్కలు తేల్చింది. అయితే 1869 ఖాళీల్లో 1,061 పోస్టుల భర్తీకి ప్రభుత్వం మూడేళ్ల కిందటే ఆమోదం తెలిపినా ఇంతవరకు భర్తీ చేయలేదు.

61.65% ప్రొఫెసర్ పోస్టులు ఖాళీ..

ఉన్నత విద్యాశాఖ లెక్కల ప్రకారం.. రాష్ట్రంలో ఒక్క ప్రొఫెసర్ కూడా లేని వర్సిటీలు ఆరు ఉన్నాయి. శాతవాహన, మహత్మాగాంధీ, పాలమూరు, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీల్లో ఒక్క ప్రొఫెసర్ కూడా లేరు. శాతవాహన, ఆర్‌జీయూకేటీ, బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు కూడా లేరు. పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్ ఒకరే ఉన్నారు. మొత్తంమీద 11 యూనివర్సిటీల్లో 61.65 శాతం ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 85.82 శాతం అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, 55.48 శాతం అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఓయూలో సగానికిపైగా పోస్టులు ఖాళీగా ఉండగా కేయూలో కేవలం ఒక్కరే ప్రొఫెసర్ ఉండగా, అసోసియేట్ ప్రొఫెసర్లు ఇద్దరే ఉన్నారు. శాతవాహన, ఆర్‌జీయూకేటీ, అంబేడ్కర్ వర్సిటీల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లెవరూ లేరు.

యూజీసీ పే కమిషన్ అమలు చేయాలి

కాంట్రాక్టు అధ్యాపకులతోనే ఓయూ విద్యా వ్యవస్థ నడుస్తోంది. యూజీసీ నిబంధనల ప్రకారం మాకు అన్ని అర్హతలు ఉన్నాయి. కాబట్టి 7వ పే కమిషన్ వేతనాలు ఇవ్వాలి.

– డాక్టర్ డి.ధర్మతేజ (ఓయూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షుడు)

నా బిడ్డ కోసమైనా ఉద్యోగం ఇవ్వండి

పదేళ్లు ఓయూలో కాంట్రాక్టు అధ్యాపకుడిగా పని చేసిన నా భర్త గత ఏడాది చనిపోయారు. ఇప్పటికీ ఎలాంటి ఆర్థిక సాయం అందలేదు. నాకు ఉద్యోగం ఇవ్వమని అడుగుతున్నా పట్టించుకోవడం లేదు. పర్మినెంట్ అయితే ఇవన్నీ లభించేవి. నాకు రెండేళ్ళ పాప ఉంది. కుటుంబ పోషణ కష్టంగా ఉంది. నా బిడ్డ మొఖం చూసైనా ఉద్యోగం ఇస్తారని ఆశ పడుతున్నా.

– రాజేశ్వరి (చనిపోయిన కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీకాంత్ భార్య)

24 ఏళ్ల సర్వీసుకు గుర్తింపు లేదు

కాంట్రాక్టు అధ్యాపకురాలిగా 24 ఏళ్ళుగా పనిచేస్తున్నా. రీసెర్చ్‌లో 25 ఏళ్ళ అనుభవం ఉంది. పరీక్షల నిర్వహణలో 15 ఏళ్ళు సర్వీస్ ఉంది. పర్మినెంట్ అవుతుందని ఎదురుచూస్తుండగానే రిటైర్‌మెంట్ దగ్గర (సెప్టెంబర్‌లో) పడింది. నా సర్వీస్‌కు గుర్తింపు లేకపోవడం దురదృష్టకరం.

– డాక్టర్ అనిత కుమారి (నిజాం కాలేజీ జువాలజీ డిపార్ట్‌మెంట్ అధ్యాపకురాలు)

వర్సిటీల్లో మొత్తం పోస్టుల వివరాలు..

కేటగిరీ	మంజూరు	ఖాళీ	పనిచేస్తున్నది
ప్రొఫెసర్	395	238	157
అసోసియేట్ ప్రొఫెసర్	910	781	129
అసిస్టెంట్ ప్రొఫెసర్	1532	850	682
మొత్తం	2,837	1,869	968

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయండి

సీఎం కేసీఆర్‌కు తమ్మినేని లేఖ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో రెగ్యులరైజ్ కాని కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. గతంలో కొందరిని రెగ్యులరైజ్ చేసినా ఇతర లెక్చరర్లను పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని 417 ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్లు, డిగ్రీ కాలేజీలో 553 మంది కాంట్రాక్టు లెక్చరర్లను పరిగణనలోకి తీసుకోలేదని వివరించారు.

రెండ్రోజులు అక్కడక్కడా తేలికపాటి వానలు

సాక్షి, హైదరాబాద్: రెండ్రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీనికి సమాంతరంగా దక్షిణ తెలంగాణ పరిసర ప్రాంతాల్లో మరొక ఆవర్తనం ఏర్పడింది. సముద్ర మట్టం నుంచి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఇది కొనసాగుతోంది. మరోవైపు దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, రాయలసీమ మీదుగా తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రెండ్రోజులు అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించింది. పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్ నుంచి 44డిగ్రీల సెల్సియస్ మధ్య, గ్రేటర్ హైదరాబాద్ సమీప జిల్లాల్లో మాత్రం 39 డిగ్రీల సెల్సియస్ నుంచి 41డిగ్రీల మధ్యన గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వివరించింది. సోమవారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రత జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో 44.7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	జిల్లా	గరిష్ట ఉష్ణోగ్రత
మల్లాపూర్	జగిత్యాల	44.7
ఇబ్రహీంపేట	నల్లగొండ	44.4
నిడమనూరు	నల్లగొండ	44.2
నేలకొండపల్లి	ఖమ్మం	44.0
అర్లి	ఆదిలాబాద్	44.0

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
నిజామాబాద్	41.6	29.4	మహబూబ్‌నగర్	41.0	27.6
నల్లగొండ	41.5	24.4	భద్రాచలం	40.8	28.0
ఖమ్మం	41.4	30.0	మెదక్	40.0	24.5
ఆదిలాబాద్	41.3	28.5	హైదరాబాద్	39.6	28.5
రామగుండం	41.2	29.6	హకీంపేట్	39.0	26.1
హనుమకొండ	41.0	26.0	దుండిగల్	39.0	26.0

క్లుప్తంగా...

టీపీసీసీ ఎన్నికల కమిషన్ సమన్వయ కమిటీ చైర్మన్‌గా నిరంజన్



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ ఎన్నికల కమిషన్ సమన్వయ కమిటీని పునర్వ్యవస్థీకరించారు. ఈ మేరకు సోమవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం కమిటీ చైర్మన్‌గా టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్, కన్వీనర్‌గా పి.రాజేశ్‌కుమార్, కమిటీ సభ్యులుగా ఎం.రామచంద్రారెడ్డి, నరేంద్ర తన్నీర్, జీవీ రామకృష్ణ, జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ వాజిద్ హుస్సేన్‌లను నియమించారు.

మీ కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కింది

కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్‌ను అభినందించిన వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: 'కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి మీరు చాలా కష్టపడ్డారు.. మీ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కింది' అంటూ ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల కితాబునిచ్చారు. బెంగళూరులోని డీకే నివాసంలో ఆయనతో భేటీ అయిన షర్మిల.. డీకేను అభినందించారు. ఈ సందర్భంగా మహానేత వైఎస్సార్‌తో సాన్నిహిత్యాన్ని డీకే గుర్తు చేసుకున్నారు.

మతమార్పిడి ఆపకపోతే బుల్లెట్లు దించుడే..

ఎంపీ సోయం బాపూరావ్



ఆదిలాబాద్ రూరల్: అమాయక ఆదివాసీ ఆడ పిల్లలను మత మార్పిడి చేయడాన్ని క్రిస్టియన్, ముస్లిం మతస్తులు వెంటనే మానుకోవాలని, లేకపోతే వారికి బుల్లెట్లు దించాల్సిన పరిస్థితి వస్తుందని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ హెచ్చరించారు. మతం మారిన ఆదివాసీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో జన జాతి సురక్ష మంచ్ ఆధ్వర్యంలో గిరిజన సాంస్కృతిక పరిరక్షణ ర్యాలీ, బహిరంగ సభ సోమవారం నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ సోయం బాపూరావ్ మాట్లాడుతూ.. చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించామని తెలిపారు. ఆ కేసుపై వాదనలు కొనసాగుతున్నాయని, ఆదివాసీలకు అనుకూలంగా తీర్పు వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆదివాసీ ఆడపిల్లలకు ఉద్యోగం వచ్చిందంటే చాలు ఏవో మాయమాటలు చెప్పి మత మార్పిడి చేయిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మహారాష్ట్ర కిన్వట్, పాండ్రకవడ ఎమ్మెల్యేలు కేరం భీంరావ్, సందీప్ దుర్వే, జన జాతి సురక్ష సమితి ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ హెచ్‌కే నాగు తదితరులు ఉన్నారు.

9 ఏళ్లుగా పేదల సంక్షేమంలోనే..

మోదీ పాలనపై కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్

- మోదీ పాలన విజయాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- కె. లక్ష్మణ్, బండి సంజయ్ ఇతర నేతలతో కలిసి పుస్తకావిష్కరణ, ప్రత్యేక గీతం విడుదల
- రాష్ట్రంలో నెలపాటు చేపట్టనున్న ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం



పుస్తకాన్ని విడుదల చేస్తున్న కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్, బండి సంజయ్, డా.లక్ష్మణ్, ఈటల

సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో వేసిన ప్రతి అడుగూ పేదల సంక్షేమం చుట్టూతే తిరిగిందని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. పేదలను దృష్టిలో పెట్టుకొనే ప్రతి నిర్ణయం, ప్రతి పథకాన్ని అమలు చేశారన్నారు. యూపీఏ పాలన అవినీతికి మారుపేరుగా నిలిస్తే మోదీ ప్రభుత్వం అవినీతిరహిత, పారదర్శక పాలన అందిస్తోందన్నారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో సాధించిన విజయాలపై సోమవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్లో కేంద్ర మంత్రి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అలాగే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె. లక్ష్మణ్ తదితరులతో కలసి 9 ఏళ్ల పాలనలో విజయాలపై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. రాష్ట్రంలో 'మహాజన సంపర్క్ అభియాన్' పేరిట నెల రోజులపాటు చేపట్టనున్న ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

డీబీటీతో నేరుగా లబ్ధిదారులకే నిధులు...

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మేఘ్‌వాల్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల నిధులు లబ్ధిదారులకు నేరుగా చేరేలా ప్రధాని మోదీ డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ)కు శ్రీకారం చుట్టారన్నారు. ఉపాధి హామీ పథకం మొదలు ఆవాస్ యోజన, ఇతర పథకాలను క్షేత్రస్థాయిలో సరిగ్గా అమలు చేయకపోతే తదుపరి విడత నిధులు విడుదల కాకుండా జియో ట్యాగింగ్, ఇతర రూపాల్లో జవాబుదారీతనాన్ని తీసుకొచ్చారన్నారు. పీఎం ఆవాస్ యోజన కింద 3.5 కోట్ల ఇళ్లు, దేశవ్యాప్తంగా 11 కోట్ల 72 లక్షల మందికి టాయిలెట్లు, జల్ జీవన్ మిషన్ కింద 12 కోట్ల ఇళ్లకు శుద్ధి చేసిన తాగునీరు, ఉజ్వల యోజన కింద 9. 60 కోట్ల మందికి ఉచితంగా వంటగ్యాస్ కనెక్షన్లు, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద కోవిడ్ సమయంలో 80 కోట్ల మందికి ప్రతినెలా ఉచితంగా రేషన్, ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రూ. 5 లక్షల వరకు ఉచితంగా వైద్య చికిత్సల వంటి ఎన్నో పథకాలను సామాన్యుల కోసం మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందని మేఘ్‌వాల్ వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్, అభియాన్ కన్వీనర్ ప్రదీప్ కుమార్, సభ్యులు యెండల లక్ష్మీనారాయణ, ఎన్వీ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వరకే రాజకీయాలు: సంజయ్

ఎన్నికల వరకే రాజకీయాలు... ఆ తర్వాత అభివృద్ధే లక్ష్యంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తెలిపారు. గత పాలనలోని మంచి కార్యక్రమాలను అమలు చేస్తున్న ఘనత మోదీదేనన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ పేరుతో రాష్ట్ర ప్రజలకు వాస్తవాలను తెలియజేసేందుకే ప్రజల్లోకి వెళుతున్నామని చెప్పారు.



గగ్గలపల్లిలో మహిళా రైతుతో మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి

5 నెలల్లో బీఆర్‌ఎస్ పాలన నుంచి ప్రజలకు విముక్తి

- పేదల భూముల జోలికొస్తే ప్రభుత్వాన్ని కూలుస్తాం
- సర్కారు లాక్కున్న భూములను తిరిగి అప్పగిస్తాం
- పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

సాక్షి, నాగర్‌కర్నూల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో భయం నీడలో బతుకుతున్న తెలంగాణ సమాజానికి ఐదు నెలల్లో విముక్తి కల్పిస్తామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ఇందిరమ్మ రాజ్యం వస్తేనే ప్రజలంతా స్వేచ్ఛాయుత వాతావరణంలో బతుకుతారన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని గగ్గలపల్లి, మంతటి గ్రామాల మీదుగా పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 74వ రోజైన సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా స్థానిక రైతులతో భట్టి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన భూములను బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాక్కుంటోందని ఆరోపించారు. దళితులు, బలహీనవర్గాల భూముల జోలికొస్తే సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని కూలుస్తామని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాక్కున్న భూములను తాము అధికారంలోకి వచ్చాక తిరిగి అప్పగిస్తామని భట్టి చెప్పారు. నాగర్‌కర్నూల్ మండలం గగ్గలపల్లిలోని సర్వే నంబర్ 183లో దళితులకు ఇచ్చిన 200 ఎకరాలను ప్రభుత్వం ధరణి పోర్టల్‌లో బ్లాక్‌లిస్టులో ఉంచడం దారుణమన్నారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడెకరాలు ఇస్తామని బీఆర్‌ఎస్ హామీ ఇచ్చి... దాన్ని నెరవేర్చకపోగా వారి భూములనే లాక్కోవడం అన్యాయమని చెప్పారు.

ఒక్క ప్రాజెక్టూ పూర్తి చేయలేదు..

ధనిక రాష్ట్రంలో సంపదనంతా కేసీఆర్ ప్రభుత్వం దోచుకోవడంతో కొలువులు లేక నిరుద్యోగులు, ఇళ్లు లేక పేదలు, పెన్షన్లు అందక వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని భట్టి అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టి పదేళ్లు పూర్తవుతున్నా ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం నిర్మిస్తే బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు కనీసం పిల్ల కాల్వలను సైతం తవ్వలేకపోయిందని ఎద్దేవా చేశారు. కానీ కాంగ్రెస్ పూర్తి చేసిన కాల్వలపై బీఆర్‌ఎస్ నేతలు శిలాఫలకాలు వేస్తూ ఫొటోలు దిగుతున్నారని విమర్శించారు. ఆరుగాలం కష్టించిన పంటను అమ్ముకోలేక రైతులంతా రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసి ఇబ్బందులు పడుతుంటే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గాడిదలు కాస్తున్నారా? అని ప్రశ్నించారు.

రఘునందన్‌కు పరువు నష్టం నోటీసు

- రూ.1,000 కోట్లకు దావా వేస్తామన్న ఐఆర్‌బీ సంస్థ
- వ్యాఖ్యలు ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్
- లీగల్ నోటీసు జారీ



సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు.. తమ సంస్థపై తప్పుడు, నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ అభ్యంతరం వ్యక్తం చేసింది. పరువు నష్టం దావా వేస్తామంటూ సోమవారం లీగల్ నోటీసు ఇచ్చింది. తమ సంస్థపై చేసిన వ్యాఖ్యలు, ఆరోపణలను బహిరంగంగా ఉపసంహరించుకోని పక్షంలో సివిల్, క్రిమినల్ కేసులు దాఖలు చేయడంతో పాటు రూ.1,000 కోట్లకు దావా వేస్తామని ఆర్‌డీ అసోసియేట్స్ అడ్వకేట్ల ద్వారా ఇచ్చిన నోటీసులో తెలిపింది. ఈ నెల 26న రఘునందన్‌రావు బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు, ఆరోపణలు.. ఐఆర్‌బీ ప్రతిష్టను దిగజార్చడంతో పాటు భవిష్యత్తు వ్యాపారానికి ఆటంకం కలిగించేవిగా ఉన్నాయని పేర్కొంది. ఎమ్మెల్యే వ్యాఖ్యలు అన్ని పత్రికల్లో ప్రచురితం కావడంతో తమ క్లయింట్ల ప్రతిష్టకు తీవ్ర భంగం వాటిల్లిందని ఆర్‌డీ అసోసియేట్స్ పేర్కొంది. ఆర్‌టీఐ కార్యకర్తల హత్య కేసులో సీబీఐ క్లోజర్ రిపోర్ట్‌ను కోర్టుకు సమర్పించడంతో పాటు తమ క్లయింట్ల సంస్థకు క్లీన్‌చిట్ ఇవ్వగా, తమ క్లయింట్ హత్య చేయించారంటూ తీవ్రమైన ఆరోపణలు చేయడం గర్హనీయమని పేర్కొంది. పుణే సెషన్స్ కోర్టు, బాంబే హైకోర్టు కూడా దీనినే సమర్థించాయని న్యాయవాదులు వివరించారు. దోషులుగా తేలేవరకు అందరూ నిర్దోషులేనన్న ప్రాథమిక సూత్రాన్ని మరిచి తమ క్లయింట్‌పై తప్పుడు నేరం మోపడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపారు. ఐఆర్‌బీ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారంటూ ఆరోపణలు చేశారని, ఇది కూడా తమ క్లయింట్స్ ప్రతిష్టను దెబ్బతీసిందన్నారు.

ఎస్సీ ఉపకులాలకూ 'దళితబంధు' ఇవ్వాలి

- ఇందిరాపార్కు వద్ద ఎస్సీ ఉపకులాల మహాధర్నాలో ఆర్.కృష్ణయ్య
- లేదంటే సీఎం కేసీఆర్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరిక
- సంఘీభావం తెలిపిన ఆర్‌ఎస్పీ, తీన్మార్ మల్లన్న



57 ఎస్సీ ఉపకులాల మహాధర్నాలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య.

కవాడిగూడ: దళితబంధు పేరుతో సీఎం కేసీఆర్ 57 ఎస్సీ ఉపకులాలను మోసగిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. ఈ పథకాన్ని ఎస్సీ ఉపకులాలకూ అందించాలని లేదంటే వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో 57 ఎస్సీ ఉపకులాలు మహాధర్నా నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ఆర్.కృష్ణయ్యతోపాటు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, తీన్మార్ మల్లన్న, ఇతర దళిత నాయకులు హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ దళితబంధు పథకాన్ని బీఆర్‌ఎస్ నేతలు, ఎమ్మెల్యేల బంధువులకే ఇస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జనాభా జనగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కపటప్రేమ పట్ల దళితులు అప్రమత్తంగా ఉండాలని ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ సూచించారు. దళితుల రాజ్యాధికారం కోసం కృషి చేస్తున్న బీఎస్పీకి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలని కోరారు. బడుగు, బలహీన వర్గాలు రాజ్యాధికారం చేపడితేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని తీన్మార్ మల్లన్న అన్నారు.

జగిత్యాల యువకుడి కోసం ఎన్‌ఐఏ వేట

ఆచూకీ చెబితే రూ.2 లక్షల రివార్డు



అబ్దుల్ సలీం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: పీఎఫ్‌ఐ కేసులో నిందితుడిగా ఉన్న జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇస్లాంపురాకు చెందిన అబ్దుల్ సలీం కోసం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) వేట ముమ్మరం చేసింది. అతని ఆచూకీ తెలిపిన వారికి రూ. 2 లక్షల రివార్డు ప్రకటించింది. దీంతోపాటు, అతడిని పట్టుకునేందుకు ఎన్‌ఐఏ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

నిజామాబాద్ నుంచి మొదలు..: గతంలో నిజామాబాద్ కేంద్రంగా జరిగిన ఉగ్ర శిక్షణపై నిఘా పెట్టిన ఎన్‌ఐఏ గత సెప్టెంబర్ 18న రాష్ట్రవ్యాప్తంగా 38 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించింది. నిషేధిత పీఎఫ్‌ఐతో సంబంధాలున్న పలువురు కార్యకర్తలను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టింది. కాగా, నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మార్షల్ ఆర్ట్స్ పేరిట 200 మందికి ఉగ్ర శిక్షణ ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే గత సెప్టెంబర్‌లో ఎన్‌ఐఏ రంగంలోకి దిగింది. జగిత్యాలలో ఏడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి ఇస్లాంపురాకు చెందిన మహ్మద్ ఇర్ఫాన్‌ను ఎన్‌ఐఏ అధికారులు అరెస్టు చేశారు. అదే సమయంలో అబ్దుల్ సలీంను నిందితుడిగా చేర్చారు. అప్పటి నుంచి అతని ఆచూకీ లేకపోవటంతో ఎన్‌ఐఏ ఈనెల 18న రివార్డు ప్రకటించింది. సలీం వాస్తవానికి మహారాష్ట్రకు చెందిన వాడని, ఇస్లాంపురాలో అద్దెకుంటూ ఫర్నిచర్ వర్క్‌షాప్‌లో పని చేశాడని స్థానికులు చెబుతున్నారు.

ఉద్యోగాల్లేవు కానీ | అప్పుల పాలు చేశారు

మెగా జాబ్‌మేళాలో మాజీ ఎంపీ పొంగులేటి



ఖమ్మం మయూరిసెంటర్: గత ఎన్నికల సమయంలో ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్.. ఉద్యోగం మాటేమో కానీ, ప్రతీ ఇంటిని అప్పుల పాలు చేశారని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. స్థానికంగా సోమవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్ సీఎం సొంత మనుషుల కోసమేనని, ముందే పేపర్ లీక్ చేసి ఉద్యోగాలు ఇప్పించుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మెగా జాబ్‌మేళాకు 120 కంపెనీలు 10 వేల ఖాళీలతో హాజరయ్యాయని, 21 వేల మంది ఇంటర్వ్యూల కోసం పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. 10 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బొర్రా రాజశేఖర్, తుళ్లూరి బ్రహ్మయ్య, వూకంటి గోపాలరావు, జారె ఆదినారాయణ, డాక్టర్ కోటా రాంబాబు, విజయబాయి, వైరా మున్సిపల్ చైర్మన్ సూతగాని జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని పార్టీల్లో అడుగడుగునా | కేసీఆర్ కోవర్టులు

▶ మొదటి పేజీ తరువాయి

మింగేస్తారని వ్యాఖ్యానించారు.

నాకే రివర్స్ కౌన్సెలింగ్ ఇస్తున్నారు

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావులను కాంగ్రెస్, మరే ఇతర పార్టీలో చేరకుండా ఇప్పటిదాకా జరిపిన చర్చల ద్వారా ఆపగలిగానని ఈటల చెప్పారు. తమ చర్చల్లో వారు అనేక అంశాలను ప్రస్తావించడంతోపాటు తనకే రివర్స్ కౌన్సెలింగ్ ఇస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయని నవ్వుతూ చెప్పారు. వారితో బీజేపీ హైకమాండ్ చర్చలు జరుపుతోందన్నారు. ఖమ్మం జిల్లా సంప్రదాయకంగా కమ్యూనిస్టులకు, కాంగ్రెస్‌కు పట్టున్న జిల్లా అన్న విషయం అందరికీ తెలిసిందేనని.. అయితే బీజేపీలో పొంగులేటి, జూపల్లి చేరడం కష్టమేనని తాను అనని మాటలను అన్నట్టుగా కొందరు ప్రచారం చేస్తున్నారని ఈటల మండిపడ్డారు. ప్రభుత్వం, అధికార పార్టీ రాజకీయాలు, అధికారుల ఒత్తిళ్లను ఎదుర్కొని మరీ ప్రజల అండదండలతో హుజూరాబాద్‌లో గెలవగలిగానన్నారు. కేసీఆర్‌పై గజ్వేల్‌లో పోటీచేస్తానని తాను ప్రకటించగానే.. అక్కడా తనకు ప్రజల మద్దతు పెరిగిందని, సోషల్‌మీడియాలో 72 శాతానికిపైగా పోలింగ్ నమోదైందని చెప్పారు.

అమరవీరుల స్తూపం నుంచి | గాంధీభవన్ వరకు

- రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున కాంగ్రెస్ ర్యాలీ
- 'దశాబ్ది దగా' పేరిట రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ర్యాలీలు
- ఉత్సవాల నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- హరీశ్‌రావు అధికార అహంకారంతో మాట్లాడుతున్నారు: టీపీసీసీ నేతలు మహేశ్‌కుమార్‌గౌడ్, నిరంజన్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. ఆవిర్భావ దినోత్సవాన్ని 'దశాబ్ది దగా' పేరుతో కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించిన టీపీసీసీ జూన్ 2న అమరవీరుల స్తూపం నుంచి గాంధీభవన్ వరకు వేలాది మందితో ర్యాలీ నిర్వహించనుంది. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ ర్యాలీలు చేపట్టనుంది. గాంధీభవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించడంతోపాటు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అప్పటి పార్టీ ఎంపీలు, తెలంగాణ ఉద్యమకారులకు ఘనంగా సన్మానం చేయనుంది. అదేవిధంగా 20 రోజులపాటు కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా తెలంగాణలో గత తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను, జరిగిన విధ్వంసాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లనుంది. ఇందుకు సంబంధించిన కార్యాచరణను నేడో, రేపో విడుదల చేయనుంది.

ప్రజలు ఆలోచించాలి: మహేశ్‌కుమార్‌గౌడ్

తెలంగాణ రాష్ట్ర సాధన ఎలా సాధ్యమైందో, ఎవరి కారణంగా రాష్ట్రం వచ్చిందో తెలంగాణ ప్రజలు ఆలోచించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షులు నిరంజన్, చెరుకు సుధాకర్, సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, సమీరుల్లాతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ నలిగిపోయిందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమాన్ని అణచివేసిన వారంతా ఇప్పుడు ఆయన కేబినెట్‌లో మంత్రులుగా ఉన్నారని, ఆచరణ సాధ్యం కాని హామీలనిచ్చి కేసీఆర్ ప్రజలందరినీ మోసం చేశారన్నారు. సోనియాగాంధీ స్థానంలో ఇంకెవరున్నా తెలంగాణ ఏర్పాటయ్యేది కాదని, ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలు గ్రహించాలని కోరారు.

హరీశ్‌కు కనపడలేదా..: నిరంజన్

అమరవీరులను కించపరిచేలా మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలున్నాయని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ మండిపడ్డారు. అవతరణ వేడుకలను నిర్వహించకుండా కాంగ్రెస్ అడ్డుకుంటోందని ఆయన చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈనెల 26న జరిగిన సమావేశంలోనే రాష్ట్ర అవతరణ వేడుకల నిర్వహణపై కాంగ్రెస్ నిర్ణయం తీసుకున్న విషయం ఆయనకు కనపడటం లేదా అని ప్రశ్నించారు. హరీశ్ అధికార అహంకారంతో మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ నేతల వితండ వాదనలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

వ్యవసాయానికే తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యం

వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: దశాబ్ది ఉత్సవాలు వ్యవసాయ శాఖతో ప్రారంభం కావడం గర్వకారణమని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం వ్యవసాయానికి, రైతాంగానికి ఇస్తున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనమన్నారు. సోమవారం సచివాలయంలో వ్యవసాయశాఖలో దశాబ్ది ఉత్సవాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 3న రైతు వేదికలను సుందరంగా ముస్తాబు చేయాలని, రాష్ట్రంలో వ్యవసాయ విజయాలను తెలియపరుస్తూ పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఆయా మార్కెట్ల పరిధిలో ఉత్తమ రైతులు, ఉత్తమంగా, నాణ్యమైన పంటలు పండించే రైతులను గుర్తించి సత్కరించాలని మంత్రి తెలిపారు.

నువ్వు దేవుడిని మరిచిపోయావా? ఒకవేళ నువ్వు మరిచినా, ఆయన నిన్ను మరిచిపోలేదు.
- జుడాయిజం

సాక్షి
మంగళవారం, 30 మే 2023

నవభారత నారీశక్తి

పెరుగుతున్న మహిళాశక్తికి ఇది మరో నిదర్శనం. 2022కి గాను ఇటీవల ప్రకటించిన సివిల్ సర్వీస్ పరీక్షా ఫలితాల్లో కృతార్థులైన అభ్యర్థుల్లో మూడోవంతు మంది, మరో మాటలో 34 శాతం ఆడవారే! తొలి 4 ర్యాంకులూ మహిళలవే! ఇంకా చెప్పాలంటే, అగ్రశ్రేణిలో నిలిచిన పాతిక మంది అభ్యర్థుల్లో 14 మంది స్త్రీలే! ఈ లెక్కలన్నీ మారుతున్న ధోరణికి అద్దం పడుతున్నాయి. ప్రపంచంలోనే అతి క్లిష్టమైన ఈ మూడు దశల పరీక్షలో యువతులు ఇలా అగ్రపీఠిన నిలవడం ఇదే తొలిసారి కాకున్నా, వరుసగా కొన్నేళ్ళుగా వారు ఇలాంటి ఫలితాలు సాధిస్తున్న తీరు అసాధారణం. అంతేకాక, ఒకే ఏడాది ఇంతమంది యువతులు సివిల్స్‌కు ఎంపికవడం ఇదే ప్రప్రథమం. సివిల్ సర్వీసుల్లో ఏయేటి కాయేడు స్త్రీల వాటా పెరుగుతుండడం సానుకూల ధోరణి. అంతకు మించి ఆనందదాయకం.

గణాంకాలు గమనిస్తే, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎంపిక చేస్తున్నవారిలో మహిళల వాటా 2018లో 24 శాతమైంది. 2021లో అది 26 శాతానికి ఎగబాకింది. తాజాగా 2022 పరీక్షల్లో అది గణనీయంగా 34 శాతానికి హెచ్చింది. సంఖ్యాపరంగా చూస్తే, ఈసారి మొత్తం 933 మంది అభ్యర్థులకు సివిల్స్‌లో చోటు దక్కగా, వారిలో 320 మంది స్త్రీలే. ఇది ఒక్కరోజులో, రాత్రికి రాత్రి జరిగిన పరిణామం కాదు. దశాబ్దాల పరిణామక్రమంలో చోటుచేసుకున్న మార్పు. అనేక ఇతర రంగాల లాగే సివిల్స్ సైతం ఒకప్పుడు పూర్తిగా పురుషాధిక్యమైనదే. 2006 వరకు యూపీఎస్సీ ఎంపిక చేసే మొత్తం అభ్యర్థుల సంఖ్యలో దాదాపు 20 శాతమే మహిళలు. ఇక, ఇంకాస్త వెనక్కి వెళితే, 1980ల్లో, 1990ల తొలినాళ్ళలో వారి సంఖ్య 20 శాతం కన్నా తక్కువే. ఆ గత చరిత్ర మారి, ఈసారి 34 శాతం మహిళలు సివిల్స్ ఉద్యోగానికి లేఖలు అందుకోవడం గణనీయమైన మార్పు.

భారతదేశంలో విస్తృత సివిల్ సర్వీస్ వ్యవస్థలోకి ప్రతిభావంతులైన యువతీ యువకులను ఏటా ప్రవేశపెట్టే యూపీఎస్సీ పరీక్ష అత్యంత కష్టమైనది. చైనాలో జాతీయ కాలేజ్ ప్రవేశపరీక్ష గావోకవో లాంటి ఒకటి, రెండే ప్రపంచంలో ఈ స్థాయి క్లిష్టమైనవంటారు. ఏటా మూడు దశల్లో సాగే ఈ కఠిన పరీక్షకు ఏటా దాదాపు 10 లక్షల మంది లోపు దరఖాస్తు చేసుకుంటే, అందులో 1 శాతం కన్నా తక్కువ మందే రెండో దశ అయిన లిఖిత పరీక్ష (మెయిన్స్)కు చేరుకుంటారని లెక్క. అలాంటి పోటీ పరీక్షలో గత ఏడాది కూడా సివిల్స్‌లో తొలి 4 ర్యాంకులూ మహిళలకే దక్కాయి. వరుసగా రెండోసారి ఈ ఏడాదీ అదే ఫలితం పునరావృతమవడం విశేషం. గమనించాల్సింది ఏమిటంటే – వైద్యప్రవేశ పరీక్షలు 'నీట్'లోనూ ఈ ఏడాది యువతులదే అగ్రస్థానం. జాతీయస్థాయిలో 12వ తరగతి బోర్డ్ పరీక్షా ఫలితాల్లోనూ గత అయిదేళ్ళుగా అబ్బాయిల కన్నా అమ్మాయిలదే పైచేయి.

సివిల్స్‌లో ప్రథమ స్థానంలో నిల్చిన ఇషితా కిశోర్ మొదలు మూడో స్థానం దక్కిన తెలుగమ్మాయి ఉమా హారతి సహా సివిల్స్‌లో నెగ్గిన అనేకమంది అభ్యర్థుల ఆశలు, ఆకాంక్షలు, జీవితంలోని కష్టనష్టాలను ఎదిరించి నిలిచిన వారి పట్టుదల, సహనం స్ఫూర్తిదాయకం. కృతనిశ్చయులైతే... కులం, మతం, ప్రాంతం, లింగ దుర్విచక్షణ లాంటి అనేక అవరోధాలను అధిగమించి సమాజంలోని అన్ని వర్గాల నుంచి వనితలు విజేతలుగా అవతరించడం సాధ్యమని ఈ విజయగాథలు ఋజువు చేస్తున్నాయి. నిష్పాక్షికంగా, అత్యంత సంక్లిష్ట ప్రక్రియగా సాగే సివిల్స్ పరీక్షల్లో అమ్మాయిలు ఈ తరహా విజయాలు సాధిస్తూ, ఉన్నతోద్యోగాలకు ఎంపికవడం విశేషం. ఒకపక్కన కార్పొరేట్ ప్రపంచం సైతం సీనియర్ హోదాల్లో లింగ వైవిధ్యం సాధించడానికి కష్టపడుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వ అధికార యంత్రాంగ సర్వీసులో ఈ స్థాయిలో మహిళలకు ప్రాతినిధ్యం దక్కడం చరిత్రాత్మకమే!

అయితే ఇది చాలదు. నిజానికి, ప్రభుత్వ పాలనలో లింగ సమానత్వంపై యూఎన్‌డీపీ 2021 నివేదిక ప్రకారం అనేక ఇతర దేశాలతో పోలిస్తే మనం వెనకబడే ఉన్నాం. ప్రభుత్వ ఉన్నతోద్యోగాల్లో స్త్రీల వాటా స్వీడన్‌లో 53 శాతం, ఆస్ట్రేలియాలో 40 శాతం, సింగపూర్ 29 శాతం కాగా, భారత్ వాటా కేవలం 12 శాతమేనట. ప్రస్తుత మహిళా విజయగాథ మరింత కాలం కొనసాగినప్పుడే ఈ లోటు భర్తీ అవుతుంది. ఇప్పటికీ జమ్ము- కశ్మీర్, జార్ఖండ్ సహా అనేక రాష్ట్రాల్లో అవసరానికి తగ్గ సంఖ్యలో అసలు ఐఏఎస్‌లే లేరన్న పార్లమెంటరీ సంఘం నివేదికను చెవికెక్కించుకోవాలి. అయితే, కేవలం సివిల్స్‌లోనో, మధ్యశ్రేణి ఉద్యోగాల్లోనో స్త్రీల ప్రాతినిధ్యం పెరిగితే సరిపోదు. నేటికీ పితృస్వామిక భావజాలం, ఆడవారు ఇంటికే పరిమితమనే మనస్తత్వం మన సమాజంలో పోలేదన్నది చేదు నిజం. అందుకు తగ్గట్లే... మన జాతీయ శ్రామికశక్తిలో పనిచేసే వయసులోని మహిళల వాటా కూడా తక్కువే. ప్రపంచ బ్యాంక్ లెక్కల ప్రకారం 2005లో 35 శాతమున్న వనితల వాటా, 2021లో 25 శాతానికి పడిపోయింది. వెలుగు వెనుకే ఉన్న ఈ చీకటి ఓ విషాదం.

కాకపోతే, మునుపటితో పోలిస్తే లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యల సంఖ్య తగ్గింది. ఆధునిక మహిళ ఒకప్పటితో పోలిస్తే విద్య, ఉద్యోగాల్లో బంధనాలను తెంచుకుంది. ఆటల నుంచి ఆర్మ్డ్ సర్వీసుల దాకా అన్నింటా తాను పురుషుడితో సమానంగా ముందడుగు వేస్తోంది. ఈ పరిస్థితుల్లో ఇంట్లో ఒత్తిళ్ళు, పనిప్రదేశాల్లో అభద్రత, నగరాల్లోనూ నాసిరకపు ప్రజారవాణా దుఃస్థితిని మార్చాలి. లింగ దుర్విచక్ష లేని పనిసంస్కృతిని ప్రోత్సహించాలి. సమాజంలో దుర్లక్షణాలున్నా వాటిని దాటుకొని పడతులు పైకి రావడం సాధ్యమేనని తాజా సివిల్స్ ఫలితాలు ఆశావాదాన్ని ప్రోది చేస్తున్నాయి. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన ఈ ధోరణి గ్రామాలకూ విస్తరించడం శుభవార్త. ఇలాంటి మహిళా విజేతలు మరింత పెరిగితేనే, మన యువభారతం... నవభారతం అవుతుంది.

గ్రహం అనుగ్రహం


శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.దశమి ఉ.10.05 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** హస్త రా.3.34 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** ఉ.10.54 నుండి 12.36 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.03 నుండి 8.55 వరకు, తదుపరి రా.10.52 నుండి 11.34 వరకు, **అమృతఘడియలు:** రా.9.11 నుండి 10.53 వరకు.

సూర్యోదయం: 5.29
సూర్యాస్తమయం: 6.26
రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు

ఎన్నికల దండమా?

'కర్రపుల్ల'తో అధికారం నిలబడాలేగానీ, దాని కోసం వెంపరలాడే ముందుపీఠిలో రాజకీయ నాయకులే ఉంటారు. ఏ రుజువులూ లేకపోయినా 'సెంగోల్' కర్రపుల్లని 'రాజదండం'గా తెరమీదకు తెచ్చారు. కర్ణాటక తమ చేజారిపోగా, ఇప్పుడు రంగం తమిళనాడుకు మారింది. 'సెంగోల్' పదం 'సికోలు' నుంచి వచ్చింది. దీనికి జనసామాన్యంలో అర్థం చర్నాకోల అనే. దాన్ని ఎవరి మీద ఝళిపించాలి?

రెండోమాట



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

మన దేశంలో ఇంకా 'భారత ప్రజలమైన మేము' అని సగర్వంగా తొల్లింటి దేశ లౌకిక రాజ్యాంగానికి సమ్మతిని ప్రకటిస్తూ, భారత రిపబ్లిక్‌కు ముందుమాటగా చేసిన ప్రతిజ్ఞకు విలువ ఉందా? రాజ్యాంగం 368వ అధికరణ ప్రకారం, లౌకిక రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని మార్చడానికి ఏ విభాగానికీ హక్కు లేదని దేశ అత్యున్నత న్యాయస్థానం కేశవానందభారతి, ఇందిరాగాంధీకి సంబంధించిన కేసులలో స్పష్టం చేసింది. బహుళ సంస్కృతులకు, విభిన్న మత విశ్వాసాలకు భారత సెక్యులర్ (లౌకిక) రాజ్యాంగ వ్యవస్థ నిలయమని స్పష్టం చేసింది. 14–16 అధికరణల కింద సమాన శ్రమకు సమాన వేతనం పొందే హక్కు ఉందన్న రాజ్యాంగ హక్కును 1979 నుంచి 1990 మధ్యకాలంలో ఆరు కేసులలో సుప్రీంకోర్టు ఖాయ పరిచింది. ఈ కేసులన్నింటిలోనూ ఉన్నత న్యాయస్థానాలు రాజ్యాంగం తొలి ప్రతిజ్ఞకే కట్టుబడి ఉన్నాయి. కట్టుబడనిదల్లా కొన్నాళ్లు కాంగ్రెస్ పాలకవర్గమూ, ఆ తరువాత వాజ్‌పేయి హయామును మినహాయించి మిగతా 'హిందూత్వ' పాలక వర్గాలూ! వీటన్నింటి దుష్ఫలితంగా – చివరికి దేశ సర్వ సేనాపతి, రాజ్యాంగ సంరక్షకులైన రాష్ట్రపతి హోదానే కించపరిచే దుఃస్థితికి నేటి పాలకవర్గం పాల్పడింది. ఈ 'డ్రామా' కోసం విశ్వసనీయమైన రుజువులూ, పత్రాలూ లేకపోయినా 'సెంగోల్'ను కనిపెట్టారు.

నిజానికి 'కర్రపుల్ల'తో అధికారం నిల బడాలేగానీ, ఆ 'పుల్ల' కోసం వెంపరలాడే ముందుపీఠిలో రాజకీయ నాయకులే ఉంటారు. 'సెంగోల్' కర్రపుల్లను 'రాజదండం'గా చిత్రించడానికి చరిత్రకారులైన శివనాగిరెడ్డిని, బాజ్జీరావును సహాయం కోరడం మరీ విచిత్రం. 'నంది' ధ్వజ రూపంలో ఉన్న 'సెంగోల్' పదానికి అర్థం వేరని ఎవరోగాదు, ఆ చరిత్ర పరిశోధకులే దాచుకోకుండా వెల్లడించాల్సి వచ్చింది. అసలు 'సెంగోల్' పదం 'సికోలు' పదం నుంచి వచ్చింది. చోళుల కాలం నుంచి ఈ 'సికోలు'కు జనసామాన్యంలో అర్థం చర్నాకోల అనే. ఇది లేకుండా పరిపాలన నడవదా? ఒకవేళ అది చేతిలో ఉన్నా ఎవరిమీద ఝళిపించాలి? అన్ని రాజ్యాంగ గ్యారంటీలను నేడు కోల్పోతున్న సామాన్య పౌరుల మీదా? పౌర హక్కుల ఉద్యమాల మీదా? మహిళా క్రీడాకారుల మీదా? వారిని లైంగిక దృష్టితో న్యూనపరచడానికి ప్రయత్నించి ఎదురుబొంక జూచిన బీజేపీ ఎంపీ మీదనా? పాలకుల నుంచి ఈ క్షణం దాకా సమాధానం లేదు, రాదు. అయినా పాలకుల దృష్టి మాత్రం 'దంతకథ'గా మిగిలిపోయిన 'సెంగోల్' రాజదండంపై నుంచి తొలగదు.

ఆ మాటకొస్తే ఆది నుంచీ, తలపెట్టిన నూతన పార్లమెంట్ భవన నిర్మాణం కూడా మోదీ అడుగుల్లోనే సాగుతూ వచ్చింది. అప్పుడూ దేశాధిపతి రాష్ట్రపతిని, ఉపరాష్ట్రపతిని ఆహ్వానానికి దూరం చేశారు. రాష్ట్రపతిగా తన ప్రతిపత్తికి బాహాటంగా జరుగుతున్న అవమానాన్ని ఆమె దిగమింగుకున్నా చూసే ప్రజలు మాత్రం పసిగట్టేశారు.

ఇప్పుడిక దేశానికి తొల్లింటి ప్రకటిత లౌకిక రాజ్యాంగం లేదు. 'భారత ప్రజలమైన మేము' అని ప్రకటించుకోగల సత్తాను క్రమంగా కోల్పోవలసిన దుఃస్థితులు దాపురించాయి. తొల్లింటి లౌకిక రాజ్యాంగం ఇంకా బతికి ఉండాలన్నా; ప్రజల, పీడిత వర్గాల, దళిత, బహుజన వర్గాల మౌలిక ప్రయోజనాలు నెరవేరి, మనుగడ నిలవాలన్నా; తాము మరింత చైతన్యం పొందే వరకూ నేటి పరిస్థితుల్లో విశ్వసనీయమైన ఏకైక దుర్గం – 2025 ఆఖరి దాకా భారత సుప్రీంకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తిగా చైతన్యమూర్తి అయిన చంద్రచూడ్ కొనసాగడం. ఈ అవకాశాన్ని బలవంతంగా మార్చడానికి పాలక శక్తులు రకరకాల 'విన్యాసాల'కు పాల్పడతాయి. వాటిలో ఒకటి ఎలాంటి అధికారాలు లేని అనధికార 'దళాలు'. పిలిస్తే చాలు 'కేరాఫ్' రోడ్స్! చూడరాదూ–ఉన్నట్టుండి, నూతన పార్లమెంట్ ప్రారంభోత్సవమూ, గాంధీజీ హత్యకు ప్రణాళిక పన్నాడన్న ఆరోపణను అనివార్యంగా భరించాల్సి వచ్చిన 'హిందూత్వ' సిద్ధాంతకర్తలలో ఒకరైన సావర్కార్ జన్మదినాన్ని నూతన పార్లమెంట్ ఆవిష్కరణ రోజునే జరపడమూ, పాత పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో అదే రోజున సావర్కార్‌కు నివాళులు అర్పించడమూ జరిగింది.

అన్నింటికన్నా గమనించదగిన అంశం – సెక్యులర్ రాజ్యాంగం కళ్ల ఎదుటనే యజ్ఞాలు, పూజ పునస్కారాలతో సర్వకార్య క్రమాలకు తెర లేపడం. దక్షిణాదిని ఉత్తరాది 'జయించే' విశ్వ ప్రయత్నాలలో తొలిమెట్టుగా కర్ణాటక రాష్ట్రం బీజేపీ చేజారిపోగా, ఇప్పుడు రంగం పక్కనున్న



తమిళనాడుకు మారింది. తమిళనాడును జయించే మార్గాలలో భాగంగానే సంబంధం లేని 'రాజదండం'గా ప్రచారంలోకి ఎక్కిన 'సెంగోల్' దుడ్డుకర్ర కొంతమంది 'స్వాముల' ద్వారా చేతికి చిక్కింది. ఫ్యూడల్ సంస్కృతి, పెట్టుబడిదారీ వ్యవస్థ తాలూకు అవలక్షణాలు కలగలిసి పోయిన వ్యవస్థలో నిజం కోసం తాపత్రయం మాత్రం ఆగదు. 'నిరుద్ధ భారతం' రచనలో దేశభక్తుడైన మంగిపూడి వెంకటశర్మ 'శ్రుతి ప్రమాణములు జాతులు నాలు గెయంచు చెప్పగా ఐదవ జాతి ఎక్కడిదొ? ఆర్య మహా జనులార, చెప్పరే' అని సూటిగా ప్రశ్నించాడు. 'నాస్తితు పంచమః' (పంచమజాతి అంటూ ఏదీ లేదు) అని మనుస్మృతి చెప్పినా చెవుల్లో పోసుకున్న 'సీసం' బయటకు రాదు. పాబ్లో నెరూడా వీరుల గురించి అంటాడు: 'వాళ్లు చనిపోలేదు, కాల్చే తుపాకీ గొట్టం ముందు నిటారుగా నిలబడ్డార'ని! అలాగే మన కవి శివసాగర్... పీడనా దోపిళ్ల నుంచి, ప్రజాకంటకుల నుంచి జన సామాన్యాన్ని విముక్తం చేసి సామ్యవాద ప్రజాస్వామిక యుగాన్ని ఆవిష్కరిచుకోవల్సిన అవసరాన్ని గుర్తు చేశాడు ('అమరత్వం' కవిత):

"విత్తనం చనిపోతూ
పంటను వాగ్దానం చేసింది
చిన్నారి పువ్వు రాలిపోతూ
చిరునవ్వుతో కాపును వాగ్దానం చేసింది...
సూర్యాస్తమయం చేతిలో చేయివేసి
సూర్యోదయాన్ని వాగ్దానం చేసింది
అమరత్వం రమణీయమైంది
అది కాలాన్ని కౌగిలించుకొని
మరో ప్రపంచాన్ని వాగ్దానం చేసింది."

అదే రేపటి సామ్యవాద ప్రజాస్వామిక యుగావిష్కరణం కావాలి. అంతేగానీ కావలసినవి అభినవ రాచరికాలూ, రాజదండాలూ కాదు!

abkprasad2006@yahoo.co.in

ఇది చరిత్రాత్మకం!

భారతదేశం పురోగమన దిశగా వేసిన అడుగులను చూపుతూనే, సంస్కృతీ సంప్రదాయాల పునాది మీద నిర్మితమైనదే ఈ కొత్త పార్లమెంట్ భవనం. పాత భవనం తొమ్మిదిన్నర దశాబ్దాల నాటిది. పైగా బ్రిటిష్ కట్టడం. స్వతంత్ర భారతదేశంలో కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించుకుని, ప్రజాస్వామ్యానికి దేవాలయం వంటి ఆ భవనాన్ని జాతికి అంకితం చేసిన మే 28వ తేదీకి చరిత్రలో స్థానం ఉంటుంది.

అభిప్రాయం



పి. వేణుగోపాలరెడ్డి

ఆధునిక ప్రపంచంలో గణనీయమైన శక్తిగా భారత్ ఉనికిని చాటుకుంటున్నది. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్న దేశం మనది. వీటన్నిటికీ రూపాన్నీ, తాత్త్వికతనీ ఇచ్చేది అత్యున్నత చట్టసభ. స్వతంత్ర భారతదేశంలో కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించుకుని, ప్రజాస్వామ్యానికి దేవాలయం వంటి ఆ భవనాన్ని జాతికి అంకితం చేసిన మే 28వ తేదీకి చరిత్రలో స్థానం ఉంటుంది.

ఏ విధంగా చూసినా కొత్త పార్లమెంట్ భవనం అవసరం కాదనలేనిదే. పాత పార్లమెంట్ భవనం తొమ్మిదిన్నర దశాబ్దాల నాటిది. పైగా బ్రిటిష్ కట్టడం. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత భారత్ సాధించిన స్వయం సమృద్ధికి ప్రతీకగా కొత్త పార్లమెంట్ భవంతిని చూడాలని ప్రధాని చాలా కాలం క్రితమే చెప్పారు. నరేంద్ర మోదీ ప్రధాని కావడానికి దాదాపు దశాబ్దం ముందే పార్లమెంట్‌కు కొత్త భవన నిర్మాణం గురించి చర్చ జరగక పోలేదు.

1921లో ప్రారంభమైన పాతదాని నిర్మాణం 1927కు పూర్తి కాగా, నాటి గవర్నర్ జనరల్ ఇర్విన్ ప్రారంభించారు. ఇకపై పాత భవనం ఒక పురావస్తు ప్రదర్శనశాలగా ఉండిపోతుంది. ఆగస్ట్ 14, 1947 అర్ధరాత్రి అధికార మార్పిడి మొదలు, ఎన్నో కీలక ఘట్టాలకు అది వేదిక అయింది. కొన్ని శతాబ్దాల పరాయి పాలన తరువాత స్వాతంత్ర్యం సాధించుకున్న దేశం ముందుకు సాగడానికి, ప్రపంచ దేశాల నడుమ ఒక స్థానం సంపాదించుకోవడానికి తీసుకున్న ఎన్నో మేధామథనాలకు సాక్షిగా నిలిచింది. బాబూభాయ్ పటేల్, జవహర్ లాల్ నెహ్రూ, వల్లభ్ భాయ్ పటేల్, అంబేడ్కర్, శ్యామాప్రసాద్ ముఖర్జీ, ఓం ప్రకాశ్ త్యాగీ, రామ్ మనోహర్ లోహియా, లాల్ బహదూర్ శాస్త్రి, నందా, ఇందిర, మొరార్జీ, వాజపేయి, అద్వాణీ, చంద్రశేఖర్, వైబీ చవాన్, హిరేన్ ముఖర్జీ, ఇంద్రజిత్ గుప్తా, ఎంసీ చాగ్లా, పీలూ మోదీ, రాంజెత్మలాని, ప్రణబ్ ముఖర్జీ వంటి ఎందరో పార్లమెంటేరియన్లను చూసింది. వరసగా పది బడ్జెట్లు ప్రవేశపెట్టి మొరార్జీ దేశాయ్ చరిత్ర సృష్టించినది పాత భవనంలోనే. గణేశ్ వాసుదేవ్ మావలంకర్, కేఎస్ హెగ్డే, సోమనాథ్ ఛటర్జీ వంటి లోక్‌సభ స్పీకర్లనూ; సర్వేపల్లి రాధాకృష్ణన్, హిదయ్‌తుల్లా, శంకర్ దయాళ్ శర్మ, వెంకయ్యనాయుడు వంటి రాజ్యసభ ఛైర్మన్లనూ చూసిన వేదిక అది.

కొత్త పార్లమెంట్ భవనం జాతికి అంకితం చేసే కార్యక్రమాన్ని కొన్ని విపక్షాలు రాజకీయం చేయడం దురదృష్టకరం. మొదట కొత్త భవంతిని రాష్ట్రపతి మాత్రమే ప్రారంభించాలని వివాదం లేవదీశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పట్ల కాంగ్రెస్, కొన్ని ఇతర విపక్షాలకు హఠాత్తుగా ఇంత గౌరవం ఎందుకు పుట్టుకొచ్చింది? ముర్ము పదవీ స్వీకారం చేసిన తరువాత ఇంత వరకు రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి మర్యాద పూర్వకంగా కలవని నాయకులే ప్రతిపక్షాలలో ఎక్కువ. ఇప్పుడు మాత్రం రాజ్యాంగంలో 79వ ఆర్టికల్ గుర్తుకు వచ్చింది. పార్లమెంట్‌కు రాష్ట్రపతి అధినేత అని ఆ ఆర్టికల్ చెబుతున్న సంగతి వాస్తవమే కావచ్చు. కానీ ప్రధాని ప్రజలు ఎన్నుకున్న వ్యక్తి. పూర్తి ప్రజాప్రాతినిధ్యంతో ఆవిర్భవించే లోక్‌సభకు నాయకుడు. వాస్తవంగా అధికార బాధ్యతను నిర్వర్తించే వ్యక్తి ప్రధాని మాత్రమే.

చారిత్రకంగా, రాజకీయంగా ఎన్నో ప్రత్యేకతలు కలిగిన ఏ భవంతిని అయినా ఒక ప్రత్యేక సందర్భంలోనే ప్రారంభిస్తారు. ఇక పార్లమెంట్ కొత్త భవనం సంగతి చెప్పేదేముంది? అది వినాయక్ దామోదర్ సావర్కర్ జయంతి కావడం ముదావహమే. అంతటి త్యాగమూర్తికి స్వతంత్ర భారతదేశంలో దక్కిన గౌరవం అంతంత మాత్రమే. ఇది ఆయనకు సరైన నివాళి కూడా. చాలా చిత్రంగా సావర్కర్ వివాదం వెనక్కి పోయింది. రాష్ట్రపతి ప్రారంభించాలన్న విపక్షాల వాదనకు సాక్షాత్తూ సుప్రీంకోర్టు స్వస్తి పలికింది. దీని తరువాత సెంగోల్ వివాదాన్ని తెచ్చారు. ఇందులో కూడా ఎన్నో మలుపులు. చాలా చిత్రంగా గతానికి లేని సంకుచితత్వాన్ని కూడా అంటగట్టారు. ఇలాంటి పాత సంప్రదాయానికి చెందిన చిహ్నాన్ని నెహ్రూ తీసుకుని ఉండరు అంటూ ఒక టీవీ చర్చలో ప్యానలిస్ట్ ఢంకా బజాయించి చెప్పడం ఆశ్చర్యం కలిగించింది. తమిళనాడు నుంచి అది ఆఖరి వైస్రాయ్‌కి చేరడం, తరువాత గంగాజలంతో శుద్ధి చేయడం, ఆపై ప్రథమ ప్రధానికి చేరడం ఇవన్నీ రుజువులతో సహా చూపిస్తూ ఉంటే ఇలాంటి వాదన తీసుకువచ్చారు. సెంగోల్ అని పిలిచే ఆ న్యాయదండానికి మోదీ అంత ప్రాముఖ్యం ఇవ్వడంలోని అంతర్యం కూడా అంతుపట్టనిదేమీ కాదు. 'కటింగ్ సౌత్' అనే ప్రమాదకర నినాదానికి ఊతమివ్వాలని కొన్ని విద్రోహ శక్తులు ప్రయత్నిస్తున్న తరుణంలో మోదీ తమిళనాడుకు చెందిన ఆ చారిత్రక అవశేషాన్ని ఆధునిక పార్లమెంట్ భవనంలో ప్రతిష్ఠించాలని కోరుకున్నారు.

దేశ రాజధానిలో ఆ చారిత్రక ప్రాంతాన్ని సెంట్రల్ విస్టా అభివృద్ధి పథకం పేరుతో తీర్చిదిద్దాలనీ, అందులో భాగంగా చేపట్టే కట్టడాలన్నీ భారత్ సాధించిన ఘనతను ప్రతిబింబించేవిగా ఉండాలనీ ప్రధాని ఆశించారు. అందులో భాగమే పార్లమెంట్ కొత్త భవనం. అందుకు తగ్గట్టే నిర్మాణం పూర్తి చేసుకున్నది. ప్రజాస్వామ్యానికి మూలస్థానం పార్లమెంట్ భవనం. భారతదేశం పురోగమన దిశగా వేసిన అడుగులను చూపుతూనే, సంస్కృతీ సంప్రదాయాల పునాది మీద నిర్మితమైనదే ఈ కొత్త భవనం. ఇక్కడే బీజేపీ, నరేంద్ర మోదీ ఘనత కనిపిస్తుంది. వాస్తు శిల్పి బిమల్ పటేల్ నాయకత్వంలో టాటా ప్రాజెక్ట్ లిమిటెడ్ దీనిని రెండున్నర సంవత్సరాలలో పూర్తి చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టును రూ. 20,000 కోట్లతో ప్రారంభించగా, అందులో రూ. 971 కోట్లు పార్లమెంట్ భవంతికి వెచ్చించారు. లోక్‌సభ ప్రాంగణంలో 888 మంది ఆసీనులు కావచ్చు. పార్లమెంట్ ఉభయ సభల సమావేశానికి కూడా ఇది సరిపోతుంది. రాజ్యసభలో 384 మంది కూర్చోవచ్చు. భవిష్యత్తు అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని నిర్మించారు. ప్రత్యక్షంగా రెండు వేల మంది, పరోక్షంగా తొమ్మిదివేల మంది కార్మికులు నిర్మాణంలో పాలు పంచుకున్నారు. భారతీయ కళా సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తూ వివిధ రాష్ట్రాలకు చెందిన 200 మంది కళాకారులు సేవలు అందించారు. కొత్త భవనం సమున్నత భారత్ కలకు వేదిక కాగలదని ఆశిద్దాం.

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ అధ్యక్షుడు

ఆది గ్రామదేవత... బొడ్రాయి!

తెలంగాణలోని అనేక గ్రామాల్లో 'బొడ్రాయి' పునః ప్రతిష్ఠ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామ దేవతగా భావించే బొడ్రాయిని పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, గుమ్మడి కాయలు, వేప కొమ్మలతో ప్రతి గ్రామంలోనూ పూజిస్తూ ఉంటారు. దీని పేరు సూచిస్తున్నట్లుగా ప్రతి గ్రామం నడిబొడ్డున బొడ్రాయి ఉంటుంది. ఊరి బొడ్రాయిని ఆ ఊరి ఆడబిడ్డగా భావిస్తారు. అలాగే ఆ ఊరును అంటు వ్యాధుల నుండి కాపాడే దేవతగానూ గ్రామస్థులు మొక్కుతారు.



ఎల్లమ్మ, మైసమ్మ, పోచమ్మ, మహంకాళమ్మ వంటి ఎనిమిది మంది అక్కాచెల్లెళ్ళ కోసం తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఆషాఢ, శ్రావణ మాసాలలో బోనాలు చేస్తారు. పోతరాజు ఎనిమిది మంది అక్కాచెల్లెళ్ళకు ఒక్కడే తమ్ముడని ఆయననూ కొలుస్తారు. పోతరాజు వేషధారణలో నృత్యాలు చేయడం తెలిసిందే. తెలంగాణ సంస్కృతిలో బోనాలెత్తడం ఒక విడదీయరాని భాగం.

అయితే ఇటీవల బోనాల పండుగ తర్వాత అత్యంత ఘనంగా అనేక గ్రామాల్లో బొడ్రాయి పునఃప్రతిష్ఠా మహోత్సవం పెద్ద ఎత్తున గ్రామ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. నిజానికి ఒక గ్రామ నిర్మాణం బొడ్రాయి ప్రతిష్ఠతో మొదలవుతుంది. బొడ్రాయి లేకపోతే దానిని మన సంస్కృతి ప్రకారం ఒక ఊరుగా పరిగణించరు. అందుకే గ్రామం ఉనికి బొడ్రాయితో ముడివడి ఉంటుంది. అయితే ఎప్పుడో వేసిన పాత బొడ్రాయి స్థానంలో కొత్త బొడ్రాయిని ప్రతిష్ఠిస్తూ ఉత్సవాలు నిర్వహించుకుంటున్నాయి చాలా గ్రామాలు.

బొడ్రాయిపై గ్రామాల్లోని ఆడబిడ్డలు రాగి, వెండి, బంగారం వంటివాటితో తయారైన కొత్త చెంబు, సరువ, బిందె... ఇలా తమ తాహతుకు తగ్గ పాత్రలతో ఆడబిడ్డలు నీళ్ళు పోస్తారు. ఇలా చేయడం వల్ల తమ తల్లిదండ్రులకూ, అన్నదమ్ములకూ, అక్కాచెల్లెళ్ళకూ, గ్రామానికీ శుభం జరుగుతుందని నమ్మకం. అందుకే ఈ ఉత్సవానికి ఆడబిడ్డలను, చుట్టాలను పిలుచుకొని మూడు రోజులు జాతర జరుపుకొంటున్నారు. తెలంగాణ ప్రజలకు 'శుభ' కార్యాలకు వెళ్ళేటప్పుడు బొడ్రాయిని మొక్కి పోతే తప్పకుండా విజయం సాధిస్తామనే విశ్వాసం ఒకటుంది.

మొదటి రోజు గణపతి పూజతో బొడ్రాయి పునః ప్రతిష్ఠా మహోత్సవాన్ని ప్రారంభిస్తారు. మొదటి రెండు రోజుల్లో నవధాన్యాలు చల్లడం, ఊరిని దిగ్బంధన చేయడం వంటి కార్యక్రమాలు చేస్తారు. మూడవరోజు (చివరి రోజు) బోనాలు సమర్పించడం, ఆడబిడ్డలకు ఒడిబియ్యం పోయడం చేస్తున్నారు. ఈ సందర్భంగా మేకలు, గొర్రెలు, చేపలు, కోళ్ళు వండుకొని తింటూ ఇంటిల్లిపాది బంధువులతో కలిసి ఆనందంగా గడుపుతున్నారు.

ముఖ్యంగా ఉద్యోగాలూ, ఉపాధి కోసం ఊళ్లెంట వెళ్లిన జనం, చదువుల కోసం పట్టణాల్లో ఉంటున్న విద్యార్థినీ విద్యార్థులూ, విడిపోయిన కుటుంబాలవారు అందరూ బొడ్రాయి పునఃప్రతిష్ఠ సందర్భంగా తిరిగి మళ్లీ ఒక గూటికి చేరి ఆనందంగా పూజలు సలుపుతున్నారు. ఆ విధంగా బొడ్రాయి ఊరంతటినీ ఏకం చేసి తాత్కాలికంగా నైనా బాధలు మరచి జనం ఆనందంగా గడపడానికి కారణమవుతోంది.

– డా॥ ఎస్. విజయ భాస్కర్, ప్రభుత్వ ఉపాధ్యాయులు | 92908 26988

మోకాలికీ బోడిగుండుకూ ముడిపెడతారా?

విశ్లేషణ



సారంపల్లి మల్లారెడ్డి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో తలసరి ఆదాయం రూ. 1,24,104 ఉండగా 2023–24లో ఇది రూ. 3,17,115 లకు పెరిగినట్లు 2023 ఫిబ్రవరి 6న ఆర్థికమంత్రి హరీశ్‌రావు తన బడ్జెట్ ఉపన్యాసంలో ప్రకటించారు. భారతదేశంలోనే తలసరి ఆదాయం పెరుగుదలలో రాష్ట్రం మూడవ ర్యాంకులో ఉందనీ, ఇంత పెద్దఎత్తున ఆర్థిక వనరులు పెరిగిన రాష్ట్రం, స్థూల ఉత్పత్తి పెరిగిన రాష్ట్రం మరొకటి లేదనీ సగర్వంగా ప్రకటించారు. 2020–21లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ. 13.59 లక్షల కోట్లు కాగా 2021–22లో రూ. 11.48 లక్షల కోట్లకు తగ్గిపోయింది. తిరిగి 2022–23 సంవత్సరానికి రూ. 13.28 లక్షల కోట్లకు పెరిగినట్లు స్టాటిస్టికల్ నివేదికలో పేర్కొన్నారు.

రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదలతో ముడిపెట్టి తలసరి ఆదాయం పెరిగినట్లు, తద్వారా రాష్ట్రం అభివృద్ధి పథంలో కొనసాగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. తలసరి ఆదాయం పెరిగినపుడు అంతకుముందు ఉన్న దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు ఎగువకు రావాలి. ఆదాయం పెరిగినప్పుడు ఆ కుటుంబం విద్య, వైద్య సౌకర్యాలకు వ్యయం చేస్తుంది. కానీ, గత 10 ఏండ్లుగా రాష్ట్రంలో అక్షరాస్యత 66.6 శాతానికి మించలేదు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లలేక సాధారణ జబ్బులతో అనేకమంది చనిపోతున్నారు. ముఖ్యంగా గిరిజన, దళిత మహిళలు కనీస వైద్య సౌకర్యాలకు నోచుకోవడం లేదు. కనీసం ఆవాసం కూడా లేని కుటుంబాలు రాష్ట్ర ప్రభుత్వ సర్వేలో 19 శాతం ఉన్నట్లు తేలింది.

2014 నుండి నేటివరకు పరిశీలిస్తే, దారిద్ర్య రేఖకు ఎగువకు చేరినవారు ఎవరూ కనిపించరు. అయితే దారిద్ర్య రేఖకు దిగువకు వెళ్ళినవారి సంఖ్య మాత్రం పెరిగింది. 2016లో రాష్ట్రంలో 27.5 శాతం ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉండగా, 2022–23లో 31 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లు గణాంకాలు చెపుతున్నాయి.

దేశంలోగానీ, రాష్ట్రంలోగానీ దారిద్ర్యం పెరిగిపోతూనే ఉంది. పట్టణాలలో 8 శాతం నిరుద్యోగం ఉండగా నేడు అది 12.92 శాతానికి పెరిగింది. గ్రామాలలో 25 శాతం నుండి 38 శాతానికి నిరుద్యోగం పెరిగింది. గ్రామీణ ప్రాంతాలలో పాక్షిక ఉద్యోగం అనగా సంవత్సరంలో 120 రోజులు



మాత్రమే పని లభించే కుటుంబాలు 70 శాతం వరకూ ఉన్నాయి. అయినా ప్రభుత్వం తలసరి ఆదాయం పెరుగుతున్నదనీ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దేశంలోనే మెరుగ్గా ఉన్నదనీ చెప్పడం విడ్డూరం.

ప్రస్తుతం రాష్ట్ర స్థూల ఉత్పత్తికి వ్యవసాయ రంగం నుండి 15 శాతం ఆదాయం వస్తుండగా, పారిశ్రామిక రంగం నుండి 28 శాతం ఆదాయం వస్తున్నది. వ్యవసాయ రంగంలో ఉత్పత్తి నాలుగు రెట్లు పెరిగినప్పటికీ అందులో ఉపాధి దినదినం తగ్గిపోతున్నది. యాంత్రీకరణ పెరగడం ద్వారా పారిశ్రామిక ఉత్పత్తి శాతం పెరగడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తి శాతం తగ్గిపోతున్నది. తమ అవసరాలకు మించి అదనపు ఉత్పత్తి జరిగినప్పటికీ అమెరికా వ్యవసాయ ఉత్పత్తి దేశ స్థూల ఉత్పత్తిలో 1.2 శాతం మాత్రమే. మన దేశంలో కూడా వ్యవసాయ యాంత్రీకరణ జరగడం వలన ఉత్పాదకత పెరగడంతో పాటు దేశ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయం కాంట్రిబ్యూషన్ తగ్గుతున్నది. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో అనుసరించిన విధానాలనే వివిధ పేర్లతో అనుసరిస్తున్నాయి తప్ప మౌలిక మార్పులు చేసి వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో ఉత్పాదకతను పెంచి, ఉపాధి కల్పించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే చెప్పాలి.

నేటికీ 40 శాతం మంది ప్రజలు ఒక్కపూట భోజనానికి కూడా ఆదాయం సంపాదించుకోలేకపోతున్నారు. ఆర్థికవేత్తలు చెప్పిన గణాంకాల లెక్కలు చూసినపుడు దారిద్ర్యం పెరుగుతున్నది. అయినప్పటికీ తలసరి ఆదాయం పెరుగుతున్నదని, సగటు ఆదాయం పెరుగుతున్నదని బడ్జెట్లలో భ్రమలు కల్పించే పదాలు ఉటంకిస్తున్నారు. సాధారణ బిచ్చగాడి ఆదాయం, రిలయన్స్ కంపెనీ ఆదాయం కలిపి సగటు చేస్తే బిచ్చగాడి ఆదాయం పెరిగినట్లు కనిపిస్తుంది. అందువల్ల కనీస అందుబాటులో ఉన్నవారి సగటు ఆదాయాన్ని మాత్రమే ప్రకటించాలి. ప్రభుత్వాలు హేతుబద్ధం కాని తలసరి ఆదాయాలను ప్రకటించి దారిద్ర్యం తగ్గిందనడం అంటే మోకాలికీ బోడిగుండుకూ ముడివేయడానికి ప్రయత్నించడమే! ఆ పని చేయడంలో ప్రభుత్వాలు బడ్జెట్లలో తమ ఆర్థిక నైపుణ్యతను ప్రదర్శిస్తుంటాయి. కానీ అవి వాస్తవం కాదని ఎందరికి తెలుసు?

వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు

మాకేదీ.. పే స్కేల్?

- ఆందోళనలో ఉపాధి హామీ ఉద్యోగులు
- 17 ఏళ్లవుతున్నా జాడలేని సర్వీసు క్రమబద్ధీకరణ
- తమకూ పేస్కేల్ వర్తింపజేయాలని సిబ్బంది విజ్ఞప్తి



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉపాధిహామీ పథకం పనులను పర్యవేక్షిస్తున్న తమకు పేస్కేల్ వర్తింపజేయడం లేదంటూ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపజేసేలా మార్చి 18న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ తమకు వర్తింపజేయకపోవడంతో సదరు ఉద్యోగులు ఆవేదనకు గురవుతున్నారు. 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం తీసుకొచ్చింది. దీన్ని గ్రామాల్లో అమలు చేసేందుకు ప్రభుత్వం ఉద్యోగులను నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా 3,874 మందిని డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీల ద్వారా కాంట్రాక్టు పద్ధతిన నియమించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షణలో ఉపాధిహామీ సిబ్బంది విభాగం పనిచేసేలా చర్యలు చేపట్టారు.

సీఎం ప్రకటించినా...

రాష్ట్రంలో వివిధ స్థాయిల్లో విధులు నిర్వహిస్తున్న వీరంతా.. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళనలు నిర్వహించడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ (2008)లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హెచ్ఆర్ పాలసీని తీసుకొచ్చారు. వీరితోపాటు డీఆర్డీఏకు అనుబంధంగా పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులకూ హెచ్ ఆర్ పాలసీని వర్తింపజేశారు. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నది. వీరందరికీ పేస్కేల్ వర్తింపజేస్తూ మార్చి 18న జీవో జారీచేశారు. దీంతో ఉపాధిహామీ సిబ్బందిలోనూ ఆశలు రేకెత్తుతున్నాయి. వీరికి జీత భత్యాలను ఈజీఎస్ ప్రాజెక్టు నుంచే అందజేస్తున్నారు. ఆ వేతనాలను రాష్ట్ర ప్రభుత్వమే పెంచుతూ వస్తోంది. రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన మేరకు, తమను కూడా ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించిందని చెబుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా తాము పని చేస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేదని, తమకూ పేస్కేల్ వర్తింపజేయాలని కోరుతున్నారు. ఈ మేరకు గత నెల 21నుంచి మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావులకు వినతి పత్రాలు అందజేశారు.

సేవలనేకం.. గుర్తింపులో జాప్యం : ఉపాధి హామీ పథకం 32 జిల్లాల 540 మండలాల్లోని 12771 పంచాయతీల్లో అమలవుతోంది. 52.8 లక్షల కుటుంబాలు నమోదు చేసుకోగా పథకం కింద పనిచేస్తున్న కూలీలు, చిన్న, సన్నకారు రైతుల సంఖ్య 1.11 కోట్లు. రెగ్యులర్‌గా పనికి వస్తున్న కుటుంబాలు 34.76 లక్షలు. ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక ఖర్చు చేసిన మొత్తం రూ.14395.68కోట్లు. ఉపాధి హామీ ఉద్యోగులు 17 శాఖల సమన్వయంతో 262 రకాల పనులను చేస్తున్నారు.

పేస్కేల్ వర్తింపజేయాలి...

మేము కూడా గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షణలోనే విధులు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువ పని చేస్తున్నప్పటికీ మా ఉద్యోగాలను క్రమబద్ధీకరించడం లేదు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని గత ఏడాది మార్చిలో అసెంబ్లీలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. టీ–సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా మాకూ పేస్కేల్ వర్తింపజేయాలి.

– ఎల్.లింగన్న, ఉపాధిహామీ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్

రూ. 2.5 లక్షలకు కన్న కొడుకునే అమ్మేశాడు

- ఆర్థిక ఇబ్బందులతో నాలుగేళ్ల బాలుడిని ఓ ముఠాకు అప్పగించిన వైనం
- తల్లి, మేనమామ ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు
- భయంతో మరో ప్రాంతంలో బాలుడిని వదిలివెళ్లిన ముఠా
- వరంగల్ పట్టణంలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి..
- పోలీసుల అదుపులో బాలుడి తండ్రి, ఇతర నిందితులు

వరంగల్ క్రైం/రామన్నపేట: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ తండ్రి కన్న కుమారుడినే అమ్మేసుకున్నాడు. అదీ ఎవరూ లేని అనాథ అని చెప్పి రూ.2.5 లక్షలు తీసుకుని ఓ ముఠాకు అప్పగించాడు. కానీ బాలుడి తల్లి, మేనమామ దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. బాలుడిని కొనుగోలు చేసినవారు భయపడి వదిలి వెళ్లిపోయారు. వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కీర్తి నగర్‌లో రెండు రోజుల క్రితం సినీఫక్కీలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ వ్యవహారంలో పోలీసులు సదరు బాలుడి తండ్రితోపాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఆడుకోవడానికి పంపించానంటూ..

వరంగల్‌లోని కరీమాబాద్‌కు చెందిన మసూద్ స్థానిక ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో రోజువారీ కూలీగా పనిచేస్తున్నాడు. అతడికి ఇద్దరు కుమారులు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పెద్ద కుమారుడు అయాన్ (4)ను అమ్మేయాలని నిర్ణయించుకున్నాడు. ఓ ముఠాతో రూ.2.5 లక్షలకు బేరం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల కింద చిన్న కుమారుడు అస్వస్థతకు గురికావడంతో.. మసూద్ తన భార్య, ఇద్దరు పిల్లలను తీసుకొని ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లాడు. భార్యను, చిన్న కుమారుడిని ఆస్పత్రిలో వేచి ఉండాలని చెప్పి.. ముందస్తు ప్రణాళిక ప్రకారం అయాన్‌ను పోచమ్మ మైదాన్ ప్రాంతానికి తీసుకెళ్లి ముఠాకు అప్పగించాడు. తిరిగి ఆస్పత్రికి వచ్చిన మసూద్‌ను కుమారుడు ఎక్కడ అని భార్య నిలదీయడంతో.. మొదట బంధువుల ఇంట్లో ఆడుకొమ్మని పంపించానని చెప్పాడు. మళ్లీ గట్టిగా అడిగితే అమ్మేశానని చెప్పాడు. దీంతో ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్లాక మసూద్ భార్య తన సోదరుడికి దీనిపై సమాచారం ఇచ్చింది. తర్వాత ఆమె, ఆమె సోదరుడు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిన ముఠా సభ్యులు.. బాలుడిని కీర్తినగర్ ప్రాంతంలో వదిలి వెళ్తున్నట్టు మసూద్‌కు ఫోన్‌చేసి చెప్పారు. పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి బాలుడిని రక్షించారు. అయితే బాలుడిని కొనుగోలు చేసింది పిల్లలు లేని దంపతులా? పిల్లలను కిడ్నాప్ చేసే ముఠా సభ్యులా? అన్నదానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

గతంలోనూ ఇలాంటి ఘటన : రెండేళ్ల క్రితం మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జెమిని థియేటర్ ఎదుట రోడ్డు పక్కన ఉండే సంచార జాతులకు చెందిన డానియెల్ అనే బాలుడిని హైదరాబాద్‌కు చెందిన ఓ ముఠా నంబర్ లేని ఆటోలో వచ్చి కిడ్నాప్ చేసింది. పోలీసులు నెల రోజుల పాటు శ్రమించి... హైదరాబాద్‌లో బాలుడిని గుర్తించి ముఠాను పట్టుకున్నారు.

మాల సంఘాల జేఏసీ చైర్మన్‌గా చెన్నయ్య

ఖైరతాబాద్ (హైదరాబాద్): మాల సంఘాల జేఏసీ చైర్మన్‌గా జి.చెన్నయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఏసీగార్డ్స్‌లోని ఏటూరి టవర్స్‌లో బూర్గుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన వివిధ మాల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు సమావేశమై.. ఈ మేరకు ఆయనను ఎన్నుకున్నారు. వర్కింగ్ చైర్మన్లుగా బూర్గుల వెంకటేశ్వర్లు, కరణం కిషన్, మట్టుపల్లి సుబ్బారాయుడు, గద్ద శ్రీనివాస్, రోపోజు రమేష్, కావలి అనంతరాములు, పుణ్య భానుప్రకాశ్, మంచాల లింగస్వామి, పేరోజు మహేశ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం జి.చెన్నయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ కులాలకు ఆత్మగౌరవ భవనాలు కేటాయిస్తున్నట్టుగానే, మాలలకు కూడా ఆత్మగౌరవ భవనంతో పాటు ఐదెకరాల స్థలం, రూ.10 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఆ డ్రోన్.. గ్యాస్ పైపులైన్ పర్యవేక్షణ కంపెనీది


కంపెనీ ప్రతినిధులకు విమానం డ్రోన్‌ను అందజేస్తున్న ఎస్ఐ సతీశ్

శాలిగౌరారం: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారంలోని పంట పొలాల్లో ఆదివారం సాయంత్రం పడిపోయిన విమానం డ్రోన్ వివరాలను పోలీసులు గుర్తించారు. ఈ ప్రాంతం గుండా ఉన్న ఆయిల్ అండ్ గ్యాస్ పైపులైన్లను విమానం డ్రోన్‌ల ద్వారా పర్యవేక్షించేందుకు ఎస్టేరియా ఏరోస్పేస్ కంపెనీ కేంద్ర ప్రభుత్వ అనుమతులు పొందింది. ఈ నేపథ్యంలో నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు ఎమ్ఎల్‌వి–10 స్టేషన్ పాయింట్ నుంచి రిలయన్స్ ఇండస్ట్రీకి చెందిన 'కాకినాడ – గుజరాత్'ఆయిల్ పైప్‌లైన్‌ను 76 నెంబర్ కలిగిన విమానం డ్రోన్‌తో పర్యవేక్షిస్తుండగా.. అది సాంకేతిక లోపంతో ఆకారం గ్రామ పంటపొలాల్లో పడిపోయింది. విషయం తెలుసుకున్న విమానం డ్రోన్ యూఏవీ (మానవరహిత ఏరియల్ వాహనం) పైలట్ తుషార్ బెహ్లా, కోపైలట్ బలిజ జగదీశ్‌లు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అనుమతి ధ్రువీకరణ పత్రాలను శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో అందజేసినట్లు ఎస్ఐ సతీశ్ వివరించారు.

రైతులతో బలవంతపు ఒప్పంద పత్రాలు

- అధికారులపై రైతుల మండిపాటు
- మరోవైపు లారీలు రాక అవస్థలు
- ఆగ్రహంతో ధాన్యానికి నిప్పుపెట్టి రాస్తారోకో


ధాన్యానికి నిప్పు పెట్టి రాస్తారోకో చేస్తున్న రైతులు

కురవి: కాంటా అయిన ధాన్యాన్ని తరలించేందుకు సకాలంలో లారీలను ఏర్పాటు చేయకపోవడం, సొసైటీ అధికారి రైతులనుంచి బలవంతపు ఒప్పంద పత్రాలు రాయించుకోవడంపై ఆగ్రహం చెందిన అన్నదాతలు ధాన్యానికి నిప్పు పెట్టి రాస్తారోకో చేశారు. మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో సోమవారం ఈ ఘటన జరిగింది. గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు సొసైటీ అధికారులు లారీలను ఏర్పాటు చేయడం లేదు. వారం, పది రోజుల క్రితం కాంటా పెట్టిన ధాన్యం కూడా కేంద్రాల్లోనే మగ్గుతోందని రైతులు చెప్తున్నారు. మరో వైపు నాణ్యత సరిగా లేదని, తాలు ఉందనే కారణంతో మిల్లుల యజమానులు క్వింటాలుకు 10 కేజీల కోతను పెడుతున్నారు. ఇది చాలదన్నట్లు కాంపల్లి సొసైటీ కార్యదర్శి శ్రీమాన్.. బలవంతంగా ఒప్పంద పత్రాలను రాయించుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం తీసుకొచ్చిన ప్రతి రైతు నుంచి 'ఏ విధమైన తరుగు వచ్చినా.. తామే బాధ్యత వహిస్తాం.. ఇది ఇష్టపూర్తిగా రాసి ఇస్తున్న అంగీకార పత్రం..'అంటూ శ్రీమాన్ లేఖలను తీసుకుంటున్నారని చెప్పారు. దీనిపై ఆగ్రహించిన రైతులు రోడ్డెక్కారు. కాంపల్లిలోని జాతీయ రహదారిపై ధాన్యం పోసి నిప్పంటించి నిరసన వ్యక్తం చేశారు. సుమారు రెండు గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న సీరోలు తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు వచ్చి చర్చించారు. కార్యదర్శి శ్రీమాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అయితే రైతుల ఆగ్రహం పెరుగుతుండడంతో విషయం తెలుసుకున్న సొసైటీ చైర్‌పర్సన్ కొండపల్లి శ్రీదేవి, కార్యదర్శి శ్రీమాన్, సీరోలు ఎస్సై నరేశ్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఒప్పంద పత్రాలు ఇక నుంచి ఇవ్వవద్దని, రైతుల ధాన్యం తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

డబ్బు కోసం నాన్ననే కొట్టి చంపేశారు

రెండు ఘటనల్లో తండ్రులను కొట్టి చంపిన కుమారులు

తండ్రి కంటే ఆస్తే ఎక్కువైంది. డబ్బుల మాటున బంధం మరుగునపడిపోయింది. భూమి కొనుగోలు, అమ్మకాలకు సంబంధించి వచ్చిన డబ్బుల విషయమై ఇద్దరు తండ్రులు కొడుకులు, కుటుంబసభ్యుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయారు. జనగామ, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి.

అంత డబ్బెక్కడిదంటూ..


ఎల్లయ్య మృతదేహం

జఫర్‌గఢ్: డబ్బుల విషయమై గొడవ పడిన ఓ కొడుకు ఇతర కుటుంబసభ్యులతో కలిసి తండ్రిపై దాడిచేసి హతమార్చాడు. ఎస్ఐ శంకర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా ఓబులాపూర్ గ్రామానికి చెందిన గొలుసుల ఎల్లయ్య(65)కు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరికి సమానంగా భూమిని పంచాడు. పెద్ద కుమారుడైన యాకస్వామి తన కూతురు పెళ్లి ఖర్చుల కోసం తన వాటా భూమిలోని 14 గుంటలను విక్రయించాడు. ఇది తెలిసిన ఎల్లయ్య.. తాను సంపాదించి ఇచ్చిన భూమిని ఇతరులకు అమ్మొద్దని, అవసరమైతే డబ్బిచ్చి ఆ భూమిని తానే తీసుకుంటానని కొడుకు యాకస్వామితో చెప్పాడు. రూ.7 లక్షల ధర నిర్ణయించగా, అందులో రూ.4 లక్షలను ఎల్లయ్య కొడుకుకు ముట్టజెప్పాడు. దీంతో రెండో కుమారుడైన కుమార్.. భూమి కొనేంత డబ్బు నీకెక్కడిదంటూ తండ్రితో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఈ నెల 27న పొలం వద్ద ఉన్న ఎల్లయ్యను కుమార్, కోడలు హేమ, మనుమడు విఘ్నేష్ దూషిస్తూ దాడి చేశారు. తలకు తీవ్ర గాయాలైన ఎల్లయ్యను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ సోమవారం చనిపోయాడు. పెద్దకుమారుడు యాకస్వామి ఫిర్యాదుతో పోలీసులు ముగ్గురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.

భూమి అమ్మిన డబ్బివ్వాలంటూ..


శంకర్ (ఫైల్)

ఇల్లంతకుంట(మానకొండూర్): భూమి అమ్మగా వచ్చిన డబ్బు లు ఇవ్వట్లేదంటూ తల్లితో కలిసి కొడుకు హత్య చేశాడు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం దాచారం గ్రామానికి చెందిన దర్పల్లి శంకర్(55) రైతు. ఈయన భార్య చంద్రకళ, ఇద్దరు కూతుళ్లు మౌనిక, మమత, కుమారుడు వంశీకృష్ణతో కలిసి ఐదేళ్లుగా భర్తకు దూరంగా సిద్దిపేటలో ఉంటున్నది. పెద్దకూతురు పెళ్లి చేసేందుకు ఇటీవల భర్త వద్దకు వచ్చింది. ఈనెల 5న కూతురి పెళ్లి చేశారు. అయితే శంకర్ తన భూమిని ఇటీవల విక్రయించడంతో రూ.46 లక్షలు వచ్చాయి. కూతురు పెళ్లికి అయిన ఖర్చులు మినహా మిగిలిన డబ్బులు తమకివ్వాలంటూ భార్య, కొడుకు శంకర్‌తో గొడవపడుతున్నారు. ఆదివారం రాత్రి కూడా డబ్బుల విషయమై వీరి మధ్య గొడవ జరిగింది. భార్య చంద్రకళ, కుమారుడు వంశీకృష్ణ కలిసి కత్తితో దాడి చేయడంతోపాటు గొంతు నులమడంతో శంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. సోమవారం ఉదయం హత్య విషయం వెలుగుచూసింది. మృతుడి సోదరి సుగుణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్, ఎస్సై రాజేశ్ తెలిపారు.

రైతుకు కష్టాలు.. మీకు సంబరాలా?

- కొనుగోళ్లలో అవినీతి లేకుంటే రసీదులు ఎందుకివ్వరు?
- నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ముట్టడిలో మాజీ మంత్రి జూపల్లి


నాగర్‌కర్నూల్ కలెక్టర్ క్యాంపు ఆఫీస్ ఎదుట రహదారిపై జూపల్లి నిరసన

సాక్షి, నాగర్‌కర్నూల్: ధాన్యం అమ్ముకోలేక రాష్ట్రవ్యాప్తంగా రైతులు కష్టాలు పడుతుంటే బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకొంటారా? అని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. తరుగు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులతో కలసి జిల్లా కలెక్టరేట్‌తో పాటు కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బస్తాకు అదనంగా 2 కిలోలు తూకం వేస్తున్నా, మళ్లీ తరుగు పేరిట 3 కిలోల కోత విధించి దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అక్రమాలు లేకపోతే ధాన్యం తూకం వేసిన వెంటనే రైతులకు రసీదు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. తరుగు లేకుండా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఇప్పటికే చేసిన కొనుగోళ్ల తరుగు డబ్బులు తిరిగి రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చేంతవరకు కదిలేది లేదని పట్టుబట్టారు. దీంతో పోలీసులకు, రైతులకు మధ్య వాగ్వివాదంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అనంతరం జూపల్లిని అరెస్ట్ చేసిన పోలీసులు తెలకపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

- మధ్యప్రదేశ్ వాటర్ కార్పొరేషన్ పనుల్లో అవకతవకలు జరిగాయంటూ ఈడీ నమోదు చేసిన కేసులో నిందితుడైన మంతెన కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్ మంతెన సత్యనారాయణ రాజుకు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.10 లక్షల వ్యక్తిగత పూచీకత్తు, రూ.10 లక్షల చొప్పున ఇద్దరు షూరిటీ సమర్పించాలని జస్టిస్ ఎం.లక్ష్మణ్ ధర్మాసనం ఆదేశించింది. దేశం విడిచి వెళ్లరాదని, మెట్రోపాలిటన్ కోర్టులో పాస్‌పోర్టును అందజేయాలని స్పష్టం చేసింది.

సర్పంచ్ చంపుతానని బెదిరిస్తున్నాడు

- కలెక్టరేట్‌లో వృద్ధుడి ఆందోళన
- ఇంటి దారిని కబ్జా చేశారు..
- ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు
- 'అధికారుల తీరు నశించాలి'అంటూ ప్లకార్డుతో నిరసన


నిరసన తెలుపుతున్న మల్లయ్య

జగిత్యాలటౌన్: తనకు న్యాయం చేయాలని విన్నవించినా అధికారులు స్పందించడం లేదనే ఆగ్రహంతో ఓ వృద్ధుడు జగిత్యాల కలెక్టరేట్ ఆవరణలో సోమవారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశాడు. జిల్లాలోని పెగడపల్లి మండలం నంచర్ల గ్రామానికి చెందిన చెవుల మల్లయ్య సోమవారం ఉదయం కలెక్టరేట్‌కు వచ్చాడు. 'అధికారుల నిర్లక్ష్యం నశించాలి'అని రాసిఉన్న ప్లకార్డును మెడలో ధరించాడు. కలెక్టరేట్ ఆవరణలో నేలపై బైఠాయించాడు. ఇది గమనించిన పోలీసులు ఆయనను ప్రజావాణి ఆడిటోరియంలోకి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా బాధితుడు మల్లయ్య మాట్లాడుతూ.. తమ గ్రామ సర్పంచ్, మరికొందరు తన ఇంటికి వెళ్లే దారి కబ్జా చేశారన్నాడు. సుమారు 40 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన భూమిలో ఇల్లు కట్టుకుని బతుకుతున్నానని తెలిపాడు. ఇక్కడ ఉపాధి లేక తన ఇద్దరు కుమారులు గల్ఫ్ వెళ్లారని, ప్రస్తుతం తనకు ముందూ వెనకా ఎవరూ లేరని ఆవేదన చెందాడు. దీనిని ఆసరాగా చేసుకున్న సర్పంచ్, మరికొందరు తన ఇంటిదారిని కబ్జా చేశారని కన్నీటిపర్యంతమయ్యాడు. ఇదేమిటని ప్రశ్నిస్తే.. చంపుతామని సర్పంచ్ బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదే విషయంపై గత నెలలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశానని, ఎస్పీకి కూడా ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని వాపోయాడు. అధికారుల నిర్లక్ష్యంతోనే తనకు న్యాయం జరగడం లేదని ఆరోపించాడు. కాగా, సమస్య పరిష్కరిస్తామని ఆర్డీవో మాధురి హామీ ఇవ్వడంతో మల్లయ్య ఇంటికి వెళ్లిపోయాడు.

దొంగల కారుపై పోలీసుల కాల్పులు

- నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద ఘటన


పోలీసుల అదుపులో దొంగల కారు

ఖలీల్‌వాడి (నిజామాబాద్)/సదాశివనగర్(ఎల్లారెడ్డి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ కాయల్స్‌ను దొంగిలించి తీసుకెళ్తున్న జార్ఖండ్‌కు చెందిన అంతర్రాష్ట్ర ముఠాపై పోలీసులు కాల్పులు జరిపారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద జరిగిన ఘటన వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని ముప్కాల్ ప్రాంతంలో దొంగల ముఠా ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వారిని పట్టుకునేందుకు జాతీయ రహదారి 44పై ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద ధర్పల్లి, ఇందల్వాయి ఎస్సైలు వంశీచందర్‌రెడ్డి, నరేశ్‌ల ఆధ్వర్యంలో పోలీసు బృందాలు తనిఖీలు చేపట్టాయి. సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో రాజస్థాన్ పాసింగ్‌కు చెందిన (ఆర్‌జే 29 సీబీ 5874) కారు టోల్‌ప్లాజా వద్దకు చేరుకుంది. అందులో రాజస్తాన్‌కు చెందిన ఒకరు, జార్ఖండ్‌కు చెందిన ముగ్గురు ఉన్నారు. టోల్‌ప్లాజా టికెట్ తీసుకొని ముందుకు రాగానే పోలీసులు ఆపారు. వివరాలు అడిగి కారు డోర్ తీసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో డ్రైవర్ కారును ధర్పల్లి ఎస్సై వంశీచందర్‌రెడ్డితోపాటు కానిస్టేబుల్స్‌పైకి తీసుకువెళ్లాడు. ఎస్సై, పోలీసులు తప్పించుకోగా దొంగల కారు పక్కనే ఉన్న ఎస్సైకి చెందిన కారును ఢీకొట్టింది. ఎస్సై కారు డ్యామేజ్ అయింది. ఎస్సై వంశీచందర్‌రెడ్డి తేరుకొని దొంగల కారుపైకి రెండు రౌండ్ల కాల్పులు జరిపారు. అనంతరం తప్పించుకుని వేగంగా వెళ్లిపోతున్న దొంగల కారును పోలీసులు వెంబడించారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం ధర్మారావుపేట్ వద్ద కారును వదిలిపెట్టి దొంగలు పరారయ్యారు. అటవీప్రాంతంలోకి పారిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కారును సదాశివనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

టోఫెల్ అర్హతతో కెనడాలోనూ చదవొచ్చు



న్యూఢిల్లీ: టోఫెల్ (టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యాజ్ ఎ ఫారిన్ లాంగ్వేజ్) స్కోరు ఆధారంగా విదేశీ విద్యార్థులు కెనడాలోనూ ఉన్నత విద్యనభ్యసించవచ్చని ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్(ఈటీఎస్) తెలిపింది. కెనడా ప్రభుత్వ 'స్టూడెంట్ డైరెక్ట్ స్ట్రీమ్(ఎస్‌డీఎస్)'పథకంలో భాగంగా ఉన్నత విద్యనభ్యసించే విదేశీ విద్యార్థులకు ఇకపై టోఫెల్ స్కోరును పరిగణనలోకి తీసుకుంటుందని పేర్కొంది. ఇమిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా(ఐఆర్‌సీసీ) ఇందుకు ఆమోదం తెలిపిందని వెల్లడించింది. ఇప్పటి వరకు ఎస్‌డీఎస్‌లో ఇంగ్లిష్ అర్హత పరీక్షగా ఐఈఎల్‌టీఎస్‌కు మాత్రమే ఆప్షన్ ఉండేది. ఈ ఏడాది ఆగస్టు 10వ తేదీ నుంచి ఎస్‌డీఎస్‌కు దరఖాస్తు చేసుకునేవారు టోఫెల్ స్కోరును కూడా జత చేసుకోవచ్చని వివరించింది. ఎస్‌డీఎస్ దరఖాస్తుల పరిశీలన దాదాపు 20 రోజుల్లోనే పూర్తవుతుందని ఈటీఎస్ పేర్కొంది. కాగా, టోఫెల్‌ను అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర 160కి పైగా దేశాలకు చెందిన 12 వేల సంస్థలు పరిగణనలోకి తీసుకుంటున్నాయి.

అర్ధంతరంగా అపాచీ ల్యాండింగ్



భిండ్/న్యూఢిల్లీ: భారత వైమానిక దళానికి చెందిన అపాచీ ఎటాక్ హెలికాప్టర్ సోమవారం మధ్యప్రదేశ్‌లోని భిండ్ సమీపంలో అర్ధంతరంగా ల్యాండయింది. రోజువారీ శిక్షణ సమయంలో హెలికాప్టర్‌లో కొన్ని అవాంతరాలు తలెత్తడంతో పైలట్ ముందు జాగ్రత్తగా ల్యాండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. నిపుణుల బృందం హెలికాప్టర్‌ను పరిశీలిస్తోందని ఐఏఎఫ్ ట్వీట్ చేసింది. ఉదయం 8.45 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనతో ఎవరికీ ఏవిధమైన హాని కలగలేదని, అందులోని సిబ్బంది క్షేమంగా ఉన్నారని పేర్కొంది. కాగా, హెలికాప్టర్ ల్యాండయిన ప్రాంతంలో జనం గుమికూడిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

జీఎస్ఎల్వీ ప్రయోగం సక్సెస్

కక్ష్యలోకి నావిక్-01 ఉపగ్రహం | దేశీయ నావిగేషన్ వ్యవస్థ బలోపేతం దిశగా ముందడుగు


నిప్పులు చిమ్ముతూ దూసుకెళ్తున్న రాకెట్

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): రెండోతరం నావిగేషన్ ఉపగ్రహ సిరీస్‌లో మొదటిదైన ఎన్‌వీఎస్-01 ఉపగ్రహ ప్రయోగం విజయవంతంగా పూర్తయింది. ఇస్రో చేపట్టిన ఈ ప్రయోగానికి ఆంధ్రప్రదేశ్‌లోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్)లోని రెండో లాంచింగ్‌ప్యాడ్ వేదికైంది. 27.5 గంటల కౌంట్‌డౌన్ ముగిశాక సోమవారం ఉదయం 10.42 గంటలకు ఎన్‌వీఎస్-01 ఉపగ్రహాన్ని 51 మీటర్ల పొడవు, 420 టన్నుల బరువైన జీఎస్ఎల్వీ రాకెట్ భూమికి దగ్గరగా 173 కిలోమీటర్లు (పెరీజీ), భూమికి దూరంగా 36,568 కిలోమీటర్లు (అపోజీ) దీర్ఘవృత్తాకార భూ బదిలీ కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టింది. 2,232 కేజీల ఉపగ్రహం అక్కడ స్థిరంగా ఉన్నట్లు బెంగళూరు దగ్గర్లోని హసన్‌లోని గ్రౌండ్ స్టేషన్‌కు సిగ్నల్స్ అందాయి. జీఎస్ఎల్వీ వాహకనౌకను వాడటం ఇది 15వ సారి. 2021 ఆగస్టులో ప్రయోగించిన జీఎస్ఎల్వీ ఎఫ్10 అపజయం పాలవడంతో ఆనాటి క్రయోజనిక్ స్థాయి తప్పిదాలను సరిచేసి ఈసారి ప్రయోగాన్ని విజయవంతం చేశారు. మరో రెండు మూడు రోజుల్లో మూడు దశల్లో పెరీజీని పెంచుతూ అపోజీని తగ్గిస్తూ భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్యలోకి ఉపగ్రహాన్ని చేరుస్తారు. అమెరికా జీపీఎస్, రష్యా గ్లోనాస్ తరహాలో భారత సొంత నావిగేషన్ వ్యవస్థ అయిన నావ్ఐసీ(నావిగేషన్ విత్ ఇండియన్ కాన్స్టిలేషన్-గతంలో భారత క్షేత్రీయ దిక్సూచీ ఉపగ్రహ వ్యవస్థ)ను బలోపేతం చేసే దిశగా ఈ కొత్త తరం ఉపగ్రహాన్ని ఒక పాత ఉపగ్రహం స్థానంలో భర్తీ చేస్తున్నారు. అయితే ప్రయోగం విజయవంతం కావడంతో షార్‌లోని మిషన్ కంట్రోల్‌రూంలో శాస్త్రవేత్తలు ఒకరితో ఒకరు ఆలింగనం చేసుకుని ఆనందం పంచుకున్నారు. ఈ సందర్భంగా ఇస్రో ఛైర్మన్ ఎస్. సోమనాథ్ మాట్లాడారు. ఇది ఇస్రో సాధించిన సమష్టి విజయమని అన్నారు. భారతదేశ నావిగేషన్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు నావిక్ సిరీస్ ఉపగ్రహాలను ఆరు నెలకొకసారి ప్రయోగిస్తామని తెలిపారు.

తొలిసారిగా దేశీ అణుగడియారం

ఐఆర్ఎన్ఎస్ఎస్ ఇప్పటికే అందుబాటులో ఉంది. దీన్ని మరింత బలోపేతం చేసేందుకు నావిక్ సిరీస్ కొత్త ఉపగ్రహాలు ఎంతగానో దోహదపడతాయి. గతంలో పంపిన ఉపగ్రహాల్లో ఎస్-బ్యాండ్, కె-బ్యాండ్, కేయూ-బ్యాండ్ లాంటి ఉపకరణాలను అమర్చారు. ఈసారి నావిక్-01 ఉపగ్రహంలో ఎల్-1, ఎల్-5, ఎస్-బ్యాండ్ సిగ్నల్స్ వ్యవస్థను అమర్చారు. ఎల్-1లో పౌరులకు ఉపయోగపడే సివిలియన్ ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌ను పరిచయం చేశారు. సమయం, స్థానం అత్యంత ఖచ్చితంగా తెలిపే తొలిసారిగా దేశీయంగా తయారుచేసిన రుబీడియం అణుగడియారాన్ని ఉపగ్రహంలో అమర్చారు. ఆటమిక్ క్లాక్‌ను తయారుచేస్తే సత్తా ప్రపంచంలో చాలా తక్కువదేశాలకే ఉంది. నావిగేషన్ ఉపగ్రహాల వ్యవస్థలో ఇప్పటికే ఏడు ఉపగ్రహాలు నావిగేషన్ వ్యవస్థను అందిస్తున్నారు. ఇందులో నాలుగు ఉపగ్రహాలకు కాలపరిమితి ముగుస్తుండడంతో వాటి స్థానంలో కొత్తవాటిని పంపుతున్నారు. కొత్త ఉపగ్రహాలతో భూ, జల, వాయు మార్గాల్లో పొజిషన్‌ను 20 మీటర్ల అత్యంత ఖచ్చితత్వంతో, 50 నానోసెకన్ల రియల్‌టైమ్‌తో చూపించడం, అత్యవసర సమయాల్లో భూగోళానికి సంబంధించిన సమాచారం, వాహన చోదకులకు దిశా నిర్దేశం, ఇంటర్నెట్‌తో అనుసంధానం లాంటి ఎన్నో సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. భారత విమానయాన, నౌకాయాన మార్గాలకు, సైనిక అవసరాలకు ఈ ఉపగ్రహ వ్యవస్థ దోహదపడుతుంది. దేశానికి ఆవల సైతం 1,500 కిలోమీటర్లదాకా ఈ వ్యవస్థ పనిచేస్తుంది.

సీవీసీగా ప్రవీణ్ శ్రీవాస్తవ



న్యూఢిల్లీ: సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ (సీవీసీ)గా ప్రవీణ్ కుమార్ శ్రీవాస్తవ నియమితులయ్యారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రస్తుత విజిలెన్స్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ శ్రీవాస్తవను సీవీసీగా నియమించారని రాష్ట్రపతి భవన్ ఓ ప్రకటనలో పేర్కొంది. సోమవారం ఉదయం 10.30 గంటలకు ఆయన రాష్ట్రపతి సమక్షంలో ప్రమాణం చేశారని, కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ కూడా పాల్గొన్నారని తెలిపింది. సీవీసీ సురేశ్ ఎన్ పటేల్ పదవీ కాలం గత ఏడాది డిసెంబర్‌తో పూర్తయింది. అప్పటి నుంచి శ్రీవాస్తవ తాత్కాలిక సీవీసీగా కొనసాగుతున్నారు. సీవీసీగా 65 ఏళ్లు వచ్చే వరకు లేదా నాలుగేళ్ల కాలానికి బాధ్యతల్లో కొనసాగుతారు. 1988 బ్యాచ్ రిటైర్డ్ ఐఏఎస్ అయిన శ్రీవాస్తవ అస్సాం-మేఘాలయ కేడర్‌కు చెందిన వారు. గత ఏడాది జనవరి 31న కేబినెట్ సెక్రటేరియట్ కార్యదర్శిగా పదవీ విరమణ పొందారు. సీవీసీ సారథ్యంలో విజిలెన్స్ కమిషన్‌లో గరిష్ఠంగా ఇద్దరు కమిషనర్లు ఉండొచ్చు. ఐబీ మాజీ చీఫ్ అర్వింద్ ఒక్కరే ప్రస్తుతం కమిషనర్‌గా ఉన్నారు. మరో కమిషనర్ పోస్టు ఖాళీగా ఉంది.

ఏకైక ఎమ్మెల్యే టీఎంసీలోకి

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకైక శాసనసభ్యుడు బేరోన్ బిశ్వాస్ అధికార టీఎంసీ కండువా కప్పుకున్నారు. పశ్చిమ్ మేదినీపూర్ జిల్లా ఘటాల్‌లో సోమవారం టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటూ దక్కించుకోలేకపోయిన విషయం తెలిసిందే. అయితే, దాదాపు మూడు నెలల క్రితం ముర్షిదాబాద్ జిల్లా సాగర్‌దిఘి నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ టిక్కెట్‌పై బిశ్వాస్ ఎమ్మెల్యేగా గెలుపొంది, అసెంబ్లీలో అడుగుపెట్టారు. తాజా పరిణామంతో బెంగాల్ అసెంబ్లీలో కాంగ్రెస్ మరోసారి ప్రాతినిథ్యం కోల్పోయింది. దీనిపై టీఎంసీ చీఫ్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. రాష్ట్రంలోని అధికార పార్టీతో విభేదించాలా లేక కేంద్రంలోని బీజేపీని వ్యతిరేకించాలా తేల్చుకోవాల్సింది నిర్ణయించుకోవాల్సింది కాంగ్రెస్సేనంటూ వ్యాఖ్యానించారు. కేంద్రంలోని బీజేపీపై పోరాడుతున్నామంటూ రాష్ట్రంలోని టీఎంసీని వ్యతిరేకించడమనే ద్వంద్వవైఖరిని కాంగ్రెస్ ఇకనైనా ఆపాలని టీఎంసీ ట్వీట్ చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా విపక్షాలన్నీ ఏకమవుతున్న వేళ బిశ్వాస్ టీఎంసీలో చేరడం గమనార్హం.

20 సార్లు కత్తితో పొడిచి.. తలపై మోది..

బాలికను దారుణంగా హత్యచేసిన యువకుడు • ఢిల్లీలో ఘోరం

న్యూఢిల్లీ: పదహారేళ్ల బాలికను ఓ 20ఏళ్ల యువకుడు అత్యంత పాశవికంగా అంతమొందించాడు. దేశ రాజధాని ఢిల్లీలో అత్యంత రద్దీగా ఉండే రహదారిలో అందరూ చూస్తుండగా ఈ హత్య జరిగింది. ఇంతటి ఘోరం జరుగుతున్నా ఏ ఒక్కరూ ముందుకొచ్చి బాలికను కాపాడేయత్నం చేయకపోవడం విషాదం. ఈ ఘటన వాయవ్య ఢిల్లీలోని షాబాద్ డైరీ ప్రాంతంలో జరిగింది. హత్య తర్వాత పారిపోయిన నిందితుడు సాహిల్‌ను ఢిల్లీ పోలీసులు ఉత్తర ప్రదేశ్‌లోని బులంద్‌షహర్ ప్రాంతంలో అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ డైరీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జేజే కాలనీలో ఉండే సాక్షి అనే బాలికకు ఫ్రిడ్జ్, ఏసీలు బాగుచేసే మెకానిక్ సాహిల్‌తో ప్రేమ వ్యవహారం ఉంది. వీరిద్దరూ శనివారం గొడవపడ్డారు. దీంతో కోపం పెంచుకున్న సాహిల్ ఎలాగైనా ఆమెను చంపేయాలని నిర్ణయించుకుని ఆదివారం అదునుకోసం ఎదురుచూశాడు. తన స్నేహితురాలి కుమారుడి పుట్టినరోజు వేడుకలో పాల్గొనేందుకు బాలిక ఆదివారం రాత్రి రహదారిలో వెళ్తుండగా వెంబడించిన సాహిల్ ఆమెపై కత్తితో దాడిచేశాడు. 20సార్లకుపైగా పొడిచాడు. తర్వాత రోడ్డుపై పడి ఉన్న సిమెంట్ స్లాబ్‌తో తలపై పలుమార్లు మోది చంపేశాడు. ఇంతజరుగుతున్నా అక్కడున్న వాళ్లెవరూ బాలికను కాపాడేందుకు ముందుకురాలేదు. సంబంధిత వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతున్నాయి. సాహిల్‌కు మరణశిక్ష విధించాలని సాక్షి తల్లిదండ్రులు డిమాండ్‌చేశారు.

బాధ్యతతో ఏదైనా చేయండి: సక్సేనాపై కేజ్రీవాల్ ఫైర్


ఢిల్లీలో శాంతిభద్రతల పరిరక్షణ అంశం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా పరిధిలో ఉండటంతో హత్యోదంతంపై ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఘాటుగా స్పందించారు. 'మైనర్‌ను దారుణంగా చంపేశారు. పోలీసులంటే ఏమాత్రం భయంలేకుండా నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. లెఫ్టినెంట్ గవర్నర్‌గారు.. ఢిల్లీలో శాంతిభద్రతలు కాపాడే బాధ్యత మీదే. బాధ్యతతో ఏదైనా చేయండి' అని కేజ్రీవాల్ హిందీలో ట్వీట్‌చేశారు. 'ఢిల్లీ పోలీసులంటే ఎవ్వరూ భయపడట్లేరు. కఠిన చర్యలు తీసుకోకుంటే నేరాలకు అడ్డుఅదుపు లేకుండా పోతుంది' అని ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్ ఆగ్రహం వ్యక్తంచేశారు.


సాహిల్

'చేతులు జోడించి వేడుకుంటున్నా. ఇకనైనా కేజ్రీవాల్ సర్కారీ వ్యవహారాల్లో తలదూర్చడం మానేసి ఢిల్లీ మహిళలను కాపాడండి' అని లెఫ్టినెంట్ గవర్నర్‌ను ఉద్దేశిస్తూ ఢిల్లీ మహిళా మంత్రి ఆతిశీ కోరారు. ఈ ఉదంతంలో కఠిన చర్యలు తీసుకోండని పోలీసులను జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖాశర్మ ఆదేశించారు. 'బాధితురాలిని నిందితుడు చాన్నాళ్లుగా వేధిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వాస్తవానికి ఇదొక లవ్‌జిహాద్ ఉదంతం. కానీ దీనిని సాధారణ హత్య, శాంతిభద్రతల సమస్యగా కేజ్రీవాల్ చిత్రీకరిస్తున్నారు. కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించాలి' అని బీజేపీ ఢిల్లీ శాఖ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా ఆరోపించారు.

మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించిన ప్రధాని

గువాహటి: గువాహటి(అస్సాం)-న్యూజల్పాయ్‌గురి(పశ్చిమబెంగాల్) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను సోమవారం ప్రధాని మోదీ వర్చువల్‌గా జెండా ఊపి ప్రారంభించారు. ఈశాన్య రాష్ట్రాల్లోనే మొట్టమొదటి ఈ వందేభారత్ రైలుతో ఈ ప్రాంతంలో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ వారంతో తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న ఎన్డీఏ ప్రభుత్వంలో దేశం అభివృద్ధి దిశగా అద్భుతమైన ప్రయాణం సాగించిందన్నారు. 2014కు పూర్వం ఊహించని అనేక విజయాలను ప్రభుత్వం సాధించిందని తెలిపారు. గువాహటిలో ఈ రైలు ప్రారంభ కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, అస్సాం గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, సీఎం హిమాంత బిశ్వ శర్మ పాల్గొన్నారు. గువాహటి- న్యూజల్పాయ్‌గురి మధ్య రైలు ప్రయాణ సమయం ప్రస్తుతమున్న 6.30 గంటల నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రాకతో 5.30 గంటలకు తగ్గనుంది.


మైసూర్ పాలకుడు టిప్పు సుల్తాన్ వాడిన తుపాకీ ఇది. లండన్‌లో ఉన్న 18వ శతాబ్దం కాలంనాటి ఈ తుపాకీ ఖరీదు సుమారు రూ.20 కోట్లు. భారత్-యూకే చరిత్రలో ఈ తుపాకీ విశిష్టతపై పరిశోధనకు వీలుగా దీనిని మరే ఇతర దేశానికి పంపకుండా యూకే ప్రభుత్వం నిషేధం విధించింది.

కీవ్‌పై రష్యా క్షిపణుల వర్షం


కీవ్‌లో క్షిపణుల దాడి భయంతో మెట్రో స్టేషన్‌లో దాక్కున్న స్థానికులు

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా సైన్యం మరోసారి విరుచుకుపడింది. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. రష్యా సైన్యం ప్రయోగించిన 11 బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులను తాము కూల్చివేశామని ఉక్రెయిన్ ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ప్రకటించారు. వాటి శకలాలు నగరంలో అక్కడక్కడా చెల్లాచెదురుగా పడిపోయాయని, దట్టమైన పొగ కమ్ముకుందని చెప్పారు. రష్యా దాడుల్లో కీవ్‌లో ఒకరు గాయపడినట్లు సమాచారం. రష్యా సేనలు తొలుత ఆదివారం రాత్రి దాడులు ప్రారంభించాయి. జనం బిక్కుబిక్కుమంటూ గడిపారు. కొందరు అండర్ గ్రౌండ్ రైల్వే స్టేషన్లలో తలదాచుకున్నారు. కొంత విరామం తర్వాత సోమవారం ఉదయం మళ్లీ దాడులు జరిగాయి. ఈ దాడుల్లో పలు భవనాలు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. రష్యా క్షిపణి దాడుల నేపథ్యంలో చిన్నారులు భయాందోళనలతో బాంబు షెల్టర్ వైపు పరుగులు తీస్తున్న వీడియోను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఉక్రెయిన్ వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని లాంగ్-రేంజ్ మిస్సైళ్లు ప్రయోగించినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. ఈ దాడుల్లో ఉక్రెయిన్‌కు చెందిన కమాండ్ పోస్టులు, రాడార్లు, ఆయుధాలు ధ్వంసమయ్యాయని పేర్కొంది.

తుర్కియే అధ్యక్షుడిగా మళ్లీ ఎర్డోగన్



అంకారా: తుర్కియే అధ్యక్షుడిగా రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్(69) మరోసారి ఎన్నికయ్యారు. పోలైన ఓట్లలో ఎర్డోగన్‌కు 52.3శాతం, ప్రత్యర్థి కెమాల్ కిలిక్‌దరోగ్లుకు 47.7 శాతం పడినట్లు అధికార వార్తా సంస్థ అనడోలు తెలిపింది. ఫలితాలు వెలువడ్డాక ఎర్డోగన్ మద్దతుదారులు ఇస్తాంబుల్‌లో అధికార పార్టీ జెండాలు ఎగరేస్తూ, వాహనాల్లో తిరుగుతూ సంబరాలు చేసుకున్నారు. రెండు వారాల క్రితం జరిగిన ఎన్నికల్లో ఎర్డోగన్, కెమాల్‌లకు సమానంగా ఓట్లు పోలవడంతో తాజాగా ఆదివారం రెండో రౌండ్ పోలింగ్ నిర్వహించాల్సి వచ్చింది. ఈ రౌండ్‌లో ఎర్డోగన్ స్పష్టమైన ఆధిక్యత సాధించారు. ఎర్డోగన్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

అస్సాంలో రోడ్డు ప్రమాదం.. ఏడుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి

గువాహటి/జైపూర్: అస్సాంలోని గువాహటిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. అస్సాం ఇంజనీరింగ్ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్న 10 మంది విద్యార్థులు సోమవారం ఉదయం కాలేజీ నుంచి కారులో బయలు దేరారు. వేగంగా వెళ్తున్న వారి వాహనం జలక్‌బరి వద్ద రోడ్డు డివైడర్‌ను, ఆపైన మరో పికప్ వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులోని ఏడుగురు విద్యార్థులు అక్కడికక్కడే చనిపోగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మద్యం మత్తులో వాహనం నడిపినందునే ప్రమాదం చోటుచేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోందని డీజీపీ జీపీ సింగ్ తెలిపారు.

గుంతలో పడిన ట్రాక్టర్ ట్రాలీ..8 మంది మృతి

ట్రాక్టర్ ట్రాలీ లోతైన గుంతలో పడిన ఘటనలో 8 మంది చనిపోగా మరో 26 మంది గాయాలపాలయ్యారు. ఈ ఘటన సోమవారం రాజస్తాన్‌లోని ఝున్‌ఝునులో చోటుచేసుకుంది. బాధితులంతా మాన్‌సా మాత గుడికి వెళ్లివస్తుండగా ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ట్రాలీ కరెంటు స్తంభాన్ని ఢీకొట్టి, గుంతలోకి దూసుకెళ్లినట్లుగా కనిపిస్తోందన్నారు.

బర్మింగ్‌హామ్ లార్డ్ మేయర్‌గా బ్రిటిష్ ఇండియన్

లండన్: ఇంగ్లాండ్‌లోని బర్మింగ్‌హామ్ నగర లార్డ్ మేయర్‌గా బ్రిటిష్-ఇండియన్ కౌన్సిలర్ చమన్‌లాల్ ఎన్నికయ్యారు. తద్వారా బర్మింగ్‌హామ్ తొలి బ్రిటిష్-ఇండియన్ మేయర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. సిక్కు మతంలోని రవిదాసియా వర్గానికి చెందిన చమన్ లాల్ భారత్‌లోని పంజాబ్ రాష్ట్రం హోషియార్‌పూర్ జిల్లాలోని పఖోవాల్ గ్రామంలో జన్మించారు. బ్రిటిష్ ఇండియా సైన్యంలో పనిచేసిన ఆయన తండ్రి సర్దార్ హర్నామ్‌సింగ్ బంగా 1954లో ఇంగ్లాండ్‌కు వలస వచ్చారు. బర్మింగ్‌హామ్‌లో స్థిరపడ్డారు. చమన్‌లాల్ 1964లో తన తల్లి సర్దార్నీ జై కౌర్‌తో కలిసి ఇంగ్లాండ్‌కు చేరుకున్నారు. అప్పటి నుంచి బర్మింగ్‌హామ్‌లోనే నివసిస్తున్నారు. 1971లో విద్యావతిని వివాహం చేసుకున్నారు. వారికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజకీయాలపై ఆసక్తితో చమన్‌లాల్ 1989లో లేబర్ పార్టీలో చేరారు. అసమానతలు, వివక్షకు వ్యతిరేకంగా జరిగిన సామాజిక పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు.

2030కల్లా చంద్రుడి మీదకు చైనా వ్యోమగాములు

బీజింగ్: అంతరిక్ష పరిశోధనలో పశ్చిమదేశాలతో పోటీపడుతున్న చైనా మరో ముందడుగు వేస్తోంది. వచ్చే ఏడేళ్లలో చంద్రుడి మీదకు మానవసహిత ప్రయోగాలు చేపడతామని చైనా మ్యాన్డ్ స్పేస్ ఏజెన్సీ డెప్యూటీ డైరెక్టర్ లిన్ జిక్వియాంగ్ ప్రకటించారు. భూమి నుంచి చంద్రుడి మీదకు వెళ్లిరావడం, స్వల్పకాలం చంద్రుడిపై ల్యాండింగ్, మానవసహిత రోబో పరిశోధనలు, ల్యాండింగ్, కలియతిరగడం, శాంపిళ్ల సేకరణ, పరిశోధన, తిరుగుప్రయాణం ఇలా పలు కీలక విభాగాల్లో పట్టుసాధించేందుకు కృషిచేస్తున్నట్లు ఆయన చెప్పారు. చందమామ దక్షిణ ధృవం వైపు గడ్డకట్టిన నీటి నిల్వల అన్వేషణ కోసం 2025కల్లా మరోమారు వ్యోమగాములను పంపాలని అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ప్రకటించిన నేపథ్యంలో చైనా చంద్రుడిపై శోధనకు సిద్ధమైందని ఆ దేశ అధికార వార్తా సంస్థ జిన్హువా తెలిపింది.

మైసూరులో ఘోర ప్రమాదం



సాక్షి,బెంగళూరు/మైసూర్: ప్రైవేట్ బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో కారులోని 10 మంది అక్కడికక్కడే చనిపోగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మైసూరులోని కురుబూరు వద్ద సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. మృతుల్లో ఇద్దరు చిన్నారులున్నారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద తీవ్రతకు ఇన్నోవా కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. అందులో ఇరుక్కుపోయిన వారిని తీసేందుకు భారీ మెటల్ కట్టర్లను ఉపయోగించాల్సి వచ్చింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితులు బళ్లారి జిల్లా సంగనకల్లుకు చెందిన వారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. బస్సులోని 16 మంది ప్రయాణికులు గాయపడ్డారు.

12న పట్నాలో విపక్షాల కీలక భేటీ!

పట్నా/కోల్‌కతా: కేంద్రంలో అధికార బీజేపీని ఓడించడమే లక్ష్యంగా విపక్షాలను ఉమ్మడి వేదికపైకి తీసుకొచ్చేందుకు బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) అగ్రనేత నితీశ్ కుమార్ తన కార్యాచరణను వేగవంతంగా చేశారు. తమతో కలిసివచ్చే పార్టీల ముఖ్యనాయకులతో రాజధాని పట్నాలో కీలక భేటీ నిర్వహించాలని ఆయన ఇప్పటికే నిర్ణయించారు. ప్రతిపక్షాల సమావేశం వచ్చే నెల 12న జరిగే అవకాశం ఉందని నితీశ్ కుమార్‌కు సన్నిహితుడైన బిహార్ మంత్రి విజయ్‌కుమార్ చౌదరి సోమవారం చెప్పారు. భేటీ తేదీ దాదాపు ఖరారైనట్లేనని అన్నారు. బీజేపీని వ్యతిరేకించే పార్టీలన్నీ హాజరవుతాయని భావిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతిపక్షాలు కలిసికట్టుగా పనిచేస్తే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని మట్టికరిపించడం చాలా తేలిక అని అభిప్రాయపడ్డారు. విపక్ష కూటమి ఏర్పాటుకు నితీశ్ కుమార్ చొరవ తీసుకుంటున్నారని తెలిపారు.

హాజరుకానున్న మమతా బెనర్జీ

ఈ భేటీకి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత హాజరయ్యే అవకాశం ఉందని టీఎంసీ నేత చెప్పారు. ప్రతిపక్ష కూటమి ఏర్పాటుతోపాటు బీజేపీ వ్యతిరేక పోరాటాన్ని బలోపేతం చేయడానికి ఆమె సలహాలు సూచనలు ఇస్తారని వెల్లడించారు. పట్నాలో ప్రతిపక్షాల కీలక సమావేశం ఏర్పాటు చేయాలన్న సూచన తొలుత మమత నుంచి రావడం విశేషం. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ బలంగా ఉన్నచోట తాము ఆ పార్టీకే మద్దతు ఇస్తామని మమత గతంలో అన్నారు.

సీఎం సిద్ధరామయ్యకు ఆర్థికం

- శివకుమార్‌కు ఇరిగేషన్, బెంగళూరు డెవలప్‌మెంట్
- హోం శాఖ మళ్లీ జి.పరమేశ్వరకే..
- ప్రియాంక్ ఖర్గేకు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్
- మంత్రులకు శాఖలను కేటాయిస్తూ కర్ణాటక ప్రభుత్వం నోటిఫికేషన్



బెంగళూరు: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తన మంత్రివర్గంలోని మంత్రులకు శాఖలను కేటాయించారు. కీలకమైన ఆర్థిక శాఖను తనవద్దే ఉంచుకుని, ముఖ్యమైన నీటిపారుదల, బెంగళూరు సిటీ డెవలప్‌మెంట్ విభాగాలను డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు కేటాయించారు. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లతోపాటు 8మంది మంత్రులు ఈ నెల 20న ప్రమాణం చేసిన విషయం తెలిసిందే. శనివారం కొత్తగా 24 మందిని మంత్రివర్గంలోకి చేర్చుకున్నారు. వీరిలో గతంలో హోం శాఖను నిర్వహించిన జి.పరమేశ్వరకు తిరిగి అదే శాఖను కట్టబెట్టారు. భారీ, మధ్యతరహా పరిశ్రమల శాఖను ఎంబీ పాటిల్‌కు, కేజే జార్జికి విద్యుత్ శాఖను కేటాయిస్తూ కర్ణాటక ప్రభుత్వం ఆదివారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది. ఆర్థిక శాఖతోపాటు కేబినెట్ వ్యవహారాలు, పరిపాలన సిబ్బంది వ్యవహారాలు, ఇంటెలిజెన్స్, ఇన్ఫర్మేషన్, ఐటీ తదితర ఇతరులకు ఇవ్వని శాఖలు సీఎం సిద్ధరామయ్య వద్దే ఉన్నాయి. శివకుమార్‌కు భారీ, మధ్యతరహా నీటి వనరులు, బెంగళూరు సిటీ డెవలప్‌మెంట్ శాఖలను ఇచ్చారు. హెచ్‌కే పాటిల్‌కు న్యాయం, పార్లమెంటరీ వ్యవహారాలు, లెజిస్లేషన్, పర్యాటక శాఖలు, కేహెచ్ మునియప్పకు ఆహార పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖల బాధ్యతలను కేటాయించారు. రామలింగారెడ్డికి రవాణా, ముజ్‌రాయ్ శాఖలను ఇచ్చారు. హెచ్‌సీ మహదేవప్పకు సాంఘిక సంక్షేమం, సతీశ్ జర్కిహోళికి పబ్లిక్ వర్క్స్ శాఖలను అప్పగించారు. శివానంద పాటిల్‌కు టెక్స్‌టైల్స్, అగ్రికల్చరల్ మార్కెటింగ్ బాధ్యతలు కేటాయించారు. దినేశ్ గుండూరావుకు ఆరోగ్యం, కుటుంబసంక్షేమం, రెవెన్యూ శాఖను కృష్ణ బైరెగౌడకు, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే కొడుకు ప్రియాంక్ ఖర్గేకు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖను ఇచ్చారు. ఏకైక మహిళా మంత్రి లక్ష్మి ఆర్ హెబ్బాల్కర్‌కు మహిళ, శిశు అభివృద్ధి, సీనియర్ సిటిజన్ సాధికారిత శాఖ ఇచ్చారు.

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు 150 సీట్లు

రాబోయే ఎన్నికల్లో అధికారం మాదే | కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధీమా

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లో శాసనసభలో 230 సీట్లకు గాను రాబోయే ఎన్నికల్లో తాము 150 సీట్లు కచ్చితంగా గెలుచుకుంటామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారం తమదేనని తేల్చిచెప్పారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సోమవారం ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో మధ్యప్రదేశ్ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఎన్నికల సన్నద్ధతపై విస్తృతంగా చర్చించారు. ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటి నుంచే కష్టపడి పనిచేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. భేటీ అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించామని, మధ్యప్రదేశ్‌లోనూ అదే పరంపర కొనసాగిస్తామని చెప్పారు. కర్ణాటక ఫలితమే మధ్యప్రదేశ్‌లో పునరావృతం అవుతుందన్నారు. రాష్ట్రంలో 150 సీట్లు గెలుచుకోబోతున్నట్లు తమ అంతర్గత అధ్యయనంలో వెల్లడయ్యిందని వివరించారు. రాష్ట్రంలో 4 నెలల తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

మోదీ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోంది

తొమ్మిదేళ్ల బీజేపీ పాలనపై కాంగ్రెస్ ఆరోపణ

న్యూఢిల్లీ: గత వారంతో తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న మోదీ ప్రభుత్వ పాలనపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. పెరుగుతున్న ధరలను అదుపు చేశామని దురహంకార పూరిత వాదనలు చేస్తూనే తీవ్రమైన ద్రవ్యోల్బణం ద్వారా ప్రజలు సంపాదించిందంతా దోచుకుంటోందని ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈ తొమ్మిదేళ్లలో పేదరికం అంచున జీవిస్తున్న ప్రజల జీవితాలను మోదీ ప్రభుత్వం ఏమాత్రం మార్చలేకపోయిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. ముఖ్యమైన ప్రతి వస్తువుపైనా జీఎస్టీ భారం పడుతోందని, సామాన్యుడి జీవితం కష్టతరంగా మారిందన్నారు. కేంద్ర మంత్రులు, ఆ పార్టీ నేతలు మాత్రం తాము ఘనకార్యాలు సాధించామంటూ ప్రచారం మొదలుపెడతారంటూ జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. 'మోదీ ప్రభుత్వం వాస్తవంగా సాధించినవి ఇవే..2014 నుంచి వాస్తవ ఆదాయాల్లో వృద్ధిరేటు- వ్యవసాయ కార్మికులకు: 0.8%, వ్యవసాయేతర కార్మికులకు: 0.2%, నిర్మాణ కార్మికులకు:-0.02%మాత్రమే. అయినప్పటికీ, 2014 నుంచి నిత్యావసర వస్తువుల ధరలు- ఎల్పీజీ:169%, పెట్రోల్:57%, డీజిల్:78%, ఆవనూనె:58%, గోధుమపిండి:56%, పాలు:51% పెరిగాయి''అంటూ ఆయన ట్వీట్ చేశారు. అసంఘటిత రంగంలో వాస్తవ వేతనాల పెరుగుదల దాదాపు నిలిచిపోయిందంటూ వచ్చిన కథనాన్ని కూడా జైరాం రమేశ్ షేర్ చేశారు. అన్ని రంగాల ఆదాయాల్లో స్తబ్దత నెలకొనగా గౌతమ్ అదానీ సంపద మాత్రం 2014 నుంచి 1,225% పెరిగిందని వ్యాఖ్యానించారు. కేంద్రంలో ప్రధాని మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం మే 26వ తేదీతో 9 ఏళ్లు పూర్తి చేసుకుంది.

సాక్షి కరీంనగర్

మంగళవారం | 30 | మే | 2023



రాజన్నకు జనజాతర

వేములవాడ: రాజన్న సన్నిధి సోమవారం జన జాతరను తలపించింది. వేసవి సెలవులు దగ్గర పడుతుండడంతో 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



అపర భద్రాద్రి.. అభివృద్ధి జాడేది?

అపర భద్రాద్రిగా ఇల్లందకుంట శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయం పేరుగాంచింది. ఆలయాన్ని అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
40.0/28.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పత్తి క్వింటాల్‌కు రూ.7,050



జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధర స్వల్పంగా పెరిగింది. గత శుక్రవారం క్వింటాల్‌కు రూ.6,700 పలుకగా సోమవారం రూ.350 పెరిగి గరిష్టంగా రూ.7,050 పలికింది. మార్కెట్‌కు 13 వాహనాల్లో 195 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు మోడల్ ధర రూ.6,950, కనిష్ట ధర రూ.6,900 చెల్లించారు. గన్నీ సంచుల్లో ఒక్క రైతు 6 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,800 పలికింది. కాగా మార్కెట్‌లో క్రయ విక్రయాలను కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

దేవాదాయ భూములు ఆక్రమిస్తే చర్యలు



తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని మన్నెంపల్లిలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ భూముల్లో దేవాదాయ శాఖ అధికారులు సోమవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆలయ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దేవాదాయ శాఖ అధికారి శ్రీనివాస్ పేరిట బోర్డులు పెట్టారు. ఆలయ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని సర్పంచ్ మేడి అంజయ్య ఫిర్యాదు మేరకు దేవాదాయశాఖ అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా సర్వే నంబర్ 487లో 4.1 ఎకరాలు, సర్వే నంబర్ 5లో 25 గుంటలు, 213 సర్వే నంబర్‌లో 1.16 ఎకరాలు, 214 సర్వే నంబర్‌లో 12 గుంటలు, 215 సర్వే నంబర్‌లో 11 గుంటలు భూమి ఉండగా, సదరు సర్వే నంబర్లలో హెచ్చరిక బోర్డులు పెట్టారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డులు పెట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్, ఎంపీటీసీ పుప్పాల కనుకయ్య, మాజీ సర్పంచ్ గడ్డం నర్సింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు అక్ష



తల్లిదండ్రులతో అక్ష

కరీంనగర్: ఆంధ్రప్రదేశ్‌లోని అంబేద్కర్ కోనసీమ జిల్లా సకినేటి మండలం అంతర్వేదిలో 2016లో తండ్రితోపాటు కనిపించకుండా పోయిన చిన్నారి అక్ష తల్లిదండ్రుల చెంతకు చేరింది. జిల్లా అధికారుల కృషితో పాపను సోమవారం తల్లిదండ్రులు ద్వారక, రవికుమార్‌కు సీడబ్ల్యూసీ అధికారులు అప్పగించారు. వివరాలు.. ఈనెల 11న జిల్లాలోని సైదాపూర్ మండలం ఎగ్లాస్‌పూర్‌కు చెందిన మహిళ వద్ద అక్షను గ్రామస్తులు గుర్తించారు. బాలికకు ఎవరూ లేరని, ఉంటే చేరదీయాలని వాట్సాప్ ద్వారా సర్పంచ్ కొత్త రాజిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తిరుపతిరెడ్డి ప్రతిగ్రూప్‌లో షేర్ చేస్తూ సైదాపూర్ ఎస్ఐ సెల్ నంబర్‌ను పొందుపరిచారు. ఈక్రమంలో పాప కోసం రెండు కుటుంబాలకు చెందిన వారు అధికారులను ఆశ్రయించారు. కానీ పూర్తి ఆధారాలతో రావాలని శిశు సంక్షేమ శాఖ అధికారులు సూచించారు. సోమవారం అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన దంపతులు పూర్తి ఆధారాలు సమర్పించారు. దీంతో పాపను తల్లిదండ్రులకు అప్పగించారు.

అధికారులను అభినందించిన కలెక్టర్

కరీంనగర్: చిన్నారి అక్షను సోమవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ అధికారులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా పాప వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. అనంతరం బాగా చదువుకొని మంచి స్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు. చిన్నారికి చాక్లెట్లు, పెన్ను, పుస్తకం అందజేశారు. పాపను తల్లిదండ్రుల వద్దకు చేర్చడంలో కృషిచేసిన అధికారులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సంధ్యారాణి, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, సభ్యులు రెండ్ల కళింగశేఖర్, రాధ, అర్చన, విజయ్, డీసీపీఓ శాంత, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కోఆర్డినేటర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

'కట్టా'పై సస్పెన్షన్ వేటు!



- 'సాక్షి' కథనాలపై స్పందించిన ఈఎన్‌సీ
- కట్టా విష్ణువర్ధన్ నియామకం, విద్యార్హతలపై ఆరోపణలు
- సస్పెన్షన్ ఉత్తర్వులను స్వయంగా అందజేసిన ఏఈ
- సర్వీస్ రిమూవల్, సాలరీ రికవరీకి డిమాండ్
- 34 ఏళ్లుగా వ్యవస్థల కళ్లకు గంతలు కట్టాడని వెల్లడి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ (ఇంజినీరింగ్)శాఖలో కలకలం రేగింది. విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ ఏఈగా ఉన్న కట్టా విష్ణువర్ధన్ అలియాస్ వాసుపై సస్పెన్షన్ పడింది. అతని పేరు నుంచి నియామకం జరిగిన తీరు, విద్యార్హతలపై ఉన్న వివాదాలు, సర్వీసు రికార్డులో ఉన్న ఫోర్జరీ సంతకాల ఆరోపణలు వెరసి అతడిపై కొంతకాలంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద చర్చే నడుస్తోంది. అతని వ్యవహారంలో జరిగిన అక్రమాలపై 'సాక్షి' కొంతకాలంగా ఆధారాలతో వరుసగా పరిశోధనాత్మక కథనాలు అందిస్తోంది. ఈ కథనాలపై స్పందించిన హైదరాబాద్‌లోని ఈఎన్‌సీ కార్యాలయం ఆదివారం సాయంత్రం అతడిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

ఎన్ని విచారణలు వేసినా..

కట్టా విష్ణువర్ధన్‌పై సాక్షి కథనాలతో హైదరాబాద్‌లోని ఈఎన్‌సీ కార్యాలయం అతనిపై జనవరిలోనే విచారణకు ఆదేశించింది. అయితే ఆ జిల్లా అధికారులు విచారణ చేసిన నివేదిక సమర్పించినా.. దానిపై ఎలాంటి ముందడుగూ పడలేదు. పంచాయతీరాజ్ విభాగంలో పనిచేసి రిటైర్డ్ అయిన ఓ మైనార్టీ ఉద్యోగి చక్రం తిప్పి విచారణపై చర్యలు తీసుకోనివ్వలేదని ఉద్యోగులంతా ఆరోపిస్తున్నారు. గతంలోనూ తాము కట్టా విష్ణువర్ధన్ విద్యార్హతల విషయంలో రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సమయంలోనూ సదరు విశ్రాంత అధికారి విచారణను అడ్డుకున్నాడని మండిపడుతున్నారు. అయితే 'సాక్షి'లో అతని విద్యార్హతలు, సర్వీసు రికార్డులో సంతకాల ఫోర్జరీ విమర్శల వరకు అన్ని ఆధారాలతో వరుసగా కథనాలు ప్రచురితం కావడంతో ఇటీవల సచివాలయంలో విచారణ చేపట్టారు. అక్కడా విచారణ ప్రభావితమైందన్న విమర్శలు వచ్చాయి. అదే సమయంలో కొందరు సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు విషయాన్ని చేరవేశారని, జాప్యంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేయడంతోనే ఈఎన్‌సీ కార్యాలయం కట్టా విష్ణువర్ధన్‌పై సస్పెన్షన్ వేటు వేసిందని సమాచారం.

నిర్మల్ నుంచి ప్రత్యేకాధికారి..

కట్టా విష్ణువర్ధన్ ఆదినుంచి వివాదాస్పద అధికారే. అతడి గురించి తెలుసుకున్న ఉన్నతాధికారులు సస్పెన్షన్ ఆర్డర్స్‌ను జాగ్రత్తగా అతడికి చేరవేశారు. సాధారణ ప్యూన్‌లు, క్లర్కులు, ఇతర ఉద్యోగులతో ఇచ్చి పంపిస్తే విష్ణువర్ధన్ తీసుకునే అవకాశాలు తక్కువ అని ముందే గ్రహించిన ఉన్నతాధికారులు ఏఈ ర్యాంకు అధికారితో ఆదివారం ఆదేశాలను పంపించారు. నిర్మల్ సబ్ డివిజన్‌లో పనిచేసే సదరు అధికారి హైదరాబాద్ నుంచి వచ్చిన ఆదేశాలను పట్టుకుని సెలవుదినమైనప్పటికీ ఆదివారం కరీంనగర్ చేరుకున్నారు. ×కట్టా×ను ఆఫీసుకు పిలిపించి సస్పెన్షన్ ఆర్డర్స్‌ను అందజేసి, అతనితో రిసీవ్డ్ కాపీ మీద సంతకాలు కూడా తీసుకుని వెళ్లారు. అతనిపై క్రమశిక్షణ చర్యలు కొలిక్కి వచ్చేవరకూ సస్పెన్షన్ కొనసాగుతుందని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ ఆదేశాలు అమలవుతున్న కాలంలో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా కరీంనగర్ జిల్లా కేంద్రాన్ని వీడకూడదని స్పష్టం చేశారు.



రాజధానికి 'కట్టా' పంచాయితీ

ఏం జరిగింది..?

కట్టా విష్ణువర్ధన్ ఉరఫ్ వాసు 2 మార్చి 1967లో జన్మించాడు. అతడి తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ టీచర్లే. 1987లో తండ్రి వెంకటనాగరత్నాచారి మరణించారు. తల్లి ప్రభుత్వ టీచరు అన్న విషయాన్ని దాచి 1988లో కారుణ్య నియామకం కింద పంచాయతీరాజ్‌లో అప్పటి ఉమ్మడి జిల్లాలోని మహదేవపూర్‌లో గ్రేడ్–3 వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా చేరాడు. వాస్తవానికి 1984లోనే కట్టా నిరూప ప్రభుత్వ టీచర్‌గా నియమితులయ్యారు. కరీంనగర్ డీఈవో కార్యాలయంలో ఆమె పుట్టిన తేదీ 01 ఫిబ్రవరి 1956గా ఉంది. కానీ, విష్ణువర్ధన్ తన పదో తరగతి సర్టిఫికెట్లలో 02 మార్చి 1967లో జన్మించినట్లు పేర్కొన్నారు. తల్లి కంటే కేవలం పదేళ్ల చిన్నవాడంటూ అందరి కళ్లకు గంతలు కట్టాడు. నిబంధనల ప్రకారం.. కారుణ్య నియామకం కింద నాన్ టెక్నికల్ పోస్టులో చేరాల్సిందిగానీ అతను టెక్నికల్ పోస్టులో చేరడం గమనార్హం. అతని సర్వీసు రికార్డులో ఉన్న సంతకాలు ఫోర్జరీ అన్న ఆరోపణలు దుమారానికి కారణమయ్యాయి. తన సర్వీసులో పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్లలో అనేకచోట్ల పనిచేసిన ఇతను ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్నాడు.

సాలరీ రికవరీ చేయాలి



కట్టా విష్ణువర్ధన్ విద్యార్హతల విషయంలో ఏళ్లుగా వివాదం సాగుతోంది. 34 ఏళ్లుగా వ్యవస్థల కళ్లకు గంతలు కప్పిన అతనిపై సస్పెన్షన్ వేటుపడటం శుభపరిణామం. అక్రమంగా విధుల్లో చేరిన అతడిని సర్వీసు రిమూవల్ చేసి, అతనికి ఇంతకాలం ప్రభుత్వం అందజేసిన సాలరీని అధికారికంగా రికవరీ చేయాలి. అతనిపై క్రిమినల్ కేసులు బుక్ చేసి, అరెస్టు చేయాలి.

– ఆమీర్, సామాజిక కార్యకర్త

బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో సర్వే చేయాలి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

కరీంనగర్‌అర్బన్: జిల్లాలో అక్టోబర్ 1 నాటికి ఫొటో ఎలక్టోరల్ రోల్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 25 నుంచి జూన్ 23 వరకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ధ్రువీకరిస్తారని, జూన్ 24 నుంచి జూలై 24 వరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, వ్యత్యాసాల తొలగింపు, ఫొటో ఇమేజీలు మెరుగుపరచడం, పోలింగ్ కేంద్రాల బౌండరీలో మార్పులు, చేర్పులు, నియంత్రణ పట్టికలో సవరణలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జూలై 25 నుంచి 31 వరకు ఫార్మాట్ 1 నుంచి 8 వరకు తయారు చేయడం, ఆగస్టు 2న సమీకృత ఎన్నికల ముసాయిదా ప్రచురణ జరుగుతుందని, ఆగస్టు 2 నుంచి 31 వరకు డ్రాఫ్ట్ రోల్‌పై వచ్చిన అభ్యంతరాల ఫిర్యాదులు స్వీకరించి చర్యలు చేపట్టడం, అక్టోబర్ 4న తుది ఓటర్ల జాబితా ప్రచురణ చేయడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఆర్డీఓలు ఆనంద్‌కుమార్, హరిసింగ్, డీఆర్డీఓ శ్రీలత, బీఎస్పీ, బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ఎంఐఎం పార్టీల ప్రతినిధులు గోలి అనిల్‌కుమార్, సత్తినేని శ్రీనివాస్, బండ రమణారెడ్డి, కె.పద్మాకర్‌రెడ్డి, మిట్యాకారి వాసుదేవరెడ్డి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఎండీ అమన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

కరీంనగర్ అర్బన్: సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో 175 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్జీదారుల ద్వారా సమస్యలు తెలుసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి 23, తహసీల్దార్ కొత్తపల్లి 14, కరీంనగర్ ఆర్డీవో 12, తహసీల్దార్ హుజురాబాద్ 10, తహసీల్దార్ కరీంనగర్ రూరల్ 10, ఇతర శాఖలకు సంబంధించి 106 ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని కలెక్టరేట్ ఏవో జగత్‌సింగ్ తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ ఆర్డీఓ ఆనంద్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి పెరిగిన భద్రత

ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో ఆందోళనలు, నిరసనలు కొనసాగుతుండగా రెండంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ప్రధాన ద్వారంతోపాటు ఆడిటోరియం ప్రవేశమార్గం, అర్జీలు ఇచ్చే ప్రాంతంలో పోలీసులను నియమించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏఎస్ఐ నేతృత్వంలో 10మంది వరకు పోలీసులు, నలుగురు మహిళా పోలీసులను నియమించారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీసీలో కలెక్టర్, సీపీ, తదితరులు

కరీంనగర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లలతో సమీక్షించారు. జూన్ 2 నుంచి 22 వరకు మన ప్రగతి చాటేలా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. రైతు దినోత్సవం, ఊరురా చెరువుల పండుగ నిర్వహణపై అధికారులు ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ రంగంలో గత పరిస్థితి, నేటి ప్రగతిని తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, పోలీస్ ఆధ్వర్యంలో సురక్షా దివస్, తెలంగాణ రన్ నిర్వహించాలన్నారు. జూన్ 9న ప్రతి నియోజకవర్గ పరిధిలో రెండో విడత గొర్రెల పంపిణీ, అవకాశం ఉన్న చోట ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ మాట్లాడుతూ, జిల్లాలో అన్ని శాఖలు సాధించిన ప్రగతిని వివరించేలా దశాబ్ది వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వీసీలో సీపీ సుబ్బారాయుడు, అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్, ట్రెయినీ కలెక్టర్ లెనిన్ వాట్సల్ టోప్పో, శిక్షణ జాయింట్ కలెక్టర్ నవీన్ నికొలస్, డీసీపీలు చంద్రమోహన్, శ్రీనివాస్, ఆర్‌డీవోలు ఆనంద్‌కుమార్, హరిసింగ్, డీపీఓ శ్రీధర్, డీఆర్డీవో శ్రీలత, డీఎంహెచ్‌వో లలితాకుమారి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నవీన్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మే 28 చరిత్రలో చీకటి రోజు

- ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

కరీంనగర్: మే 28 చరిత్రలో చీకటి రోజు అని, బ్రిటీష్ ప్రభుత్వానికి ఏజెంటుగా పనిచేసిన సావర్కర్ జయంతి రోజున నూతన పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించడంపై బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వైఖరి తేటతెల్లమైందని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం విమర్శించారు. సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ లేకుంటే తాను ప్రధానమంత్రి కాలేకపోయేవాడిని అని చెప్పిన ప్రధాని మోడీ నూతన పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు నామకరణం చేసేందుకు ఏం అడ్డువచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. పార్లమెంట్ భవన ప్రారంభోత్సవం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా చేయించకపోవడం యావత్ మహిళా లోకాన్ని, దళిత, గిరిజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని అన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారని, దళితుల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు చేపడుతున్నారని వివరించారు. సీఎంకు కృతజ్ఞతలు తెలియజేసేందుకే ఆగస్టు 29న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జేఏసీ రాష్ట్ర, జిల్లా బాధ్యులు బొంకూరి సురేందర్, పేటా భాస్కర్, గజ్జెల ఆనందరావు, కల్లెపల్లి శంకర్, సముద్రాల అజయ్, కొంగ్ర సంపత్‌కుమార్, క్యాదాసి ప్రభాకర్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.





శ్రీవారి కల్యాణానికి రండి

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ పద్మనగర్‌లో ఈనెల 31న ఉదయం టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీవారి ఆలయ నిర్మాణ భూమిపూజకు, సాయంత్రం జరిగే శ్రీనివాసుని కల్యాణోత్సవానికి తరలిరావాలని మంత్రి గంగుల కమలాకర్ కోరారు. సోమవారం నగరంలోని టవర్‌సర్కిల్ ప్రాంతంలో ఇంటింటా తిరుగుతూ వాణిజ్య వ్యాపారులకు బొట్టుపెట్టి ఆహ్వానించారు. కార్యక్రమంలో నగర మేయర్ సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి, కార్పొరేటర్లు వంగల శ్రీదేవి పవన్‌కుమార్, గందె మాధవి, గుగ్గిళ్ల జయశ్రీ, కోల మాలతి, నాంపల్లి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, అనురాసు కుమార్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాకు కసరత్తు

- కొత్త ఓటరు నమోదుకు షెడ్యూల్ విడుదల
- బోగస్ ఓట్ల ఏరివేతకు ఇంటింటి సర్వే
- ఆగస్టు 2న ముసాయిదా.. అక్టోబర్ 4న తుది జాబితా

జిల్లాలో ఓటర్లు:	9,96,454
పురుషులు:	4,93,728
మహిళలు:	5,02,695
ఇతరులు:	31

నియోజకవర్గాల వారిగా ఓటర్ల వివరాలిలా

నియోజకవర్గం	ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
కరీంనగర్	3,21,758	1,61,765	1,59,970	23
చొప్పదండి	2,27,615	1,11,605	1,16,006	4
మానకొండూరు	2,11,599	1,04,510	1,07,087	2
హుజూరాబాద్	2,35,482	1,15,848	1,19,632	2

కరీంనగర్ అర్బన్: జిల్లా ఎన్నికల యంత్రాంగం పారదర్శక ఓటరు జాబితాకు కసరత్తు చేస్తోంది. కొత్త ఓటర్ల నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ప్రతి ఏడాది జనవరిలో జరిగే ఓటరు నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర ఎన్నికల దృష్ట్యా ముందుగా చేపడుతోంది. తెలంగాణ, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, మిజోరాం రాష్ట్రాల్లో ఈ ఏడాది ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. దీంతో స్పెషల్ సమ్మరీ రివిజన్ చేపట్టాలని ఎన్నికల సంఘం కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ ఏడాది అక్టోబర్ ఒకటో తేదీనాటికి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ కొత్తగా ఓటు హక్కు కల్పించనున్నారు.

షెడ్యూల్ తీరిలా

ఈ నెల 25 నుంచి జూన్ 23 వరకు బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితాను పరిశీలిస్తారు. చనిపోయిన, వలస వెళ్లిన ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తారు. జూన్ 24 నుంచి జూలై 27 వరకు పోలింగ్ స్టేషన్లను క్రమబద్ధీకరిస్తారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 1,500ల మంది ఓటర్లు మించకుండా పోలింగ్‌స్టేషన్ పరిధి నిర్ణయిస్తారు. జూలై 25 నుంచి 31 వరకు ఓటరు జాబితాకు సంబంధించిన సప్లిమెంట్స్ ప్రక్రియ చేపట్టనున్నారు. పురుషులు, మహిళలు, జనాభా తదితర వివరాలన్నింటినీ క్రోడీకరిస్తారు.



బోగస్ ఓట్ల ఏరివేత

బోగస్ ఓటర్లపై ఎన్నికల సంఘానికి పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపట్టారు. కొత్త ఓటర్లు, తొలగించిన ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఇవ్వడంతోపాటు, వాళ్ల నుంచి వచ్చే అభ్యంతరాలను వెంటనే పరిశీలిస్తున్నారు. ఓటరు జాబితా రూపకల్పనలో బూత్ లెవల్ అధికారుల(బీఎల్‌వో) పాత్ర కీలకం. చాలా చోట్ల బీఎల్‌వోలు లేకపోగా మరికొన్ని చోట్ల ఐకేపీ, సాక్షర భారత్ సిబ్బంది ఉండగా వారినందరిని తొలగించాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ క్రమంలో జిల్లాలో 350 మంది బీఎల్‌వోలుగా వ్యవహరిస్తుండగా వారిని తొలగించారు. వారి స్థానంలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలను నియమించారు. ప్రస్తుతం బోగస్ ఓట్ల ఏరివేత సాగుతుండగా సదరు పనుల్లో నిమగ్నమయ్యారు.

ఆగస్టు 2న ముసాయిదా

ఈ ఏడాది జనవరి 5న ఫైనల్ ఓటరు జాబితా ప్రకటించారు. దీని ప్రకారం జిల్లాలో ఓటర్లు 9,96,454 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 4,93,728, మహిళలు 5,02,695, ఇతరులు 31 మంది ఉన్నారు. ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ప్రతి మూడు నెలలకోసారి కొత్త ఓటర్ల జాబితా రూపొందిస్తోంది. ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి ఒకటో విడత ముగిసింది. రెండో విడత జూలై 7 వరకు కొనసాగుతుంది. తాజాగా ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో అక్టోబర్ 1వరకు కొత్త ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేస్తామని ఎన్నికల అధికారులు తెలిపారు. బూత్ లెవల్‌స్థాయిలో ఒక నెలలో రెండు శనివారాలు, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టనున్నారు. ప్రక్రియ ముగిశాక ముసాయిదాను ఆగస్టు 2న ప్రకటిస్తారు. ఈ జాబితా పై అభ్యంతరాలు, ఫిర్యాదులు ఆగస్టు 31వ తేదీ వరకు స్వీకరిస్తారు. వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలను సెప్టెంబర్ 22లోగా పరిష్కరించి కొత్త ఓటర్ల లిస్టులు ముద్రించి, తుది ఓటరు జాబితాను అక్టోబర్ 4న ప్రకటిస్తారు.

క్లుప్తంగా

'హలో రెడ్డి.. చలో కరీంనగర్'కు రండి

- తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రామడుగు(చొప్పదండి): కరీంనగర్‌లో జూన్ 6న నిర్వహించే హలో రెడ్డి.. చలో కరీంనగర్ కార్యక్రమానికి ప్రతీ రెడ్డి బంధువు తరలివచ్చి, విజయవంతం చేయాలని తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు వంచ సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. రామడుగు మండలంలోని వెదిర గ్రామ చావడి వద్ద సోమవారం సంబంధిత వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర కార్యదర్శి దొడ్డ లచ్చిరెడ్డి, వెదిర రెడ్డి సంఘం అధ్యక్షుడు వంగల భూంరెడ్డి, ప్రతినిధులు గిరి శ్రీనివాస్‌రెడ్డి, రాల్లబండి సంతోష్‌రెడ్డి, ఎడెల్లి రాజిరెడ్డి, పన్యాల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం



మాట్లాడుతున్న మల్లేశం

కరీంనగర్‌కల్చరల్: బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యమని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం పటేల్ అన్నారు. సోమవారం సంఘ కార్యాయలంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జనాభాలో 54 శాతానికి పైగా ఉన్న బీసీలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని పేర్కొన్నారు. బీసీల ఓట్లతో రాజ్యాధికారాన్ని అనుభవిస్తున్న రాజకీయ పార్టీలకు రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అనుమాస నితిన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్, కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతువేదిక బిల్లులు రాలేదని సమావేశం అడ్డగింత

శంకరపట్నం(మానకొండూర్): రైతువేదిక నిర్మించిన బిల్లులు రాలేదని మొలంగూర్ సర్పంచ్ అనూష భర్త శ్రీనివాస్ వానాకాలం సాగు సమావేశాన్ని అడ్డుకున్నారు. శంకరపట్నం మండలంలోని మొలంగూర్ క్లస్టర్ సమావేశాన్ని స్థానిక రైతువేదికలో సోమవారం నిర్వహించారు. మొలంగూర్, కొత్తగట్టు, గొల్లపల్లి, మక్త, చింతలపల్లి గ్రామాల రైతులకు వానాకాలం, ఆయిల్‌పామ్ సాగుపై ఏవో శ్రీనివాస్ అవగాహన కల్పిస్తుండగా సర్పంచ్ భర్త అక్కడికి చేరుకున్నారు. రైతువేదిక నిర్మించిన బిల్లులు రాలేదని, సమావేశం నుంచి బయటకు వెళ్లాలని చెప్పడంతో రైతులు వెళ్లిపోయారు. ఈ విషయమై ఏవో శ్రీనివాస్, ఏఈవో శ్రావణిలు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమే దశాబ్ది ఉత్సవాలు

కొత్తపల్లి(కరీంనగర్): ఎన్నికల్లో లబ్ధి కోసమే దశాబ్ది ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతుందే తప్ప సాధించిన అభివృద్ధి శూన్యమన్నారు. అప్పులు, తాగుబోతుల రాష్ట్రంగా మార్చిన అబద్ధాల కేసీఆర్ అన్ని వర్గాలను మోసం చేశారని విమర్శించారు. రైతులకు పరిహారం ఇవ్వడం లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించి, తెలంగాణను కాపాడుకోవాలని ప్రజలను కోరారు.

అపర భద్రాద్రి.. అభివృద్ధి జాడేది?

- నెరవేరని ప్రజాప్రతినిధుల హామీలు
- యాదాద్రి, భద్రాద్రి తరహాలో వసతులు సమకూరేనా?
- ప్రత్యేక నిధులు కేటాయించాలని భక్తుల డిమాండ్



మరమ్మతుకు నోచుకోని పార్కులోని పరికరాలు



ఆలయంలో ఎండలోనే ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ఇల్లందకుంట(హుజూరాబాద్): అపర భద్రాద్రిగా ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం పేరుగాంచింది. కానీ ఈ ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత 2016లో ఇల్లందకుంట మండల కేంద్రంగా ఏర్పాటైంది. దీంతో ప్రత్యేక నిధులు కేటాయిస్తారనుకున్న ప్రజలకు నిరాశే ఎదురైంది. ఇప్పటికైనా అపర భద్రాద్రిని యాద్రాద్రి, భద్రాద్రి తరహాలో అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

హామీలు మరిచిన మంత్రి, ఎంపీ..

- ఎన్నికల సమయంలో రాములోరి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ అభివృద్ధిపై నాయకులు హామీల వర్షం కురిపిస్తున్నా కార్యరూపం దాల్చడం లేదు.
- హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో రూ.10 కోట్లు కేటాయించి ఆలయం లోపల కొండగట్టు తరహాలో ఎత్తయిన రేకుల షెడ్డు, భక్తుల విశ్రాంతి కోసం 40 గదులు, ఆలయం ఎదుట గార్డెనింగ్, తూర్పు వైపు రాజగోపురం, యాగశాల, కోనేరు ఆధునీకరణ, కూడలి వద్ద గరుడ విగ్రహం పనులు చేపడుతామని మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన హామీ నీటిమూటగానే మిగిలింది.
- మాజీ మంత్రి ఈటల రాజేందర్ గతంలో పోలీస్‌స్టేషన్ వెనక హరిత హోటల్ కోసం రెండుసార్లు సర్వే చేయించారు.



హరిత హోటల్‌కు కేటాయించిన స్థలం

- ఎంపీ ల్యాడ్ నిధుల నుంచి ఆలయ అభివృద్ధికి రూ.30 లక్షలు కేటాయించాలని ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను ఆలయ అధికారులు గతంలో కోరారు. అయితే నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చిన ఎంపీ తర్వాత మరిచారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రూ.50 లక్షలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభానికి నోచుకోవడం లేదు. హరిత హోటల్ పనులు చేపట్టడం లేదు.

మినీ రిజర్వాయర్‌తో ప్రజాధనం వృథా!

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.14 కోట్లతో ఆలయ సమీపంలో మినీ రిజర్వాయర్ నిర్మించారు. ఇక్కడి నుంచి పది గ్రామాలకు తాగునీరందించడంతోపాటు ఆలయానికి వచ్చే భక్తులు, పర్యాటకుల కోసం బోటు సౌకర్యం కల్పిస్తామని చెప్పినా సాధ్యం కాలేదు. ముందస్తు ప్రణాళిక లేకుండా రిజర్వాయర్ నిర్మించి, ప్రజాధనం వృథా చేశారని, కాంట్రాక్టర్, నాయకుల జేబులు నిండాయన్న ఆరోపణలున్నాయి. 2017–18లో స్వామివారి సన్నిధిలో శ్యాంప్రసాద్‌లాల్ ముఖర్జీ రూర్బన్ మిషన్ పథకం కింద రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేయగా, నాటి నుంచి నేటి వరకు పట్టించుకునేవారు కరువయ్యారు. పర్యవేక్షణ లేక పరికరాలు తుప్పుపట్టిపోతున్నాయి.

టూర్ ప్రాజెక్టుగా చేయాలి



ఓదెల మల్లికార్జునస్వామి, ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి, కొత్తకొండ వీరభద్రస్వామి, కొత్తగట్టు మచ్చగిరీంద్రస్వామి ఆలయాలను కలుపుతూ టూర్ ప్రాజెక్టుగా ఎంపిక చేయాలి. భక్తులు వసతులు కల్పించాలి.

– ఇంగ్లే రామారావు, ఆరె కులసంఘం జిల్లా అధ్యక్షుడు

నిధులు తీసుకురావాలి



ఇల్లందకుంట ఆలయాన్ని అభివృద్ధి చేయాలి. స్థానిక నేతలు సమన్వయంతో పని చేసి, ప్రత్యేక నిధులు తీసుకురావాలి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలి.

– బుర్ర రమేశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకుడు, సిరిసేడు

'తెలంగాణ ఇవ్వకపోతే మీకు పదవులెక్కడివి?'

- కాంగ్రెస్‌పై అడ్డగోలుగా మాట్లాడుతున్న కల్వకుంట్ల కుటుంబసభ్యులు
- మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి

చిగురుమామిడి(హుస్నాబాద్): కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రం ఇవ్వకపోతే కల్వకుంట్ల కుటుంబానికి పదవులెక్కడివని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా చిగురుమామిడి మండలంలోని కొండాపూర్ గ్రామంలో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై, జెండా ఆవిష్కరించారు. ప్రజలు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పై అడ్డగోలుగా మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, ఆయన కుటుంబసభ్యులు సోనియాగాంధీతో ఫొటో దిగినప్పుడు తెలియలేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో మూడు నియోజకవర్గాలే అభివృద్ధి చెందాయన్నారు. అమరుల త్యాగాలతో వచ్చిన తెలంగాణ సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులకోసమేనా అని మండిపడ్డారు. ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ ఈ నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు, 2 లక్షల ఉద్యోగ ఖాళీల భర్తీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, భూమిలేని ఉపాధిహామీ కూలీలకు రూ.12 వేల సాయం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, చిగురుమామిడి, కోహెడ, హుస్నాబాద్, అక్కన్నపేట్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంది తిరుపతిరెడ్డి, మంద ధర్మయ్య, బంక చందు, జంగపల్లి అయిలయ్య, నాయకులు వడియాల సుధాకర్‌రెడ్డి, షాబుద్దీన్, పొన్నం సంపత్, మహిపాల్‌రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం



జగదీశ్వర్‌ను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

కరీంనగర్: టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మారం జగదీశ్వర్‌ను పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లెపాటి వేణుగోపాల్ రావుల ఆధ్వర్యంలో సోమవారం ఆయన నివాసంలో సన్మానించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రగతిలో ఉద్యోగ, ఉపాధ్యాయులు కూడా భాగస్వామ్యం కావడం సంతోషకరమైన విషయమన్నారు. ప్రస్తుతం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను జరుపుకోబోతున్న శుభ సందర్భంగా రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందేలా, కొంత ప్రీమియంతో నూతన ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్(ఈహెచ్‌ఎస్) అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా అంశాలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు. అలాగే పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేసేలా, పీఆర్సీని ప్రకటించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ డీసీఈబీ కార్యదర్శి మారం స్వదేశ్ కుమార్, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కేతిరి తిరుపతిరెడ్డి, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు చొల్లేటి శ్రీనివాస్, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నరుకుల్ల శ్రీధర్, నాయకులు మహమ్మద్ అష్ఫాక్ హుస్సేన్, భూపతి, సంజీవ రెడ్డి, శంకర్, వి.నాగరాజు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కమిటీ బాధ్యులు

కరీంనగర్ కల్చరల్: పేద ప్రజల ఓట్లతో గెలిచిన రాష్ట్ర ప్రభుత్వం వారినే పట్టించుకోవడం లేదని భూసాధన పోరాట కమిటీ అధ్యక్షుడు జక్కనపల్లి గణేశ్ విమర్శించారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. అసంఘటిత కార్మికులు, లేబర్ అడ్డా కూలీల సంపాదనలో సగానికి పైగా నెలవారీ ఇంటి అద్దెకే పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వలస కూలీల కుటుంబాల్లో పిల్లల విద్య, వైద్యానికి డబ్బులు సరిపోక నిరక్షరాస్యులుగా మిగిలిపోతూ, అనారోగ్య పరిస్థితుల్లో తనువు చాలిస్తున్నారని తెలిపారు. అధికార యంత్రాంగం వెంటనే స్పందించి, ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ షఫీ, సభ్యులు రేపోజు వాణి, బానోతు సునీత, మాతంగి రేణుక, మిట్టపల్లి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న జీఎంలు

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3 డివిజన్ పరిధిలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వర్‌రావు, ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆర్జీ–3 జీఎం కార్యాయలంలో సంబంధిత అధికారులతో వేడుకల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ 2 నుంచి 21 రోజుల వరకు జరిపే సంబురాలు పండుగ వాతావరణాన్ని తలపించేలా ఉండాలన్నారు. కాలనీల ప్రధాన కూడళ్లను మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించాలని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, సామూహిక భోజనాలకు ఏర్పాట్లు చేయాలని, ఉత్తమ ఉద్యోగులను సన్మానించాలని సూచించారు. అధికారులు ఎలీషా, రాధాకృష్ణ, బైద్య, రఘుపతి, శ్రీనివాసులు, వెంకటరమణ, జైనుల్లాబద్దీన్, విలాస్ శ్రీనివాస్ పోద్దార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జీడీకే–1, 3 ఇంక్లయిన్ గనుల సందర్శన



డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్ జీడీకే–1, 3 ఇంక్లయిన్ గనులను జీఎం చింతల శ్రీనివాస్, అధికారులతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్షణతో కూడిన నిర్దేశిత ఉత్పత్తి, ఉత్పాదకత, మ్యాన్ పవర్, యంత్రాల వినియోగం తదితర అంశాలపై సూచనలు చేశారు. నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను రక్షణతో సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏజెంట్ బానోతు సైదులు, ప్రభాకర్, సర్వే అధికారి శ్రీనివాస్, సంక్షేమ అధికారి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేయుటకు (అన్ని సబ్జెక్టులు టీజీటీ, పీజీటీ, జేఎల్ స్టాఫ్ కోసం) మహిళ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మధుసూదన్ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల విషయ పరిజ్ఞానం, బోధన నైపుణ్యం, అనుభవం, ఆంగ్ల భాష పరిజ్ఞానం, డెమో ఆధారంగా మెరిట్ లిస్టు తయారు చేసి అవకాశం కల్పించబడునని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు తమ దరఖాస్తులను సరైన పత్రాలతో రీజనల్ లెవల్ కో ఆర్డినేటర్ లేదా సంబంధిత మైనార్టీ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్స్‌కు వారం రోజుల్లోగా సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 82475 06232, 98660 06098 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

రైలు ఢీకొని వలస కార్మికుడి దుర్మరణం

పెద్దపల్లిరూరల్: రైలు ఢీకొని ఓ వలస కార్మికుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మహారాష్ట్రలోని మహాగావ్‌కు చెందిన నారాయణదుర్గే(45) పెద్దపల్లి పట్టణంలోని శాంతినగర్‌లో తన భార్య గోపిక దుర్గేతో కలిసి రెండేళ్లుగా నివాసం ఉంటున్నాడు. స్థానికంగా తాపీమేస్త్రీగా పని చేస్తున్న ఆయన సోమవారం బహిర్భూమికి వెళ్లి, రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నారాయణదుర్గే అక్కడికక్కడే మృతిచెందాడని రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రక్తకణాలపై తప్పుడు రిపోర్ట్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి ల్యాబ్‌లో ఆదివారం రాత్రి రక్తపరీక్ష చేయించుకుంటే రక్తకణాలు 23 వేలకు పడిపోయాయని తప్పుడు రిపోర్ట్ ఇచ్చారని పెద్దపల్లి మండలం కాపులపల్లికి చెందిన శనిగరపు సాయికుమార్ వాపోయాడు. ప్లేట్‌లెట్స్ ఎక్కించాలంటూ భయభ్రాంతులకు గురిచేశారని తెలిపాడు. సోమవారం మరోచోట పరీక్షలు చేయించగా 1.23 లక్షలు ఉన్నట్లు రిపోర్ట్ ఇచ్చారన్నాడు. ఇదేంటని ఆ ప్రైవేటు ఆసుపత్రి వైద్యుడిని అడిగితే ఎవరికైనా ఫిర్యాదు చేసుకో అంటూ సమాధానమిచ్చారని అన్నాడు. దీనిపై డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తానన్నాడు.

నేడు డయల్ యువర్ డీఎం

హుజూరాబాద్: హుజూరాబాద్ డిపో మేనేజర్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ పి. అర్పిత తెలిపారు. సలహాలు, సూచనలు ఇవ్వదలుచుకున్నవారు 99592 25924 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కమాన్‌పూర్‌లో ఆగని అక్రమ నిర్మాణాలు

- ఓవైపు తూంకుంట, మరోవైపు గుట్టను వదలని అక్రమార్కులు
- అధికారుల ఉదాసీనత, ప్రజాప్రతినిధుల అండదండలే కారణం!





తూంకుంటలో అక్రమంగా నిర్మించిన షెడ్డు, అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న పంచాయతీ సిబ్బంది

కొత్తపల్లి(కరీంనగర్): మండలంలోని కమాన్‌పూర్ పంచాయతీ పరిధి ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు, అధికారుల ఉదాసీన వైఖరితో విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందన్న ఆరోపణలున్నాయి. ఓవైపు తూంకుంట అసైన్డ్ భూమిలో అక్రమ నిర్మాణాలు, మరోవైపు కమాన్‌పూర్ గుట్ట ప్రాంతంలోని ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. పలుమార్లు 'సాక్షి' దినపత్రిక ఈ ఆక్రమణలను వెలుగులోకి తీసుకురాగా.. ఆపినట్టే ఆపిన అధికారులు మళ్లీ పట్టించుకోలేదు. దీంతో రోడ్డు పక్కన మరో షెడ్డు నిర్మాణం పూర్తయింది.

కూల్చివేస్తున్నా పట్టించుకోవడం లేదు

కమాన్‌పూర్ గ్రామానికి చెందిన కుంట ముత్తయ్యకు కేకే పట్టా(ఖారాజీ ఖాతా) కింద 120 సర్వే నంబర్‌లో నాలుగెకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. వంశపారపర్యంగా వస్తున్న ఈ స్థలంలో వ్యవసాయం చేసుకుంటూ ఉపాధి పొందాల్సి ఉండగా..కరీంనగర్‌కు అతి సమీపంలో ఉండటం వల్ల ప్లాట్లుగా విభజించి, అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో ఈ భూమిలో నిర్మించిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేసినప్పటికీ పట్టించుకోకుండా నిర్మిస్తున్నారు. చిన్న పశువుల కొట్టంతో మొదలైన అక్రమ నిర్మాణాలు ప్రస్తుతం నాలుగు భవనాలకు, తాజాగా మరో షెడ్డు వరకు చేరుకోగా అక్రమార్కులు సవాల్ విసురుతున్నారు. అప్పటి తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్ హయాంలో జోరుగా సాగిన అక్రమ నిర్మాణాలకు తహసీల్దార్ గండె లక్ష్మీనరసింహారావు ఫుల్‌స్టాప్ పెట్టారు. అనంతరం రెవెన్యూ అధికారులు దృష్టిసారించకపోవడంతో నిర్మాణాలు జోరందుకున్నాయి.

సర్వే నంబర్ 116లోనూ..

కమాన్‌పూర్ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 116లోనూ అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. రేకుల షెడ్లు వేస్తూ ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటున్నారు. కరీంనగర్ శివారు గ్రామాలు కావడంతో నివేశన స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. దీన్ని ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు ఓ షెడ్డు వేస్తే పోయేదేముందిలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూముల్లో సైతం క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పలు నిర్మాణాల కూల్చివేత

కమాన్‌పూర్ పంచాయతీ పరిధిలోని 116 సర్వే నంబర్‌లో అనుమతిలేని పలు నిర్మాణాలను గ్రామ పంచాయతీ సిబ్బంది సోమవారం కూల్చివేశారు. అయితే వారికి రోడ్డును ఆనుకొని తూంకుంటలో నిర్మిస్తున్న కట్టడాలు కనిపించకపోవడంపై అందరూ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాత తేదీల్లో ప్రభుత్వ అనుమతులు చూపుతూ షెడ్ల నిర్మాణాలు చేపట్టి, విక్రయిస్తున్నట్లు తెలిసింది. దీనికంతటికీ స్థానికంగా ఉండే ఓ దళారీ నాయకత్వం వహిస్తుండగా స్థానిక ప్రజాప్రతినిధులు అండగా నిలుస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

నోటీసులు జారీ చేస్తాం

కమాన్‌పూర్ ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారికి నోటీసులు జారీ చేస్తాం. వారి వద్ద గతంలో ఇచ్చిన పట్టాలున్నట్లయితే వాటిపై సమగ్ర విచారణ జరుపుతాం. అదేవిధంగా తూంకుంట నిర్మాణాలపై పట్టా వాయిలెన్స్ నోటీసు ఇస్తాం. అక్రమ నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

– నల్ల వెంకట్‌రెడ్డి, తహసీల్దార్, కొత్తపల్లి









లాల్‌బహదూర్ స్టేడియంలో మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల క్రీడాకారులు

చీఫ్ మినిస్టర్స్ కప్.. మనోళ్ల మార్చ్‌ఫాస్ట్

కరీంనగర్ స్పోర్ట్స్: చీఫ్ మినిస్టర్స్ కప్–2023 రాష్ట్రస్థాయి పోటీలు సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ముందుగా జరిగిన మార్చ్‌ఫాస్ట్‌లో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన క్రీడాకారులు తమ ప్లకార్డులు, ఫ్లాగ్‌లతో పాల్గొన్నారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

క్లుప్తంగా

లఘు చిత్రాలు ప్రారంభం



క్లాప్ కొట్టి ప్రారంభిస్తున్న పవన్‌కుమార్

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని మాస్క్ యాక్టింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి నట శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థులకు కెమెరా ప్రాక్టికల్స్‌లో భాగంగా రూపొందించే మూడు లఘు చిత్రాలకు సోమవారం 46వ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు పవన్‌కుమార్ క్లాప్‌కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాస్క్ ఇనిస్టిట్యూట్ చైర్మన్, దర్శకుడు అనసూరి భూనాథచారి, కోఆర్డినేటర్ వంగల శ్రీధర్, కొరియోగ్రాఫర్ రజాక్, కెమెరామెన్ శ్రీకాంత్ కనకం, నటన నేర్చుకుంటున్న విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్వర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



జగదీశ్వర్‌కు బొకే అందజేస్తున్న సురేందర్‌రెడ్డి

కరీంనగర్: రాష్ట్ర టీఎన్‌జీవో ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన మారం జగదీశ్వర్‌ను కరీంనగర్‌లోని టీఎన్‌జీవోభవన్‌లో సోమవారం బోయినపల్లి మండల బీఆర్ఎస్ నాయకుడు ఎం.సురేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, ఉపాధ్యక్షుడు గంగారపు రమేశ్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నియామక పత్రాలు అందుకుంటున్న సభ్యులు

కొత్తపల్లి: గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని పద్మనగర్‌లోని కార్యాలయంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్రె ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కర్రె రాజు, డైరెక్టర్లుగా భూమల్ల భార్గవి, మ్యాకల విమల, చిగుర్ల లక్ష్మయ్య, పెద్దిగారి ఐలయ్య, బీర్ల ఐలయ్యలు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా బి.రాములు వ్యవహరించారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు.

'రాజదండం ఏర్పాటు రాజ్యాంగ ఉల్లంఘనే'



మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

విద్యానగర్(కరీంనగర్): నూతన పార్లమెంటు భవనంలో ఏర్పాటు చేసిన రాజదండం రాజ్యాంగ ఉల్లంఘన కిందికే వస్తుందని ప్రజామిత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1947 ఆగస్టు 14న రాజదండాన్ని అప్పటి బ్రిటిష్ పాలకులు అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు అందజేసినట్లు చరిత్ర తెలుపుతోందని, భారతదేశం సార్వభౌమ అధికారం ప్రకటించిన తర్వాత రాచరిక గుర్తులకు ఎలాంటి ప్రాధాన్యత ఉండదన్నారు. ఈ సమావేశంలో నాయకులు బోయినపల్లి చంద్రయ్య, చిగిరి శ్రీధర్, పులిపాక శ్రీనివాస్ వేణు, నేరెళ్ల సతీశ్ పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి తరలిరావాలి

హుజూరాబాద్: హైదరాబాద్‌లో ఆరెకరాల స్థంలో రూ.12 కోట్లతో నిర్మించిన బ్రాహ్మణ సదనం భవనాన్ని ఈ నెల 31న సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. బ్రాహ్మణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని బ్రాహ్మణ సేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విష్ణుదాస్ గోపాల్‌రావు కోరారు. సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రభుత్వం తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఏర్పాటు చేసి బీద బ్రాహ్మణ కుటుంబాలకు ఆర్థిక సాయం, ఉపాధి కోసం రూ. 3 నుండి రూ.10 లక్షల వరకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా గౌరవ అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ , జిల్లా కార్యదర్శి, సంపత్ కుమార్, జిల్లా బ్రాహ్మణ సంఘం నాయకులు దీపాక్‌బాబు, రంరారావు నాగేంద్ర శర్మ, ప్రేమ్ చందర్, భాస్కరశర్మ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల కోసం తిప్పలు

- తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- మీ సేవా కేంద్రాలదే సర్టిఫికెట్ల జారీ బాధ్యత
- ఆన్‌లైన్‌కే పరిమితమైన నిర్వాహకులు



దుర్శేడ్ మీ సేవా కేంద్రంలో సర్టిఫికెట్ల ఆన్‌లైన్‌కు వచ్చిన తల్లిదండ్రులు, విద్యార్థులు

కరీంనగర్‌రూరల్: ప్రస్తుతం వివిధ విద్యాసంస్థల్లో ప్రవేశాల సందర్భంగా అవసరమైన రెవెన్యూ సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని మండలాల్లో సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ సజావుగా సాగుతుంటే మరికొన్ని మండలాల్లో పారదర్శకత లోపిస్తోంది. నిబంధనల పేరిట మీసేవా కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. కరీంనగర్ నియోజకవర్గంలో కరీంనగర్‌అర్బన్, కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల తహసీల్దార్ కార్యాలయాలున్నాయి. 2023–24 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థులు, ఉద్యోగ నియామక ప్రక్రియకు అవసరమైన సర్టిఫికెట్లకు నిరుద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వం జూన్‌లో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతామని ప్రకటించడంతో గొల్ల, కుర్మలు రెవెన్యూ సర్టిఫికెట్ల కోసం మీసేవా కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రతిరోజు ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఆర్‌ఐ సంతకం ముందే చేయించాలట..

విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ, నివాసం, ఓబీసీ తదితర సర్టిఫికెట్లను తహసీల్దార్ కార్యాలయం నుంచి జారీ చేస్తారు. ముందుగా మీ సేవా కేంద్రాలకు వెళ్లి అవసరమైన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే పలు కేంద్రాల నిర్వాహకులు ముందుగా దరఖాస్తు ఫారాలపై ఆర్‌ఐ సంతకం చేయించుకుని వస్తేనే ఆన్‌లైన్ చేస్తామంటున్నారు. సంబంధిత ఆర్‌ఐ కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు తహసీల్దార్ కార్యాలయాల వద్ద పడిగాపులు పడుతున్నారు. ఆర్‌ఐతో సంతకం చేయించుకుని మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్ చేసుకుని తహసీల్దార్ కార్యాలయాల్లో అప్పగిస్తున్నారు. అయితే వాస్తవానికి సర్టిఫికెట్ల కోసం ఎక్కడైనా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశముంది. సంబంధిత దరఖాస్తులపై ముందస్తుగా ఆర్‌ఐ సంతకం చేయాల్సిన అవసరం లేదు. దరఖాస్తులను ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం మీసేవా కేంద్రాల నిర్వాహకులే సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో అప్పగించాల్సిన బాధ్యత ఉంటుంది. అయితే పలువురు మీసేవా కేంద్రాల నిర్వాహకులు తమకు ఎందుకు ఈ గొళ్లెం అన్న చందంగా కేవలం ఆన్‌లైన్ చేసి దరఖాస్తులను తిరిగి ఇస్తున్నారు.

పాత సర్టిఫికెట్లు ఉంటేనే కొత్తవి జారీ

సర్టిఫికెట్ల జారీలో కొందరు తహసీల్దార్లు పాత సర్టిఫికెట్లను జత చేస్తేనే కొత్తవి ఇస్తున్నారు. కులం సర్టిఫికెట్ కావాలంటే పాతది జత చేయాలని లేకుంటే కుటుంబసభ్యులది ఎవరిదైనా తీసుకురమ్మంటున్నారు. అయితే నిబంధనల ప్రకారం ఎలాంటి పాత సర్టిఫికెట్లను జత చేయాల్సిన అవసరం లేదు. సమగ్ర విచారణ చేసి సర్టిఫికెట్లను జారీ చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.

రెండు మూడు రోజుల్లో జారీ

విద్య, ఉద్యోగ పరమైన సర్టిఫికెట్లను రెండు, మూడు రోజుల్లోనే జారీ చేస్తున్నాం. మీసేవా కేంద్రాల నుంచి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి ఆర్‌ఐ, తహసీల్దార్ లాగిన్లలో వెంటనే ఓకే చేయడం జరుగుతోంది. దరఖాస్తులకు సంబంధిత పాత ధ్రువీకరణ పత్రాలను జత చేస్తే మరింత వేగంగా సర్టిఫికెట్లను ఇచ్చేందుకు అవకాశముంది.

– డాక్టర్ కన్నం నారాయణ, తహసీల్దార్, కరీంనగర్‌రూరల్

వయో వృద్ధుల సమస్యలు పరిష్కరిస్తాం

- మేయర్ సునీల్‌రావు



వయోవృద్ధులతో మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌కార్పొరేషన్: వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు హామీ ఇచ్చారు. 33వ డివిజన్ భగత్‌నగర్ జెడ్పీ క్వార్టర్స్‌లో నూతనంగా ప్రారంభించిన వయో వృద్ధుల డే కేర్ సెంటర్‌ను సోమవారం సందర్శించారు. వయోవృద్ధులను కలిసి సెంటర్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డే కేర్ సెంటర్‌లో వయోవృద్ధులు కోరిన మేరకు వాటర్ ఫిల్టర్, రిఫ్రిజిరేటర్, దినపత్రికలతో పాటు వాచ్‌మెన్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. వయోవృద్ధులకు ఇంకా ఎలాంటి అవసరాలు ఉన్నా మంత్రి గంగుల కమలాకర్, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ వినోద్ కుమార్‌ల సహకారంతో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల డే కేర్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, ఉపాధ్యక్షుడు మోసం అంజయ్య, కోశాధికారి చింతల సత్యనారాయణ, జనార్దన్‌రావు, రాజచందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష రద్దు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు

కరీంనగర్: ఆశా కార్యకర్తలకి ప్రవేశ పరీక్ష రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ అబ్దుల్ కదర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మరెల్ల శ్రీలత మాట్లాడుతూ ఆశావర్కర్లు 18 ఏళ్ల నుంచి పని చేస్తున్నారని, ఇన్ని ఏళ్లుగా లేనిది ఇప్పుడు ఎగ్జామ్స్ పెట్టాలని, 50శాతం మార్కులు రాకపోతే ఆశగా పనికిరారని తీసేస్తామని ప్రభుత్వం బెదిరిస్తోందని అన్నారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం చేసిన పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 22న మెడికల్ ఆఫీసర్‌కి వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. జూన్ 5న ఆశా డే సందర్భంగా పీహెచ్‌సీల ఎదుట ధర్నాలు, 15న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆశలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రంగనవేనీ శారద, నాయకులు జిల్లా కోశాధికారి విజయలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు రాజమణి, సరిత పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై ఎల్లయ్యగౌడ్

కొత్తపల్లి: నకిలీ విత్తనాలు, గడువు ముగిసిన విత్తనాలు విక్రయించిన వ్యాపారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై బి.ఎల్లయ్య గౌడ్ అన్నారు. కొత్తపల్లి(హెచ్) రైతు వేదికలో సోమవారం మండల వ్యవసాయాధికారి రంజిత్ అధ్యక్షతన జరిగిన సీడ్ డీలర్ల సమావేశంలో మాట్లాడారు. విత్తన వ్యాపారులు చట్టానికి లోబడి వ్యాపారం చేసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించినా, గుర్తింపు లేని, గడువు లేని విత్తనాలు విక్రయించినా డీలర్లపై చర్యలు తప్పవన్నారు. మండల వ్యవసాయాధికారి రంజిత్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ లైసెన్స్ గల డీలర్ల వద్దనే రైతులు కొనుగోలు చేసి రశీదు పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రాము, రైతు కోఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కరీంనగర్: అనుమతి లేని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ అనుమతి లేకుండా అడ్మిషన్లు చేస్తూ పాఠశాలలు నడిపిస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈవిషయంపై మండల విద్యాధికారికి వినతిపత్రం ఇచ్చి ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి అనుమతి లేని పాఠశాలలను మూసివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షులు తిప్పరపు రోహిత్, సందేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు



ఆవిర్భావ వేడుకల్లో సంఘం నాయకులు

కరీంనగర్: తెలంగాణ ప్రొగ్రెసీవ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆవిర్భావ వేడుకలను సోమవారం కరీంనగర్‌లోని సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్‌రెడ్డి జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా శాఖ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పరితపించే సంఘం టీపీటీఎఫ్ మాత్రమే అన్నారు. సంఘం టీచర్స్ కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని జూన్ 12లోగా ఈ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బడి తెరిచే నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలను అందించాలని ఆదిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు మాడుగుల రాములు, చంద్రశేఖర్, రామచంద్రరెడ్డి, శశిధర్, బాలయ్య, రాజయ్య, రవీందర్, తిరుపతి, శ్రీనివాస్, ఇస్మాయిల్, తదిరులు పాల్గొన్నారు.


బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

కరీంనగర్‌స్పోర్ట్స్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆల్ ఇండియా రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ, సీపీఎం, డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్‌భూషణచరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నెల రోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయస్థాయిలో ఎన్నో పతకాలు సాధించిన వినేష్ ఫొగట్, సాక్షి మాలిక్ వంటి ఎంతో మంది క్రీడాకారులు ముందు వరుసలో నిలబడి మహిళా క్రీడాకారులుగా, అథ్లెట్లుగా తాము ఎదుర్కొంటున్న లైగింక వేధింపులను, అవమానాలను బహిరంగంగా వివరిస్తున్నా పట్టించుకున్న నాథుడు లేకపోవడం సిగ్గుచేటన్నారు. మహిళా రెజ్లర్ల అరెస్టును సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం, నగర కమిటీ సభ్యులు కొంపల్లి సాగర్, అరవింద్, రోహిత్, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, నరేశ్, భాస్కర్, రవీందర్, రఘుపతి, అజయ్, వంశీ, చరణ్, తదితరులు ఖండించారు.

మంత్రి పరామర్శ



నర్సయ్య కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: కరీంనగర్ అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్ తండ్రి కర్ర నర్సయ్య ఇటీవల మరణించగా సోమవారం వారి స్వగ్రామం శనిగరంలో రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ నర్సయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్, కోఆప్షన్ సభ్యులు అమ్జద్, తదితరులు ఉన్నారు.

చిత్ర కథ — పందుల బెడద



నగరంలో పందుల బెడద ఎక్కువైంది. సాక్షాత్తూ ప్రజల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు చూడాల్సిన బాధ్యత గల వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్దే ఇలా పందులు పదుల సంఖ్యలో కనిపిస్తుండటం గమనార్హం. పందుల తరలింపునకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని హడావుడి చేసే అధికారులు ఇప్పుడేం జవాబు చెబుతారో చూడాలి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

- జూన్ 2 నుంచి 22 వరకు ఉత్సవాలు
- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్‌కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో పాలకవర్గంతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ, ప్రగతిని ప్రజలకు చాటి చెప్పేలా తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా ఉత్సవాలు నిర్వహించాలని సూచించారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జూన్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నగరవ్యాప్తంగా ఉత్సవాలు జరపాలన్నారు. 2న పతాకావిష్కరణతో ప్రారంభమై 20 రోజుల పాటు వైభవంగా చేపట్టాలన్నారు. నగర అభివృద్ధికి తొలిసారిగా సీఎం హామీ పేరిట రూ.350 కోట్ల నిధులు వచ్చాయన్నారు. టెండర్లు పిలిచి జూన్ చివరి నాటికి రూ.132 కోట్ల అభివృద్ధి పనులు అన్ని డివిజన్లలో చేపట్టాలని తెలిపారు. విస్తరించిన రోడ్లు, చక్కటి డ్రెయినేజీలు, పాదాచారులకు ఫుట్‌పాత్‌లు, ఆహ్లాదంకోసం పార్కులు, ప్రజలకు ప్రతిరోజూ తాగునీరుతో పాటు ఎన్నో సౌకర్యాలు సమకూర్చడం జరిగిందన్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత కరీంనగర్ రెండో గొప్ప నగరంగా మారబోతుందని తెలిపారు. మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ పాలకవర్గానికి అండగా ఉంటూ వందల కోట్ల రూపాయలు తెచ్చి నగరాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ వినోద్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి హరిశంకర్, కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే దాడులు చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మచ్చ రమేశ్

కరీంనగర్: అధిక ఫీజులు వసూలు చేస్తున్న అనుమతి లేని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దాడులు చేస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ అన్నారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్ అధ్యక్షతన జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో విద్య పేద వారికి అందని ద్రాక్షగా మారిందని, ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను అంగడి సరుకుగా మార్చాయని అన్నారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్, ట్యూషన్, హాస్టల్, బుక్స్ ఫీజులంటూ లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు లేవని, తనిఖీల సమయంలో అధికారులు కళాశాలల వారు ఇచ్చే మామూళ్లకు లొంగి అనుమతులు ఇస్తున్నారని అన్నారు. దీంతో వారు ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ దోపిడీ చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, నునావత్ శ్రీనివాస్, వినయ్, సంపత్, నాంపల్లి ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

'పశుమిత్ర'లకు కనీస వేతనం నిర్ణయించాలి



ధర్నా చేస్తున్న పశుమిత్రలు

కరీంనగర్: పశుమిత్రలకు కనీస వేతనం నిర్ణయం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా పశువైద్య శాఖ కార్యాలయం ఎదుట సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పశుమిత్రలు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ పశుమిత్రల వెట్టిచాకిరి రద్దు చేసి, జీవో 60 ప్రకారం కనీస వేతనం రూ.15,600 ఇవ్వాలని, సెర్ప్ డిపార్ట్‌మెంట్ కార్మికులుగా గుర్తించాలని అన్నారు. మేడే స్ఫూర్తితో ఉద్యమం తీవ్రతరం చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2,500 మంది ఆడపడుచులు 8ఏళ్లుగా మూగజీవాలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారని, వీరికి 8ఏళ్లుగా ఒక రూపాయి ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటుందన్నారు. చాలామంది చదువుకున్న పేద మహిళలు. నైపుణ్యం గల వృత్తిని చేపట్టి ఒక రూపాయి వేతనం పొందకపోవడం దుర్మార్గమన్నారు. సెర్ప్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం నిర్ణయం చేయాలని, గుర్తింపు కార్డులు, యూనిఫామ్స్, గ్లోజులు, మెడికల్ కిడ్స్, ప్రయాణ ఖర్చులు, కృత్రిమ గర్భాధారణ శిక్షణ అందరికీ ఇవ్వాలని, ప్రతిఒక్కరికీ ఎలక్ట్రిక్ బైకులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో అందరికీ పనులు కల్పిస్తున్న సీఎం కేసీఆర్ పశుమిత్రులకి కనీస వేతనం నిర్ణయం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రాబోయే రోజుల్లో ఉద్యమం తీవ్రతరం చేస్తామని తెలిపారు. అనంతరం మేనేజర్ మహేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పశుమిత్ర వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు మారెళ్ల శ్రీలత, జిల్లా అధ్యక్షులు లలిత, నాయకులు భూమా అనూష, లక్ష్మి, రేణుక, లిఖిత, కల్పన, రమ, స్వప్న, పద్మ, పూజ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

బెల్లంపల్లి ఎమ్మెల్యేపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై ఆరిజిన్ డెయిరీ భాగస్వామి బోడపాటి శేజల్ సోమవారం జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే తనను లైంగికంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని, అతడి నుంచి ప్రాణహాని ఉందని పేర్కొన్నారు. చాలా రోజుల నుంచి వేధిస్తున్నారని, బ్లాక్ మెయిల్ చేస్తున్నారని రాష్ట్ర పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని పోలీసు కేసులు నమోదు కాకుండా చేస్తున్నారని, మరో మార్గం లేక మహిళా కమిషన్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు. కాగా, తనకు న్యాయం చేస్తామని, ఎంతటి వారైనా వదిలి పెట్టబోమని మహిళా కమిషన్ భరోసా ఇచ్చిందని ఆమె తెలిపారు. ఇకనైనా ఎమ్మెల్యే తన అనుచరులతో బ్లాక్‌మెయిల్ చేయించడం, బెదిరింపులకు పాల్పడడం మానుకుంటే ఆయనకే మంచిదని శేజల్ ఢిల్లీ నుంచి విడుదల చేసిన వీడియోలో పేర్కొన్నారు. శేజల్ స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసిన పత్రాన్ని, వీడియోను పోస్టు చేయడం వైరల్‌గా మారింది.

111 జీవో పరిరక్షణకు 1న నిరాహార దీక్ష

తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ

ముషీరాబాద్ (హైదరాబాద్): బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారాన్ని అడ్డంపెట్టుకుని రాష్ట్రాన్ని దోచుకుంటోందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆరోపించారు. 111 జీవో పరిరక్షణ కోసం జూన్ 1న నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 111 జీవో రద్దు, ప్రభుత్వ భూముల దుర్వినియోగం, ఓఆర్‌ఆర్‌లో రూ.40 వేల కోట్ల విలువైన టెండర్లు రూ.7,380 కోట్లకు అప్పగించడం వంటివి దోపిడీకి మచ్చుతునకలని అన్నారు. ఈ నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 111 జీవో రద్దు వల్ల భవిష్యత్తులో గండిపేట్ మంచి నీటిని పోగొట్టుకోవడమే కాకుండా వర్షాకాలాల్లో వరదలతో హైదరాబాద్ మునిగిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఓఆర్‌ఆర్ టెండర్లను కూడా రద్దు చేయాలని అన్నారు.

తెలంగాణ.. ప్రగతికి నమూనా!



తొమ్మిదేళ్ల ప్రగతి ప్రస్థానంపై నివేదికలో రాష్ట్ర ప్రభుత్వం

- అభివృద్ధి, సంక్షేమాల్లో దేశానికే ఆదర్శంగా తెలంగాణ
- సంక్షేమం కోసం తొమ్మిదేళ్లలోనే రూ.5 లక్షల కోట్ల వ్యయం
- 'రైతు బంధు' సాయం సామాజిక పెట్టుబడిగా నిలిచింది
- వరి దిగుబడి 2020–21లో 21.85 మిలియన్ టన్నులకు పెరిగింది
- సబ్బండ వర్గాల జీవితాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది
- నాడు, నేడు అని పోల్చేంతగా వివిధ రంగాల్లో పురోగతి కళ్లెదుట నిలిచిందని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రగతి ప్రస్థానం దేశానికే ఒక ప్రగతి నమూనాగా నిలిచిందని.. తెలంగాణ ఆచరిస్తుంటే, దేశం అనుసరిస్తోందని ముఖ్యమంత్రి కార్యాలయం పేర్కొంది. సీఎం కేసీఆర్ దార్శనిక పాలన, ప్రగతి సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజా జీవితాల్లో గుణాత్మక మార్పు వచ్చిందని.. అభివృద్ధి, సంక్షేమాల్లో దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని తెలిపింది. ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా రాజనీతిని కనబరుస్తూ పనిచేస్తే ఎలాంటి ఫలితాలు సాధించవచ్చో తెలిపేందుకు తెలంగాణ ప్రగతి ఒక కొలమానమని.. తెలంగాణలో సబ్బండ వర్గాల జీవితాల్లో వెల్లివిరుస్తున్న సుఖ సంతోషాలే అందుకు నిదర్శనమని స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్రం పదో ఏట అడుగిడుతున్న సందర్భంగా గత తొమ్మిదేళ్లలో రాష్ట్ర ప్రగతి ప్రస్థానంపై గణాంకాలతో కూడిన ఓ నివేదికను సీఎం కార్యాలయం సోమవారం రాత్రి విడుదల చేసింది. అందులో పేర్కొన్న అంశాలు, గణాంకాలు సంక్షిప్తంగా..

కోటి ఎకరాల మాగాణి..

నీటిపారుదల రంగ అద్భుత అభివృద్ధితో తెలంగాణ కోటి ఎకరాల మాగాణంగా అవతరించింది. కోటీ 25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యాన్ని త్వరలోనే చేరుకోనుంది. గోదావరి, కృష్ణా నదుల్లో రాష్ట్రానికి 1,266.94 టీఎంసీల నీటి కేటాయింపులతోపాటు అదనంగా 250 టీఎంసీల కృష్ణా జలాల కేటాయింపులు ట్రిబ్యునల్ పరిశీలనలో ఉన్నాయి. వాటి ఆధారంగా కోటీ 25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే రాష్ట్రంలో ఆయకట్టు 119 శాతం పెరిగింది. నిర్మాణంలోని ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడం, నాగార్జునసాగర్, నిజాంసాగర్, శ్రీరామ్ సాగర్ వంటి పాత ప్రాజెక్టులను దశలవారీగా ఆధునీకరించడం, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ, తూములు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి, సీతారామ వంటి ప్రాజెక్టులను చేపట్టడంతో ఇది సాధ్యమైంది.

- ఉమ్మడి రాష్ట్రంలో 2014కు ముందు తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులపై చేసిన వ్యయం రూ.38,405.12 కోట్లు అయితే.. తెలంగాణ వచ్చాక తొమ్మిదేళ్లలోనే రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చు ఏకంగా రూ.1,55,210.86 కోట్లు.
- ఇప్పటివరకు రాష్ట్రంలో 74.32 లక్షల ఎకరాలకు సాగునీటి సదుపాయం సమకూరింది. వచ్చే మూడేళ్లలో మరో 51.03 లక్షల ఎకరాలకు నీరు అందించే పనులు జరుగుతున్నాయి. 19 భారీ, 7 మధ్యతరహా కలిపి మొత్తం 26 ప్రాజెక్టులు వచ్చే రెండు, మూడేళ్లలో పూర్తి కానున్నాయి. 2016–17లో 47.78 లక్షల ఎకరాలున్న నీటి వినియోగ సామర్థ్యం (ఐపీయూ) 2021–22 నాటికి 97.57 లక్షల ఎకరాలకు పెరిగింది.
- రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగి రికార్డుస్థాయిలో ఆహార ధాన్యాల ఉత్పత్తి జరుగుతోంది. వరి దిగుబడి 2016–17లో 9.89 మిలియన్ టన్నులుకాగా.. 2020–21 నాటికి 21.85 మిలియన్ టన్నులకు పెరిగింది. 2016–17లో 1.99 లక్షల టన్నులుగా ఉన్న చేపల ఉత్పత్తి.. 2020–21 నాటికి 3.3 లక్షల టన్నులకు పెరిగింది. నీటి పారుదల శాఖ పరోక్షంగా ఆక్వా కల్చర్‌లో కీలక పాత్ర పోషించింది.

సంక్షేమంలో స్వర్ణయుగం

తెలంగాణ ఏర్పడ్డాక సబ్బండ వర్గాలకు, పేదలకు కనీస జీవన భద్రత కల్పించాలని సీఎం కేసీఆర్ సంకల్పించారు. ఆయన దార్శనికతతో దేశంలో మరే రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.50వేల కోట్లకుపైగా నిధులతో పలు రకాల ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. పదేళ్లకు చేరుకున్న స్వరాష్ట్ర పాలనా కాలంలో దాదాపు రూ.5 లక్షల కోట్లను పలు రకాల సంక్షేమ పథకాల కోసం ఖర్చుచేయడం ద్వారా తెలంగాణ దేశ సంక్షేమ రంగ చరిత్రలోనే అగ్రభాగాన నిలిచింది. ప్రభుత్వం రైతులకు అందించిన పంట పెట్టుబడి వంటి వ్యక్తిగత ఆర్థిక సాయం సామాజిక పెట్టుబడిగా మారింది. రూపాయి ప్రజల్లో తిరగడం ద్వారా స్పిన్ ఆఫ్ ఎకానమీకి దారి తీసింది. ప్రజల కొనుగోలు శక్తి పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలిచింది.

అభాగ్యుల ఆవేదనను తీర్చేలా 'ఆసరా'

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా అందిస్తున్న మానవీయ ప్రభుత్వంగా దేశ ప్రజల మన్ననలు అందుకుంటోంది. వయసు మీదపడిన వృద్ధులకు, శారీరక వైకల్యాలతో బాధపడే అభాగ్యులు వేదనతో కృశించిపోవడం సరికాదని.. అలాంటి వారికి 'ఆసరా'తో అండగా నిలవడం సామాజిక బాధ్యత అని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో నిరుపేద కుటుంబాల్లోని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, బోదకాలు బాధితులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బీడీ కార్మికులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, వృద్ధ కళాకారులు, డయాలసిస్ పేషెంట్లతోపాటు ఆసరాకు అర్హులైన వారందరికీ పింఛన్లతో భరోసా అందిస్తోంది.

- 2004 నుంచి 2014 వరకు పదేళ్లలో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు పింఛన్ల కోసం తెలంగాణకు కేవలం రూ.5,558 కోట్లు కేటాయించాయి. అదే తెలంగాణ ఏర్పాటయ్యాక కేసీఆర్ ప్రభుత్వం 2014 నుంచి 2023 మే మధ్య తొమ్మిదేళ్లలోనే పింఛన్ల కోసం ఏకంగా రూ.58,696 కోట్లు ఖర్చు చేసింది.
- ఇక 2014 వరకు తెలంగాణలో పింఛన్లు పొందే లబ్ధిదారుల సంఖ్య 29,21,828 మాత్రమే. ఏటా చేసిన ఖర్చు సగటున రూ.861 కోట్లు మాత్రమే. అదే తెలంగాణ వచ్చాక అర్హులందరికీ పింఛన్లు ఇవ్వడంతో.. అర్హుల సంఖ్య 44,82,254 మందికి పెరిగింది. వీరి కోసం సర్కారు ఏటా సగటున 11,628 కోట్లు ఖర్చు చేస్తోంది.

కల్యాణలక్ష్మితో తగ్గిన బాల్య వివాహాలు

ఆడపిల్ల పుడితే ఇంటికి లక్ష్మీ దేవత వచ్చినట్టేననే సకారాత్మక భావనను పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆడపిల్ల పెళ్లి ఖర్చుల అవస్థ నుంచి గట్టెక్కించడానికి ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాలకు కల్యాణలక్ష్మి పథకాన్ని, మైనారిటీలకు షాదీ ముబారక్ పథకాన్ని అమలు చేస్తూ.. రూ. 1,00,116 ఆర్థిక సాయం అందిస్తోంది. దివ్యాంగులకు ఈ పథకం కింద రూ.1,25,145 చెల్లిస్తోంది. 2014 నుంచి 2023 మే మధ్య 12,71,839 నిరుపేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి పథకం కింద రూ.11,130 కోట్లు అందజేసింది. ప్రభుత్వ నిబంధన ప్రకారం 18 ఏళ్లు నిండితేనే అమ్మాయిలకు వివాహం చేయాలి. దీనితో రాష్ట్రంలో బాల్య వివాహాలు చాలావరకు తగ్గిపోయాయి.

అన్ని వర్గాలకూ 'సంక్షేమ' ప్రయోజనం

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ముస్లిం మైనారిటీలు, క్రైస్తవుల సంక్షేమంతోపాటు అగ్రవర్ణాల సంక్షేమం గురించి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ వర్గాలకు సంబంధించి విద్యా రంగంతోపాటు వివిధ వృత్తుల వారికి చేయూత, ఆసరా కల్పిస్తూ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోంది.
- రాష్ట్ర ప్రభుత్వం మహిళాశిశు సంక్షేమానికి సంబంధించి దేశంలోనే విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టింది. వీటితో మాతాశిశు మరణాల రేటు గణనీయంగా తగ్గటంతోపాటు ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు గణనీయంగా పెరిగాయి.
- పౌర సరఫరాలు, దేవాదాయ శాఖ, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, రైతు సంక్షేమం, పశుసంవర్థక శాఖ, హార్టికల్చర్, సాగునీటి రంగం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), శాంతి భద్రతలు, మిషన్ భగీరథ, విద్యా రంగం, రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, విద్యుత్ రంగం, రహదారులు, భవనాలు, ఆర్టీసీ– ఆర్టీసీ కార్మికుల సంక్షేమం వంటివి పరిశీలిస్తే స్పష్టమైన మార్పులు గోచరిస్తాయి.
- వీటితోపాటు ప్రభుత్వ ఉద్యోగులు, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమం, న్యాయ సేవల విస్తృతి – న్యాయవాదుల సంక్షేమం వంటి వాటిపైనా ప్రభుత్వం దృష్టిపెట్టింది.
- పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో సమ్మిళిత అభివృద్ధి, అధునాతన సౌకర్యాలు అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో వివిధ కార్యక్రమాలను అమలుచేస్తోంది. దీనికి తగ్గట్టుగా రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు అనేక జాతీయ అవార్డులను సాధించాయి.

సమాచార కమిషనర్లను నియమించండి: ఎఫ్‌జీజీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సమాచార కమిషనర్లను తక్షణమే నియమించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారికి ఎఫ్‌జీజీ కార్యదర్శి పద్మనాభరెడ్డి సోమవారం లేఖ రాశారు. ఐదుగురు సమాచార కమిషనర్ల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరితో ముగిసిందని, ఆ తర్వాత కమిషనర్లను నియమించలేదని, దీంతో రాష్ట్ర సమాచార కమిషన్ మూతపడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కమిషన్‌లో ఫిబ్రవరి నాటికి 9,244 అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయని, వీటికి తోడు ప్రతినెలా 650కిపైగా అప్పీళ్లు కమిషన్‌కు చేరుతున్నాయని వివరించారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, ముఖ్యమైన జీవోలను కూడా వెబ్‌సైట్‌లో పెట్టడంలేదని విమర్శించారు. న్యాయశాస్త్రం, శాస్త్ర సాంకేతిక రంగం, పాలన, పత్రికారంగంలో అనుభవం ఉన్నవారినే కమిషనర్లుగా నియమించాలని సూచించారు.

దశాబ్ది ఉత్సవాలకు పోలీసు శాఖ సన్నద్ధం

సాక్షి, హైదరాబాద్: జూన్ 2 నుంచి 22 వరకు నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు పోలీస్ శాఖ సన్నద్ధమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఈ సంబురాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఉత్సవాలు సజావుగా జరిగేలా తగిన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రతి జిల్లాలో ఆయా జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రముఖ ప్రజానాయకుల కార్యక్రమాల నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రత ఏర్పాట్లు సమీక్షించుకోవాలని అధికారులు ఇప్పటికే సూచనలిచ్చారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత శాంతిభద్రతల పరంగా తీసుకువచ్చిన మార్పులను, ఫ్రెండ్లీ పోలీస్ విధానం.. తదితర అంశాలను వివరించేలా పోలీసు శాఖ ఆధ్వర్యంలోనూ సురక్షా దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

జీ-20 హెల్త్ వర్కింగ్ గ్రూప్ సమావేశానికి విస్తృత భద్రత

సాక్షి, హైదరాబాద్: జూన్ 4, 5, 6 తేదీల్లో నగరంలో జరగనున్న జీ–20 హెల్త్ వర్కింగ్ గ్రూప్ సమావేశానికి పోలీసులు విస్తృత బందోబస్తు కల్పించనున్నారు. డీజీపీ కార్యాలయంలో స్టేట్ సెక్యూరిటీ కోఆర్డినేషన్ సమావేశం సోమవారం జరిగింది. అడిషనల్ డీజీ అభిలాష బిస్త్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ డీజీ అభిలాష బిస్త్ మాట్లాడుతూ, హెచ్ఐసీసీ నోవాటెల్‌లో నిర్వహించనున్న ఈ సమావేశానికి హాజరయ్యే ప్రతినిధులకు పటిష్టమైన భద్రత కల్పించాలన్నారు. భద్రతను పర్యవేక్షించేందుకు హెచ్ఐసీసీలో మల్టీ ఏజెన్సీ కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్



ప్రగతిపథంలో నాలుగేళ్లు..



ఆరోగ్యానికి బలం!

- నాలుగేళ్లలో వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలు
- రూ.16 వేల కోట్లతో జవసత్వాలు కల్పించిన సీఎం జగన్
- ప్రభుత్వాస్పత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది
- 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుతో చరిత్ర
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరాతో పేదలకు కొండంత అండ
- ఏకంగా 3,255 ప్రొసీజర్‌లకు ఉచిత వైద్యం
- రెండు పథకాల కోసమే రూ.8,302 కోట్లు వ్యయం
- ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణుల ముంగిటకు వైద్య సేవలు

వస్తున్నారు టాపర్లు

మారిన సర్కారు బడి.. మురిసిన చదువుల తల్లి



- విద్యా సంస్కరణల కోసం రూ.59,173.72 కోట్ల వ్యయం
- మనబడి నాడు–నేడుతో మారుతున్న ప్రభుత్వ స్కూళ్ల రూపు రేఖలు
- 292 ఉన్నత పాఠశాలలు హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్
- 352 కేజీబీవీల్లో +2 బోధన అమలు
- 679 మండలాల్లో బాలికల కోసం ఒక జూనియర్ కళాశాల
- 3 నుంచి 10 తరగతుల విద్యార్థులకు సబ్జెక్ట్ ఉపాధ్యాయులతో బోధన
- ప్రతి తరగతి గదికి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, స్మార్ట్ టీవీలు
- జగనన్న విదేశీ విద్యా దీవెన కింద 1,858 మందికి మేలు

అట్టడుగు వర్గాల ముందడుగు

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సింహ భాగం పదవులు

- సామాజిక న్యాయ సాధనలో సీఎం జగన్ దేశానికే టార్చ్‌బేరర్
- నాలుగేళ్లుగా సామాజిక సాధికారత దిశగా చిత్తశుద్ధితో అడుగులు
- నామినేటెడ్ నుంచి కేబినెట్ దాకా సగానికిపైగా వారికే పదవులు
- సంక్షేమ పథకాల ద్వారా ఆ వర్గాల్లో పేదరిక నిర్మూలనకు చర్యలు

ఇచ్చిన మాటే లక్ష్యంగా

సుపరిపాలన



నాలుగేళ్లలో ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన హామీల్లో 98.5 శాతం అమలు

కులం, మతం, ప్రాంతం, వర్గం చూడకుండా సంక్షేమాభివృద్ధి పథకాలు

- పేదరికం నుంచి కుటుంబాలను పైకి తీసుకురావడమే లక్ష్యం
- ప్రతి కుటుంబం భవిష్యత్తు బాగుండాలనే ధ్యేయంతో పాలన
- కోవిడ్ సంక్షోభం, ఆర్థిక కష్టాలను అధిగమించి మరీ పథకాల అమలు
- నాలుగేళ్లలో అన్ని వర్గాలకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా 10.46 కోట్ల ప్రయోజనాలు.. ఇందుకోసం ఏకంగా రూ.3.02 లక్షల కోట్లు వ్యయం
- ఇళ్ల స్థలాల లబ్ధిదారుల్లో అత్యధికంగా 16.70 లక్షల మంది బీసీలే

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకిచ్చిన మాట నెరవేర్చడమే లక్ష్యంగా నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోంది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన హామీల్లో 98.5 శాతం నెరవేర్చడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారు. కులం, మతం, ప్రాంతం, వర్గంతో పాటు చివరికి ఎవరికి ఓటు వేశారన్నది కూడా చూడకుండా సుపరిపాలన అందించారు. చెప్పిన మాట మేరకు సంక్షేమాభివృద్ధి పథకాల అమలు కొనసాగిస్తున్నారు. పేదరికం నుంచి కుటుంబాలను పైకి తీసుకురావడమే లక్ష్యంగా మేనిఫెస్టోలో చెప్పని పథకాలను సైతం అమలు చేశారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం నిన్నటి కంటే నేడు.. నేటి కంటే రేపు.. రేపటి కంటే భవిష్యత్తు బాగుండాలనే లక్ష్యంగా నాలుగేళ్ల పాలన కొనసాగించారు. కోవిడ్ సంక్షోభం, ఆర్థిక కష్టాలను అధిగమించి మరీ పథకాలు అమలు చేసి విశ్వసనీయతకు మారు పేరుగా పాలన సాగుతోంది. గత ప్రభుత్వాలకు భిన్నంగా, మేనిఫెస్టో అంటే పవిత్ర గ్రంథాలైన భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా అమలు చేసి చూపించారు. అందుకే ధైర్యంగా 'గడప గడపకు మన ప్రభుత్వం' ద్వారా ఎన్నికలు రాకముందే ఎమ్మెల్యేలను ప్రతి ఇంటికి పంపించే కార్యక్రమం చేపట్టారు. నాలుగేళ్ల పాలనతో ఇంటింటికి, మనిషి మనిషికి ఏం మేలు జరిగిందనే విషయాన్ని ఎమ్మెల్యేలు స్వయంగా వివరించడమే కాకుండా.. ప్రింట్ చేసిన పుస్తకాలను వారికి ఇచ్చి, ఆ మేలు జరిగిందా లేదా అని ధైర్యంగా అడిగి ప్రజల మద్దతు పొందుతున్నారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చినందునే ఎమ్మెల్యేలు ధైర్యంగా ప్రజల దగ్గరకు వెళ్లగలుగుతున్నారు. మరో పక్క వ్యవసాయ, విద్య, వైద్య రంగాల్లో పరిపాలనలో సంస్కరణల ద్వారా విప్లవాత్మక మార్పులు తెచ్చారు. గ్రామ, వార్డు స్థాయికి పరిపాలనను, పథకాలను, పౌర సేవలను పారదర్శకంగా తీసుకెళ్లారు. తద్వారా గ్రామాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది.

రూ.3.02 లక్షల కోట్లు సాయం

గత నాలుగేళ్లలో అన్ని వర్గాలకు నవరత్నాల కింద డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా 10.46 కోట్ల ప్రయోజనాల కోసం ఏకంగా రూ.3.02 లక్షల కోట్లు వ్యయం చేశారు. ఇందులో డీబీటీ ద్వారా 7.90 కోట్ల ప్రయోజనాలకు రూ.2.11 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారు. నాన్ డీబీటీ ద్వారా 2.57 కోట్ల ప్రయోజనాల కింద రూ.91 వేల కోట్లు వ్యయం చేశారు. సంక్షేమంలో బీసీలకు సామాజిక న్యాయం జరిగింది. వెనుకబడిన వర్గాల వారు ఇన్నాళ్లు వెనుకబడిపోయే ఉన్నారు. జనాభాలో అత్యధికులుగా ఉన్నప్పటికీ గత ప్రభుత్వాల్లో వారికి ఏ రంగంలో కూడా తగిన వాటా లభించలేదు. ఆఖరుకు దారిద్ర్య రేఖకు దిగువనున్న బీసీలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు కూడా గత ప్రభుత్వంలో నోచుకోలేదు. బీసీలంటే బ్యాక్ వర్డ్ క్యాస్ట్ కాదు.. దేశానికే బ్యాక్ బోన్ అంటూ పాదయాత్రతో పాటు ఎన్నికల ముందు నిర్వహించిన బీసీ సదస్సులో కొత్త నిర్వచనం చెప్పిన అప్పటి ప్రతిపక్ష నేత.. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తన నాలుగేళ్ల పాలనలో అన్ని రంగాల్లో వారికి తగిన వాటా ఇచ్చారు. ఇళ్ల స్థలాల లబ్ధిదారుల్లో అత్యధికంగా 16.70 లక్షల మంది బీసీలే కావడం గమనార్హం.

ఆయా వర్గాలకు లబ్ధి ఇలా

- నాలుగేళ్లలో నవరత్నాలు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా బీసీలకు రూ.1,48,597 కోట్లు వ్యయం చేశారు. ఇందులో డీబీటీ ద్వారా రూ.99,681 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.48,916 కోట్లు వ్యయం చేశారు.
- నవరత్నాలు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ఎస్సీలకు రూ.53,929 కోట్లు వ్యయం చేశారు. ఇందు లో డీబీటీ ద్వారా రూ.34,963 కోట్లు, నాన్ డీబీ టీ ద్వారా రూ.18,966 కోట్లు వ్యయం చేశారు.
- నవరత్నాలు డీబీటీ నాన్ డీబీటీ ద్వారా ఎస్టీలకు రూ.15,114 కోట్లు వ్యయం చేశారు. ఇందులో డీబీటీ ద్వారా రూ.10,395 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.4,719 కోట్లు ఖర్చు చేశారు.
- నవరత్నాలు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా మైనారిటీలకు రూ.18,960 కోట్లు వ్యయం చేశారు. ఇందులో డీబీటీ ద్వారా రూ.11,948 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.7,012 కోట్లు వ్యయం చేశారు.
- నవరత్నాలు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా కాపులకు రూ.26,634 కోట్లు వ్యయం చేశారు. ఇందులో డీబీటీ ద్వారా రూ.20,550 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.6,084 కోట్లు ఖర్చు చేశారు.
- నవరత్నాలు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ఇతరులకు రూ.38,871 కోట్లు వ్యయం చేశారు. ఇందులో డీబీటీ ద్వారా రూ.33,531 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.5340 కోట్లు వ్యయం చేశారు.

లక్షన్నర కోట్ల ఎగుమతులు

నాలుగేళ్లలో రూ.55 వేల కోట్లు పెరుగుదల

సుజలాం.. సుఫలాం.. సస్యశ్యామలం

రాష్ట్రాన్ని సుభిక్షంగా మార్చిన సీఎం వైఎస్ జగన్



మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మహిళలకు జగన్ 'ఆసరా'

2019 ఎన్నికల నాటికి పొదుపు సంఘాల పేరిట ఉన్న అప్పు మొత్తం ప్రభుత్వమే నేరుగా మహిళలకు అందజేత



- చంద్రబాబు మోసంతో పొదుపు సంఘాల వ్యవస్థ కుదేలు
- ఎన్నికల ముందు హామీఇచ్చి ఆ తర్వాత పైసా కూడా మాఫీ చేయని బాబు
- ఫలితంగా వడ్డీ, చక్రవడ్డీలతో పేద మహిళలు అప్పులపాలు
- రోజువారీ పొదుపు కార్యక్రమాలకూ దూరం
- సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక 'వైఎస్సార్ ఆసరా'తో భరోసా
- వైఎస్సార్ సున్నా వడ్డీ పథకానికీ మళ్లీ జీవం



గంగపుత్రులకు బాసటగా..

ఐదేళ్లుగా సకాలంలో వేట నిషేధ భృతి

- సబ్సిడీ ఆయిల్ పెంపుతో పెరిగిన బోట్లు
- ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు
- విద్యుత్ సబ్సిడీతో ఆక్వా రైతులకు మేలు
- భారీగా పెరిగిన దిగుబడులు, ఎగుమతులు
- రొయ్య రైతులకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం

రైతుకు అసలైన భరోసా



వ్యవసాయదారులకు చేదోడుగా నిలుస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం

ఆతిథ్య ఆంధ్ర

ఏపీ బ్రాండ్ ఇమేజ్‌తో అంతర్జాతీయ స్థాయి హోటళ్ల రాక

- ఆతిథ్య రంగంలో రూ.8 వేల నుంచి రూ.10 వేల కోట్ల పెట్టుబడులు

తొలి మహిళ



● నిషా సోలంకి

పంటకు రక్షకురాలు



● డ్రోన్‌తో పర్యవేక్షణ

హర్యాణాలో రైతులు ఇప్పుడు ప్రమాదకరమైన పురుగు మందుల పిచికారి నుంచి రక్షణ పొందుతున్నారు. దానికి కారణం నిషా సోలంకి. హర్యాణాలో తొలి మహిళా అగ్రో డ్రోన్ పైలెట్ అయిన సోలంకి డ్రోన్ ద్వారా వేల ఎకరాల్లో సురక్షితంగా పురుగు మందులు చల్లడంలో రైతులకు సహాయం చేస్తోంది. 'ఆమె రాకతో మా శ్రమ చాలా తగ్గింది' అంటున్నారు రైతులు.

కొన్ని గెలుపు గాథలు విశేషంగా అనిపిస్తాయి. హర్యాణాలో ఒకప్పుడు భ్రూణ హత్యలు ఎక్కువగా జరిగేవి. ఆడపిల్ల పుడితే గుట్టు చప్పుడు కాకుండా మట్టుబెట్టే విధానం ఉండేది. అప్పటి ఆ అఘాయిత్యాల వల్ల ఇప్పుడు యువకులకు వధువులు దొరకడం ఆ రాష్ట్రంలో కష్టంగా మారింది. పితృస్వామ్యాన్ని అధికంగా పాటించే అలాంటి చోట్ల ఒక అమ్మాయి సాంకేతిక రంగంలో రాణిస్తూ సేద్య రంగానికి సేవలు అందించడం విశేషం కాకుండా ఏమవుతుంది?

తొలి డ్రోన్ పైలెట్

30 ఏళ్ల నిషా సోలంకి తల మీదున్న క్యాప్‌పై 'పైలెట్' అని రాసి ఉంటుంది. అలా 'పైలెట్' అని పించుకోవడం నిషాకు ఇష్టం. హర్యాణాలోని జజ్జర్‌కు చెందిన నిషా నాలుగో క్లాసు చదువుతున్నప్పుడు మొదటిసారి విమానం ఎక్కి కుటుంబంతో శ్రీనగర్ చూడ్డానికి వెళ్లింది. 'అప్పుడు అనుకున్నాను పైలెట్ కావాలని' అంటుంది నిషా. పెద్దయ్యి ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చదవాలని అనుకుంది కాని కుదరలేదు. కర్నాల్‌లోని మహారాణా ప్రతాప్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఫార్మ్ మెషినరీ, పవర్ ఇంజనీరింగ్ కోర్సు చదువుతున్నప్పుడు మొదటిసారి డ్రోన్ ఉపయోగించి చెరకు పంటపై క్రిమి సంహారక మందులు చల్లడం గమనించింది. అగ్రి డ్రోన్ కూడా ఫార్మ్ మెషినరీ విభాగం కిందకే వస్తుంది కనుక నిషా అగ్రి డ్రోన్ ఎగరేయడం గురించి తెలుసుకుంది. ఇంకా మెరుగైన అవగాహన కోసం డి.జి.సి.ఎ. (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) నుంచి 'రిమోట్ పైలెట్ సర్టిఫికెట్ కోర్సు' చేసింది. దాంతో హర్యాణాలోనే మొదటి మహిళా అగ్రి డ్రోన్ పైలెట్‌గా గుర్తింపు వచ్చింది. అందుకే ఆమె క్యాప్ మీద పైలెట్ అని ఉంటుంది.

స్త్రీలు తక్కువ కాదు

'భూమి మగవారి పేరున ఉంటుంది కనుక రైతులంటే పురుషులే అన్న భావన ఏర్పడింది. కాని స్త్రీలు చేసే కష్టం చిన్నది కాదు. స్త్రీలు అన్ని రకాల వ్యవసాయ పనులు చేయగలరు. వారికి ఈ రంగంలో సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలి. మా ఊరి వాళ్లకు నేను చేస్తున్న పని ఏమిటో అర్థం కావడానికి చాలా కాలం పట్టింది. ఇప్పుడు వారంతా నన్ను చూసి గర్వపడుతున్నారు. అమ్మాయిలు ఇలా ముందుకు రావడం చాలా బాగుందంటున్నారు' అంది నిషా.

తన భవిష్యత్తునే కాక రైతు భవిష్యత్తును కూడా పచ్చగా చేయగలిగిన ఇటువంటి యువతులే నవ భారత నిర్మాతలు.

డ్రోన్‌తో అన్నీ ఉపయోగాలే

నిషా ఎగరేసే అగ్రి డ్రోన్ 25 కిలోల బరువు ఉంటుంది. ఇది 10 లీటర్ల పురుగు మందును ఏకకాలంలో స్ప్రే చేస్తుంది. 'నేను మొదటిసారి కురుక్షేత్రకు సమీపంలోని రైతులకు డ్రోన్ ద్వారా పురుగుమందు చల్లొచ్చని చూపడానికి వెళ్లాను. అక్కడున్న కొందరు కుర్రాళ్లు నన్ను ఆటపట్టించారు– ఈ అమ్మాయి ఈ మిషన్‌తో ఏం చేయగలదు అని. దీని బదులు సంప్రదాయక పద్ధతితో చేతి ద్వారా ఎరువు చల్లడం మేలని కామెంట్ చేశారు. కాని నేను డ్రోన్ ఎగరేసి పురుగు మందు చల్లాక వారు ఆశ్చర్యపోయి సారీ చెప్పారు. చాలా మెచ్చుకున్నారు' అంటుంది నిషా. 'డ్రోన్ ద్వారా పురుగు మందులు చల్లితే రైతులకు ఆరోగ్య రక్షణ ఉంటుంది. పురుగు మందుల చల్లడం వల్ల వచ్చే 50 శాతం జబ్బులు రావు. అదీగాక 200 లీటర్ల నీళ్లు కలిపి చల్లే పురుగు మందులను డ్రోన్ ద్వారా 10 లీటర్ల నీళ్లతో చల్లొచ్చు. నీరు మిగులుతాయి. డ్రోన్‌తో సమంగా స్ప్రే అయ్యి ఫలితం బాగుంటుంది. సమయం మిగులుతుంది. పని గంటలు తగ్గుతాయి. కూలీలు అక్కర్లేదు. ఎక్కువ ఎకరాలు ఉన్న రైతులు తప్పక డ్రోన్‌ను వాడాలి' అంటుంది నిషా.

బ్యూటిప్

గోరంత అందం


గోళ్లు విరగడం, పొడిబారి నిస్తేజంగా కనిపిస్తే ఆరోగ్యం పట్ల తప్పక శ్రద్ధ చూపించాలి. దాంతోపాటు ఈ జాగ్రత్తలూ తీసుకోవాలి. ● చేతులను సబ్బు లేదా లిక్విడ్‌తో శుభ్రపరుచుకున్నాక గోళ్లు పొడిబారినట్టుగా అనిపిస్తే తప్పక లోషన్‌తో మసాజ్ చేసుకోవాలి. దీంతో గోళ్ల చుట్టూ చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ● గోళ్లను స్నానానంతరం కట్ చేయడం మేలు. నీళ్లలో నానిన గోళ్లు గరుకుదనం తగ్గి, ట్రిమ్ చేయడం సులువు అవుతుంది. ● వెచ్చని నీళ్లలో కొద్దిగా ఉప్పు, అర టీ స్పూన్ నిమ్మరసం కలిపి గోళ్లు మునిగేలా చేతులను ఉంచాలి. పది నిమిషాల తర్వాత గోళ్ల చుట్టూ ఉన్న మురికిని తొలగించాలి. తర్వాత మంచినీళ్లతో కడిగి, తడి లేకుండా తుడిచి మాయిశ్చరైజర్ రాసుకోవాలి. నెయిల్ పాలిష్‌లో బేస్ కోట్ వేసుకుంటే గోళ్ల త్వరగా పాడవవు. అందంగానూ ఉంటాయి.



విజయ పథం



● మీనాక్షి సుందరేశ్వర్‌లో...



● ఖాకీ: ది బిహార్ చాప్టర్‌లో...



● మోనిక షేర్‌గిల్

క్వీన్ ఆఫ్ కంటెంట్


స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లో సక్సెస్ అంటే సాధారణ విషయం కాదు. ఏ నిమిషానికి ఏ ట్రెండ్ వస్తుందో తెలియదు. అక్కడి ట్రెండ్ ఇక్కడ వర్కవుట్ అవుతుందో లేదో తెలియదు. సక్సెస్‌కు సవాలక్ష కారణాలు ఉంటాయి. అయితే అవేమీ చీకట్లో దాక్కున్నవి కావు. వెదుక్కుంటూ వెళితే ముందుకు వచ్చి పలకరిస్తాయి. మోనిక చేసిన పని అలా వెదుక్కుంటూ వెళ్లడమే! ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్‌గా ప్రయాణం మొదలుపెట్టిన మోనిక షేర్‌గిల్ 'వైస్ ప్రెసిడెంట్, కంటెంట్, నెట్‌ఫ్లిక్స్ ఇండియా' స్థాయికి చేరుకోవడం అదృష్టం కాదు...తాను పడిన కష్టం. ఆ కష్టమే మోనిక షేర్‌గిల్‌ను 'హై అండ్ మైటీ–50 పవర్‌పీపుల్' జాబితాలో చేర్చింది....

నెట్‌ఫ్లిక్స్ ఇండియా స్పీడ్ అందుకొని వ్యూ అవర్స్, రెవెన్యూ పెంచుకొని ప్రపంచస్థాయిలో సక్సెస్ సాధించింది. 'దీనికి కారణం?' అనే ప్రశ్నకు ఏకైక జవాబు నలభై తొమ్మిది సంవత్సరాల మోనిక షేర్‌గిల్.

మోనిక చొరవ వల్ల ఎంతో మంది ప్రతిభావంతులు వెలుగులోకి వచ్చారు. ప్రపంచానికి, ప్రతిభావంతులకు మధ్య 'నెట్‌ఫ్లిక్స్'ను వారధిగా మలచడంలో మోనిక ఘన విజయం సాధించింది.

నెట్‌ఫ్లిక్స్ కోసం కంటెంట్‌ను ఎంపిక చేసుకోవడంలో మోనిక అనుసరించే ప్రమాణాల విషయానికి వస్తే...క్రైమ్ షోలలోని సంచలన ధోరణి కనిపించదు. సబ్జెక్ట్‌లో ఉండే బలమే ప్రధాన ప్రమాణం అవుతుంది. దీనికి ఉదాహరణ ఆస్కార్ పురస్కారం గెలుచుకున్న డాక్యుమెంటరీ ఫిల్మ్... ది ఎలిఫెంట్ విష్పరర్స్.

''ఎంటర్‌టైన్‌మెంట్ బిజినెస్‌లో ఎప్పుడూ రిస్క్ పొంచి ఉంటుంది. ప్రేక్షకుల అభిరుచిని కచ్చితంగా పసిగట్టడం కష్టమే. కరోనా కల్లోల సమయం ప్రేక్షకుల ఆలోచనధోరణిలో మార్పు తీసుకువచ్చింది. కంటెంట్ విషయంలో తమ భాష, ప్రాంతానికి మాత్రమే పరిమితం కావడం లేదు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న కంటెంట్‌పై ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. 'ఏది నిజం? ఏది కల్పన?' అనే విషయంలో వారికి స్పష్టత ఉంది. వ్యాపార విజయం అనేది వారికి సంబంధం లేని విషయం. వారి దృష్టి మొత్తం కథ పైనే ఉంటుంది'' అంటున్న మోనిక విజయాల గురించి ఆనందించడమే కాదు నిరాశపరిచిన కంటెంట్ విషయంలో సమీక్ష చేసుకోవడంలో ముందుంటుంది.



రొమాంటిక్ హిందీ–కామెడీ ఫిల్మ్ 'మీనాక్షి సుందరేశ్వర్' నిరాశపరిచింది. దీనికి కారణం సరియైన నటీనటులను ఎంపిక చేసుకోకపోవడం. కథ సరిగ్గా ఉండగానే సరిపోదు కాస్టింగ్ కూడా సరిగ్గా ఉండాలని, ఎక్కడా రాజీపడకూదనే గుణపాఠాన్ని ఆ చిత్రం నుంచి నేర్చుకుంది మోనిక.

పోస్ట్–పాండమిక్ ఆడియెన్స్ ఇంటర్నేషనల్ స్టోరీలను ఇష్టపడుతున్నారు. జర్మన్ షో 'డార్క్' మనదేశంలో హిట్ కావడం దీనికి నిదర్శనం. ఆ సమయంలో...

'వేరే దేశం కథలు మన దగ్గర విజయం సాధించినప్పుడు, మన దేశంలోని ఒక ప్రాంతానికి చెందిన కథలు మరొక ప్రాంతంలో ఎందుకు విజయం సాధించవు' అంటూ ఆలోచన చేసింది మోనిక. తాను నమ్మింది 'కాంతార' హిందీ వెర్షన్ విజయంతో నిజం అయింది.

సక్సెస్ ముఖ్యమే కాని వేలం వెర్రి జోలికి వెళ్లదు మోనిక. 'కొరియన్ భాషలో గ్లోబల్ బ్రేక్ఔట్ షోలు ఉన్నాయి. అలా మనం కూడా సాధించాలి అనుకున్నంత మాత్రాన అది సాధ్యపడదు. ఆ షోలో ఉన్న వినూత్నమైన ఐడియా, దాని చుట్టూ ముడిపడి ఉన్న ఎన్నో అంశాలు గ్లోబల్ బ్రేక్ఔట్‌కు కారణం కావచ్చు. మనదైన ఆలోచన చేసి విజయం సాధించాలిగానీ ఫలాన షోలాగా ఉండాలి అని ప్రయత్నిస్తే విజయం మాట ఎలా ఉన్నా నిరాశ మాత్రమే మిగులుతుంది. ర్యాట్ రేస్ ఇష్టపడను. ఆ రేసులో పడితే ఆయాసమే మిగులుతుంది తప్ప ఆలోచన మిగలదు' అంటోంది మోనిక.

కొంతకాలం క్రితం ట్రెండ్స్‌కు నిర్దిష్టమైన టైమ్ అంటూ ఉండేది. అర్థం చేసుకోవడానికైనా, అందిపుచ్చుకోవడానికైనా అది బాగా సరిపోయేది. కాని ఇప్పటి పరిస్థితి వేరు. ట్రెండ్స్ వేగంగా మారుతున్నాయి. ఒక దేశంలో ట్రెండ్‌గా ఉన్నది ఇక్కడ వర్కవుట్ అవుతుందో లేదో తెలియదు....ఇలాంటివి ఎన్నో దృష్టిలో పెట్టుకొని ముందుకు వెళుతుంది మోనిక షేర్‌గిల్. అందుకే ఆమె పేరు ముందు 'క్వీన్ ఆఫ్ కంటెంట్' అనే విజయధ్వజం రెపరెపలాడుతోంది.

పాడి పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లకు... మొలకల దాణా మేలు!



మేత బలహీనంగా ఉంటే పశువులు బలహీనంగా మారుతాయి. పశువులకు పోషకవంతమైన దాణా ఇవ్వనప్పుడు, అవి బరువు తగ్గుతాయి. తక్కువ పాలు ఇస్తాయి. వాటి పాలలో కొవ్వు తగ్గుతుంది. రెండు వారాల్లోనే జుట్టు రంగు కోల్పోయి చర్మవ్యాధుల బారిన పడతాయి. నాణ్యమైన మేత అందని ఆవులు తక్కువ ఈతలు ఈనుతాయి. వాటి దూడలకూ సులభంగా వ్యాధులు వస్తాయి.

మొలకల్లో ఎక్కువ పోషకాలు

ధాన్యాలను తగినంతగా నీటిలో నానబెడితే మొలకలు వస్తాయి. ఇంకొంచెం పెరిగితే మారాకు వేస్తాయి. విత్తనం బరువు మొలకెత్తిన తర్వాత నీటిని గ్రహించడం వల్ల రెట్టింపు అవుతుంది.

సాధారణ ధాన్యాల కంటే మొలకెత్తిన ధాన్యం సులభంగా జీర్ణమవుతుంది. మొలకెత్తడం వల్ల ధాన్యాలలోని పిండి పదార్థం అంతా చక్కెరగా మారుతుంది. జీర్ణశక్తిని పెంచడానికి సహాయపడే అనేక రకాల ఎంజైమ్‌లు మొలకల్లో ఉంటాయి. మొలకెత్తడం వల్ల ధాన్యాలలో ఖనిజాలు, విటమిన్లు, ప్రొటీన్లు ఎక్కువగా లభిస్తాయి.

ఏ ధాన్యం మొలకలైనా పెట్టొచ్చు

అందుబాటులో ఉన్న గోధుమలు, బార్లీ, ఓట్స్ లేదా మొక్కజొన్న వంటి ఏ ధాన్యాలనైనా మొలక కట్టి పశువులకు తినిపించవచ్చు. పాడి పశువులు బలహీనంగా ఉన్నప్పుడు లేదా తక్కువ పాలు ఇస్తున్నాయనుకున్నప్పుడు వాటికి సోయాబీన్స్, బఠానీలు, పెసలు వంటి పప్పుధాన్యాల మొలకలు కూడా ఇవ్వవచ్చు.

మొలక కట్టడానికి నాణ్యమైన విత్తనాలను వాడండి. విరిగిన లేదా నలిగిన విత్తనాలను ఎప్పుడూ ఉపయోగించవద్దు. ఎందుకంటే అవి సరిగ్గా పెరగవు. చేతితో కోతకోసి నూర్చిన విత్తనాల మొలక శాతం ఎక్కువగా ఉంటుంది.

విత్తనాలను శుభ్రమైన నీటితో కడిగి ప్లాస్టిక్ టబ్‌లో పోయాలి. నీటిలో తేలిన తాలు గింజలను తీసివేయండి. అవి మొలకెత్తవు. మొలకెత్తిన గింజలపై బూజు పెరగకుండా ఉండేందుకు సగం చారెడు ఉప్పు వేసి, గింజలను సుమారు 12 గంటల పాటు నానబెట్టాలి. 12 గంటల తర్వాత నీటిని తీసివేసి, విత్తనాలను శుభ్రమైన గోనె సంచిలో లేదా నూలు గుడ్డ సంచిలో పోసి, మూతి గట్టిగా కట్టేయండి. దాన్ని నీడలో లేదా ఇంట్లో ఉంచండి. వేడి వాతావరణంలో, విత్తనాలు మొలకెత్తడానికి సుమారు 16 నుంచి 18 గంటలు పడుతుంది. చల్లని వాతావరణంలో 24 గంటల కంటే ఎక్కువ సమయం పడుతుంది. గోనె సంచి లేదా నూలు వస్త్రాన్ని వాడిన తర్వాత ప్రతి సారీ ఉతికి ఎండలో ఆరబెట్టండి.

గింజల నుంచి 1 లేదా 2 సెంటీమీటర్ల పొడవున తెల్లటి మొలకలు బయటకు వచ్చిన తర్వాత, వాటిని ఉపయోగించవచ్చు. ఒక పాడి ఆవుకు అర కిలో లేదా 4–5 గుప్పిళ్ల మొలకెత్తిన గింజలను ఇతర దాణాతో రోజుకు ఒకసారి తినిపించండి.

మేకలు, గొర్రెలు, కోళ్లకు కూడా..

పాడి ఆవులు, గేదెలకే కాదు. ఇతర పశువులకు కూడా మొలకలు పెట్టొచ్చు. మేక లేదా గొర్రెకు వారానికి రెండుసార్లు ఒకటి లేదా రెండు గుప్పిళ్ల మొలకలు తినిపించవచ్చు. 10 కోళ్లకు రోజుకు ఒకసారి ఒక గుప్పెడు మొలకలు వెయొచ్చు.

ఈ అంశంపై తెలుగు/ఆంగ్ల వీడియోను www.accessagriculture.org లో చూడొచ్చు.

జూన్‌లో పల్నాడు జిల్లాలో చిన్న శోధాయాత్ర

పల్నాడు జిల్లా వినుకొండ ప్రాంతంలో మారుమూల గామాల్లో రైతులు, గిరిజనులు, మహిళల సంప్రదాయ విజ్ఞానం,సృజనశీలతపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడానికి జూన్ 23 నుంచి 25 వరకు పల్లెసృజన స్వచ్ఛంద సంస్థ చిన్న శోధా పాదయాత్ర నిర్వహించనుంది. వినుకొండ సమీపంలోని కొండ్రముట్ల గ్రామం నుంచి 23న ప్రారంభమై 25న మెల్లవాగు గ్రామంలో ముగుస్తుంది. గ్రామీణ సృజనాత్మకపై ఆసక్తిగల ఔత్సాహికులు ఎవరైనా ఈ యాత్రలో పాల్గొనవచ్చు. రూ. 500 చెల్లించి పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పల్లెసృజన అధ్యక్షులు బ్రిగేడియర్ పి. గణేశం (98660 01678) తెలిపారు. వివరాలకు.. 99666 46276, 89199 03118.

సాగుబడి
మృగశిర కార్తె : జూన్ 8 నుంచి

దున్నకుండానే మొక్కజొన్న, వేరుశనగ!

● డబుల్ వీల్ మార్కర్ పరికరంతో జీరో టిల్లేజి పద్ధతిలో విత్తుకుంటున్న ఉత్తరాంధ్ర రైతులు ● తక్కువ శ్రమతో పాటు సమయం, ఖర్చు ఆదా కావడం.. నెల రోజుల పంట కాలం కలిసి రావటంతో డబుల్ వీల్ మార్కర్‌కు ప్రాచుర్యం ● మహిళా రైతులకు అనుకూలమైన ఆవిష్కరణ కావటం మరో విశేషం



● డబుల్ వీల్ మార్కర్



● డబుల్ వీల్ మార్కర్ పరికరాన్ని భుజంపై పెట్టుకొని తీసుకువెళ్లొచ్చు





● డబుల్ వీల్ మార్కర్‌ను ఉపయోగిస్తున్న మహిళా రైతు హైమావతి



● డబుల్ వీల్ మార్కర్‌తో మొక్కజొన్న సాగుకు తన పొలంలో రంధ్రాలు వేస్తున్న రైతు ఎల్. సత్యనారాయణ. (పక్కన) డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి హరిబాబు.





● డబుల్ వీల్ మార్కర్ డిజైన్

దుక్కి దున్నకుండానే మొక్కజొన్న సాగు(జీరో టిల్లేజి) పద్ధతి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఇటీవల చాలా ప్రాచుర్యం పొందింది. దీనికి ఏకైక కారణం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ అందుబాటులోకి తెచ్చిన 'డబుల్ వీల్ మార్కర్' (రెండు చక్రాలతో రంధ్రాలు వేసే పరికరం). సార్వా(ఖరీఫ్)లో వరి సాగు చేసిన భూముల్లో దుక్కి దున్నకుండా ఈ పరికరంతో రైతులు సులభంగా నేలపై రంధ్రాలు చేసి విత్తనాలు వేసుకుంటున్నారు. వరి కోసిన తర్వాత తక్కువ సమయంలోనే మొక్కజొన్న విత్తుకోవడానికి ఈ పరికరం రైతులకు ఎంతో ఉపయోగ పడుతోంది. నాలుగేళ్ల క్రితం ఈ పరికరం తొలుత అందుబాటులోకి వచ్చింది. సార్వా వరి తర్వాత మొక్కజొన్న పంటను వరుసగా మూడు దఫాలు సాగు చేస్తూ మంచి ఆదాయం పొందుతున్న రైతులు ఉత్తరాంధ్రలో ఉన్నారు. వరుసల మధ్య దూరం తగ్గించుకునే చిన్న మార్పు చేసుకొని దుక్కిలేని పద్ధతిలో వేరుశెనగ విత్తుకోవడానికి కూడా ఈ పరికరం ఉపయోగపడుతోందని రైతులు సంతోషిస్తున్నారు.

నెల కాలం కలిసి వస్తుంది!

తొలకరి వరి చేను కోసిన తరువాత పొలంలో వరి కొయ్యకాళ్లలో దుక్కి దున్నకుండానే పదును చూసుకుని డబుల్ వీల్ మార్కర్‌ను నడిపి మొక్కజొన్న విత్తనాలు నేరుగా విత్తుకోవాలి. ఈ విధానంలో రైతులకు దుక్కి ఖర్చులు ఆదా అవ్వటమే కాకుండా నెల రోజుల పంట కాలం కలిసి వస్తుంది. మొక్కజొన్న సాగు ప్రారంభమైన తొలినాళ్లలో శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలో రైతులకు కొయ్యతో గాని, కొయ్యతో చేసిన పెగ్ మార్కర్ అనే పరికరంతో గాని వరి మాగాణిల్లో నేరుగా రంధ్రాలు చేసి మొక్కజొన్న విత్తనాలు విత్తేవారు. పెగ్ మార్కర్ పరికరాన్ని ఉపయోగించేటప్పుడు ఎక్కువ శ్రమ, ఎక్కువ సమయం వృథా అవుతుండేది. మగ కూలీలు మాత్రమే పెగ్ మార్కర్‌ను ఉపయోగించేవారు.

తుది రూపుదిద్దిన సత్యనారాయణ

డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ రూపొందించిన డబుల్ వీల్ మార్కర్‌కు రైతు లంకలపల్లి సత్యనారాయణ (83741 02313) మార్పులు చేసి బరువు తగ్గించి 2019లో తుది రూపుదిద్దారు. సత్యనారాయణ వ్యవసాయం చేస్తూనే వెల్డర్‌గా పనిచేస్తున్నారు. ఆ అనుభవంతో సులభంగా ఒక వ్యక్తి తన పొలానికి భుజాన వేసుకొని తీసుకువెళ్లేందుకు వీలుగా డబుల్ వీల్ మార్కర్ పరికరాన్ని మార్చారు. మొదట తన పొలంలో ఉపయోగించి సంతృప్తి చెందిన తర్వాత, తానే తయారు చేసి రూ. 2,900కు ఇతర రైతులకు అందిస్తున్నారు. 2021 రబీ నాటికి రణస్థలం మండలంలో రైతులకు 85 డబుల్ వీల్ మార్కర్లను ఇచ్చారు. ఆ తర్వాత రైతుల్లో ఇది ప్రాచుర్యంలోకి వచ్చింది.

2016 నుంచి ప్రయోగాలు

కూలీల ఖర్చు, శ్రమ తగ్గించుకుంటూ మొక్కజొన్న, వేరుశెనగ పంటలను దుక్కి దున్నకుండా నేరుగా ఎలా విత్తుకోవాలనే అంశంపై డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి హరిబాబు (84999 28483) 2016 నుంచి అనేక ప్రయోగాలు చేసి ఎట్టకేలకు సఫలీకృతులయ్యారు. తొలుత ఒక చక్రం ఉన్న మార్కర్‌ను, తర్వాత ఐదు చక్రాల మార్కర్లను డిజైన్ చేసి రైతులకు అందించారు. వీటితో సరైన ఫలితాలు రాకపోవడంతో డబుల్ వీల్ మార్కర్‌ను డిజైన్ చేశారు. ఇది రైతులకు ఉపయోగకరంగా ఉండటంతో మంచి స్పందన వచ్చింది. ఆముదాలవలసలోని ఏరువాక కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల సూచనల మేరకు ఉక్కుతో రెండు చక్రాల మార్కర్ (డబుల్ వీల్ మార్కర్) పరికరం దిద్దుకుంది.


మొక్కజొన్నతో పాటు వేరుశనగ

మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం, వరుసల మధ్య 60 సెం.మీ.ల దూరంలో డబుల్ వీల్ మార్కర్‌తో రంధ్రాలు చేసి దుక్కి చేయకుండానే మొక్కజొన్న విత్తుకోవచ్చు. అదేవిధంగా వేరుశనగ విత్తుకోవడానికి మార్కర్‌లో స్వల్ప మార్పు చేసుకోవాల్సి ఉంటుంది. మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం, వరుసల మధ్య 40 సెం.మీ.ల దూరంలో వేరుశనగ విత్తుకోవాలి.

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో గత రబీలో వరి కోసిన 48,146 ఎకరాల్లో దున్నకుండా డబుల్ వీల్ మార్కర్‌తో మొక్కజొన్నను సాగు చేశారు. 18 మండలాల్లో సుమారు 25 లక్షల వ్యంతో మండలానికి 40 చొప్పున 720 పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ తెలిపింది. ఈ పరికరాలన్నీ ఎల్. సత్యనారాయణ తయారు చేసి ఇచ్చినవే.

సమాన దూరంలో విత్తనాలు నాటడం వలన గాలి, వెలుతురు ధారాళంగా సోకి, పంటలకు పురుగులు, తెగుళ్ల బెడద తక్కువగా ఉంది. చేను ఏపుగా పెరిగి సాధారణ పద్ధతిలో కంటే జీరోటిల్లేజ్ పద్ధతిలో మేలైన దిగుబడులు నమోదు అవుతుండటం విశేషం. మహిళలు ఉపయోగించడానికి డబుల్ వీల్ మార్కర్ అనువుగా ఉండటం మరో విశేషం. మహిళా రైతులకు, ముఖ్యంగా చిన్న, సన్నకారు ఒంటరి మహిళా రైతులకు ఈ ఆవిష్కరణ ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– గంగి నాగరాజు,
సాక్షి, రణస్థలం, శ్రీకాకుళం జిల్లా



ఆరెంజ్ క్యాప్ (అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్)
శుబ్‌మన్ గిల్ (890 పరుగులు; 17 మ్యాచ్‌లు) సెంచరీలు: 3, అర్ధ సెంచరీలు: 4
ఐపీఎల్ టోర్నీలో ఆరెంజ్ క్యాప్ నెగ్గిన పిన్న వయస్కుడిగా గిల్ (23 ఏళ్ల 263 రోజులు) గుర్తింపు పొందాడు.
ప్రైజ్‌మనీ: రూ. 15 లక్షలు



పర్పుల్ క్యాప్ (అత్యధిక వికెట్లు తీసిన బౌలర్)
మొహమ్మద్ షమీ (28 వికెట్లు; 17 మ్యాచ్‌లు)
ప్రైజ్‌మనీ: రూ. 15 లక్షలు

మొత్తం ప్రైజ్‌మనీ: రూ. 46 కోట్ల 50 లక్షలు
విజేత జట్టుకు: రూ. 20 కోట్లు
రన్నరప్ జట్టుకు: రూ. 13 కోట్లు
మూడో స్థానం: రూ. 7 కోట్లు (ముంబై ఇండియన్స్)
నాలుగో స్థానం: రూ. 6 కోట్ల 50 లక్షలు (లక్నో సూపర్ జెయింట్స్)



మహేంద్ర సింగ్ ధోని మంత్రజాలం ఐపీఎల్‌లో మరోసారి అద్భుతంగా పని చేసింది. తనకే సాధ్యమైనరీతిలో సాధారణ ఆటగాళ్లతోనే జట్టును నడిపించిన అతను ఐదో ట్రోఫీతో సగర్వంగా నిలిచాడు. 15 ఓవర్లలో 171 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అక్కడక్కడా తడబడినా చివరకు సీఎస్‌కే గెలుపు సొంతం చేసుకుంది. మోహిత్ శర్మ వేసిన చివరి ఓవర్లో 13 పరుగులు అవసరం కాగా, తొలి 4 బంతుల్లో అతను 3 పరుగులే ఇచ్చాడు. దాంతో గుజరాత్ గెలుస్తున్నట్లుగా అనిపించింది. అయితే తర్వాతి రెండు బంతులను జడేజా 6, 4గా మలచి సూపర్ కింగ్స్‌కు చిరస్మరణీయ విజయం అందించాడు. వరుసగా రెండో ఏడాది చాంపియన్‌గా నిలవాలని భావించిన గుజరాత్ టైటాన్స్ చివరకు రన్నరప్‌గా సంతృప్తి చెందింది. సాధారణంగా 215 పరుగుల లక్ష్యం అసాధ్యంగా కనిపించినా... వర్షం అంతరాయంతో ఓవర్లు తగ్గడం, చేతిలో 10 వికెట్లు ఉండటం కూడా చెన్నైకి మేలు చేసింది. చివరిదిగా భావిస్తున్న ఐపీఎల్ మ్యాచ్‌లో ధోని తొలి బంతికే గోల్డెన్ డకౌట్‌గా వెనుదిరగా... ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన అంబటి రాయుడు తన కెరీర్‌లో ఆరో టైటిల్‌తో ఘనమైన ముగింపునిచ్చాడు.

250 ఐపీఎల్‌లో 250 మ్యాచ్‌లు ఆడిన తొలి ప్లేయర్‌గా ధోని రికార్డు నెలకొల్పాడు. 2008 నుంచి మొదలుకొని ధోని వరుసగా 16 సీజన్లు ఆడాడు. 226 మ్యాచ్‌ల్లో అతను కెప్టెన్‌గా చేశాడు. రోహిత్ శర్మ (243), దినేశ్ కార్తీక్ (242), విరాట్ కోహ్లి (237), రవీంద్ర జడేజా (226) టాప్-5లో ఉన్నారు.

12 ఐపీఎల్-2023లో నమోదైన సెంచరీలు. గత ఐపీఎల్ సీజన్‌లో అత్యధికంగా 8 సెంచరీలు వచ్చాయి.

37 గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఐపీఎల్ సీజన్‌లో 37 సార్లు ఆయా జట్లు 200 అంతకంటే ఎక్కువ పరుగులు సాధించాయి. గత సీజన్‌లో 18 సార్లు 200 అంతకంటే ఎక్కువ పరుగులు వచ్చాయి.

564 ఒక ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక పరుగులు సమర్పించుకున్న బౌలర్‌గా చెన్నై సూపర్ కింగ్స్‌కు చెందిన తుషార్ దేశ్‌పాండే నిలిచాడు. ఈ సీజన్‌లో తుషార్ 16 మ్యాచ్‌లు ఆడి 564 పరుగులు ఇచ్చి 21 వికెట్లు పడగొట్టాడు. గతంలో ఈ రికార్డు ప్రసిధ్ కృష్ణ (551 పరుగులు: 2022 సీజన్) పేరిట ఉంది.

7 ఇప్పటి వరకు జరిగిన 16 ఐపీఎల్ ఫైనల్స్‌లో ఏడుసార్లు ఛేజింగ్ చేసిన జట్టు చాంపియన్‌గా అవతరించింది. తొమ్మిదిసార్లు తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు విజేతగా నిలిచింది.

5 ఐపీఎల్ టైటిల్‌ను అత్యధికంగా ఐదుసార్లు గెలిచిన జట్టుగా ముంబై ఇండియన్స్ (2013, 2015, 2017, 2019, 2020) జట్టు పేరిట ఉన్న రికార్డును చెన్నై సూపర్ కింగ్స్ (2010, 2011, 2018, 2021, 2023) సమం చేసింది.

0 ఇప్పటి వరకు జరిగిన 16 ఐపీఎల్ ఫైనల్స్ మ్యాచ్‌ల్లో ఏ జట్టు కూడా ఒక్కసారీ ఆలౌట్ కాలేదు.

6 మొత్తం 16 ఐపీఎల్ ఫైనల్స్‌లో ఆరుసార్లు ఆయా జట్లు 200 అంతకంటే ఎక్కువ పరుగులు సాధించాయి.

చెన్నై ఫైవ్ స్టార్...



- ఐదోసారి ఐపీఎల్ టైటిల్ సాధించిన సూపర్‌కింగ్స్
- ఫైనల్లో 5 వికెట్లతో గుజరాత్‌పై ఘన విజయం
- వర్షంతో మారిన లెక్కల్లో ధోని సేనదే పైచేయి
- ఆఖరి బంతికి గెలిపించిన జడేజా

అహ్మదాబాద్: ఐపీఎల్-2023లో చెన్నై సూపర్ కింగ్స్ చాంపియన్‌గా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్లో చెన్నై 5 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (47 బంతుల్లో 96; 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) సెంచరీ కోల్పోగా... వృద్ధిమాన్ సాహా (39 బంతుల్లో 54; 5 ఫోర్లు, 1 సిక్స్) శుబ్‌మన్ గిల్ (20 బంతుల్లో 39; 7 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. అనంతరం చెన్నై 15 ఓవర్లలో 5 వికెట్లకు 171 పరుగులు చేసి గెలిచింది. కాన్వే (25 బంతుల్లో 47; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), శివమ్ దూబే (21 బంతుల్లో 32 నాటౌట్; 2 సిక్స్‌లు) రాణించారు.

సమష్టి బ్యాటింగ్ ప్రదర్శన...
42 బంతుల్లో 67, 42 బంతుల్లో 64, 33 బంతుల్లో 81... తొలి మూడు వికెట్లకు వరుసగా గుజరాత్ భాగస్వామ్యాలివి. జట్టులోని టాప్-4 తమ వంతుగా కీలకపాత్ర పోషించడంతో భారీ స్కోరు సాధ్యమైంది. సాహా, గిల్ ఇద్దరూ దూకుడుగా ఆడుతూ ఈ సీజన్‌లో మరోసారి జట్టుకు శుభారంభం అందించారు. తుషార్ వేసిన రెండో ఓవర్లోనే 3 పరుగుల వద్ద గిల్ ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను దీపక్ చహర్ వదిలేసి గుజరాత్‌కు మేలు చేశాడు. చహర్ ఓవర్లో సాహా సిక్స్, 2 ఫోర్లు కొట్టగా... తుషార్, తీక్షణ ఓవర్లలో గిల్ వరుసగా మూడేసి ఫోర్లు బాది జోరు ప్రదర్శించాడు. 21 పరుగుల వద్ద సాహా ఇచ్చిన రిటర్న్ క్యాచ్‌ను కూడా చహర్ వదిలేయడం టైటాన్స్‌కు మరింత కలిసొచ్చింది. ఎట్టకేలకు ధోని మెరుపు స్టంపింగ్‌తో గిల్ వెనుదిరగ్గా, 36 బంతుల్లో సాహా అర్ధ సెంచరీ పూర్తయింది. ఆ వెంటనే సాహా అవుట్ కాగా, సుదర్శన్ దూకుడు కొనసాగింది. తీక్షణ ఓవర్లో రెండు సిక్స్‌లు బాదిన అతను పతిరణ ఓవర్లో వరుసగా 2 ఫోర్లు కొట్టి 33 బంతుల్లోనే హాఫ్ సెంచరీకి చేరుకున్నాడు. తుషార్ వేసిన తర్వాతి ఓవర్లో అతను మరింత చెలరేగిపోయాడు. తొలి నాలుగు బంతుల్లో అతను 6, 4, 4, 4 కొట్టడం విశేషం. తుషార్ తర్వాతి ఓవర్లోనూ టైటాన్స్ 18 పరుగులు రాబట్టింది. పతిరణ వేసిన ఆఖరి ఓవర్లో వరుసగా 6, 6 కొట్టి 96కు చేరిన సుదర్శన్ తర్వాతి బంతికి దురదృష్టవశాత్తూ ఎల్బీగా దొరికిపోయి సెంచరీ చేజార్చుకున్నాడు. చివర్లో హార్దిక్ పాండ్యా (12 బంతుల్లో 21 నాటౌట్; 2 సిక్స్‌లు) ధాటి గుజరాత్‌ను మరింత పటిష్ట స్థితికి చేర్చింది.



జడేజాను ఆలింగనం చేసుకుంటున్న ధోని

శుభారంభం...
వర్షం అంతరాయం కలిగించడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం చెన్నై విజయలక్ష్యాన్ని 15 ఓవర్లలో 171 పరుగులుగా నిర్ణయించారు. ఛేదనను చెన్నై ఘనంగా ప్రారంభించింది. దూకుడుగా ఆడిన ఓపెనర్లు రుతురాజ్, కాన్వే 4 ఓవర్ల పవర్‌ప్లే ముగిసేసరికి 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో స్కోరును 52 పరుగులకు చేర్చారు. అయితే పవర్‌ప్లే తర్వాత చెన్నైని నియంత్రించడంలో బౌలర్లు సఫలమయ్యారు. నాలుగు పరుగుల తేడాతో వీరిద్దరు వెనుదిరిగారు. అయితే రుతురాజ్ (16 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్), రహానే (13 బంతుల్లో 27; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), అంబటి రాయుడు (8 బంతుల్లో 19; 1 ఫోర్, 2 సిక్స్‌లు) తలా ఓ చేయి వేసి జట్టును గెలుపు దిశగా నడిపించారు.

15 ఓవర్లకు కుదింపు...
రిజర్వ్ డే అయిన సోమవారం కూడా వాన మ్యాచ్‌కు అంతరాయం కలిగించింది. సరైన సమయానికే ఆరంభమై గుజరాత్ పూర్తి 20 ఓవర్లు ఆడింది. అయితే చెన్నై ఇన్నింగ్స్‌లో 3 బంతులకు 4 పరుగులు చేసిన తర్వాత మొదలైన వర్షం సుదీర్ఘ సమయం పాటు తెరిపినివ్వలేదు. వర్షం తగ్గినా, ప్రధాన పిచ్ పక్కన ఉన్న మరో పిచ్ ఆరకపోవడంతో సమస్యగా మారింది. దానిని ఆరబెట్టేందుకు గ్రౌండ్స్‌మన్ అన్ని ప్రయత్నాలు చేశారు. చివరకు అర్ధరాత్రి 12.05 గంటలకు మ్యాచ్ మళ్లీ మొదలైంది. చెన్నై ఇన్నింగ్స్‌ను 15 ఓవర్లకు కుదించి లక్ష్యాన్ని 171 పరుగులుగా నిర్దేశించారు. పవర్‌ప్లేను 4 ఓవర్లకు పరిమితం చేయగా, ఒక్కో బౌలర్ గరిష్టంగా 3 ఓవర్లు మాత్రం వేసేందుకు అనుమతించారు.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) ధోని (బి) చహర్ 54; గిల్ (స్టంప్డ్) ధోని (బి) జడేజా 39; సుదర్శన్ (ఎల్బీ) (బి) పతిరణ 96; పాండ్యా (నాటౌట్) 21; రషీద్ (సి) రుతురాజ్ (బి) పతిరణ 0; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 214. వికెట్ల పతనం:** 1-67, 2-131, 3-212, 4-214, **బౌలింగ్:** దీపక్ చహర్ 4-0-38-1, తుషార్ 4-0-56-0, తీక్షణ 4-0-36-0, జడేజా 4-0-38-1, పతిరణ 4-0-44-2.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) రషీద్ (బి) నూర్ 26; కాన్వే (సి) మోహిత్ (బి) కాన్వే 47; దూబే (నాటౌట్) 32; రహానే (సి) విజయ్‌శంకర్ (బి) మోహిత్ 27; రాయుడు (సి) అండ్ (బి) మోహిత్ 19; ధోని (సి) మిల్లర్ (బి) మోహిత్ 0; జడేజా (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (15 ఓవర్లలో 5 వికెట్లకు) 171. వికెట్ల పతనం:** 1-74, 2-78, 3-117, 4-149, 5-149. **బౌలింగ్:** షమీ 3-0-29-0, పాండ్యా 1-0-14-0, రషీద్ 3-0-44-0, నూర్ 3-0-17-2, లిటిల్ 2-0-30-0, మోహిత్ శర్మ 3-0-36-3.

'సుదర్శన' చక్రం...



'సాయి సుదర్శన్ ప్రత్యేకమైన ఆటగాడు. టి20 ఫార్మాట్‌కైతే సరిగ్గా సరిపోతాడు. సాధ్యమైనంత తొందరగా అతడిని తమిళనాడు జట్టులోకి తీసుకురండి'... భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ జూలై, 2021లో చెప్పిన ప్రశంసాపూర్వక మాట ఇది. ఆ ఏడాది తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో అతను అద్భుత బ్యాటింగ్‌తో అత్యధిక పరుగుల జాబితాలో రెండో స్థానంలో నిలిచాడు. అశ్విన్ మాట విన్నట్లుగా తమిళనాడు సెలక్టర్లు అతడిని జట్టులోకి ఎంపిక చేయగా... నవంబర్, 2021లోనే అతను తన తొలి దేశవాళీ మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత గత రెండేళ్లలో అతని ఆట మరింత మెరుగైంది. 21 ఏళ్ల సుదర్శన్ మూడు ఫార్మాట్లలోనూ సత్తా చాటి ప్రస్తుతం ఆ జట్టులో కీలక ఆటగాడిగా మారాడు.

తన ప్రదర్శన, గుర్తింపు కారణంగా 2022 ఐపీఎల్ వేలంలో తనను చెన్నై జట్టు తీసుకుంటుందని సుదర్శన్ ఆశించాడు. కానీ అది జరగలేదు. చివరకు అతని కనీస విలువ రూ. 20 లక్షలకు గుజరాత్ టైటాన్స్ తీసుకుంది. విజయ్‌శంకర్‌కు గాయం కావడంతో తొలి మ్యాచ్ ఆడే అవకాశం రాగా, మొత్తం సీజన్‌లో 5 మ్యాచ్‌లకే పరిమితమయ్యాడు. అయితే అతని మెరుపులు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా రబడ బౌలింగ్‌లో కొట్టిన హుక్‌షాట్ బౌండరీ అతని ఆత్మవిశ్వాసాన్ని చూపించింది. సాయి బ్యాటింగ్‌ను నమ్మిన టీమ్ యాజమాన్యం ఈసారి కూడా కొనసాగించింది. ఈ ఏడాది కూడా విలియమ్సన్ గాయంతో తప్పుకోవడంతో తనకు అందివచ్చిన అవకాశాన్ని అతను సమర్థంగా వినియోగించుకున్నాడు. ఢిల్లీపై అర్ధసెంచరీ చేసిన మ్యాచ్‌లో నోర్జే వేసిన 144 కిలోమీటర్ల బంతిని వికెట్ల వెనుక వైపు సిక్సర్‌గా మలచడం హైలైట్‌గా నిలిచింది. కోల్‌కతాపై కూడా మరో అర్ధ సెంచరీ సాధించిన అతను ఈ సీజన్‌లో 51.71 సగటు, 141.41 స్ట్రయిక్‌రేట్‌తో 362 పరుగులు సాధించడం విశేషం. ముంబైతో రెండో క్వాలిఫయర్‌లో చివర్లో వేగంగా పరుగులు చేయలేక 'రిటైర్డ్ అవుట్'గా వెళ్లడంతో అతని దూకుడుపై సందేహాలు తలెత్తాయి. అయితే సోమవారం అతను దానిని పటాపంచలు చేశాడు. సెంచరీ చేజారినా...ఐపీఎల్‌లో ఎప్పటికీ గుర్తుంచుకోదగ్గ ఇన్నింగ్స్‌లలో ఒకటి ఆడాడు.

సుదర్శన్ ఇంట్లోనే క్రీడలు ఉన్నాయి. అథ్లెట్ అయిన తండ్రి భరద్వాజ్ భారత్ తరఫున దక్షిణాసియా క్రీడల్లో పాల్గొనగా, తల్లి ఉష జాతీయ వాలీబాల్‌లో తమిళనాడు జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. ప్రస్తుతం స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్‌గా పని చేస్తోంది. వివిధ వయో విభాగాల్లో అద్భుత ప్రదర్శనతో అతను దూసుకొచ్చాడు. 2019-20 అండర్-19 చాలెంజర్ ట్రోఫీలో యశస్వి జైస్వాల్, తిలక్‌వర్మ, రవి బిష్ణోయ్, ప్రియమ్ గార్గ్ అతని ఇండియా 'ఎ' జట్టు సహచరులు. ఆరంభంలోనే ఫిట్‌నెస్‌పై అంతగా దృష్టి పెట్టని సాయి తల్లి పర్యవేక్షణలో పూర్తి ఫిట్‌గా మారడం కూడా అతని కెరీర్‌కు మేలు చేసింది. 2022లో టైటాన్స్ రూ.20 లక్షలకు తీసుకున్న తర్వాత జరిగిన 2023 తమిళనాడు ప్రీమియర్ లీగ్ వేలంలో సుదర్శన్‌కు రూ. 21.60 లక్షలు దక్కడం విశేషం. సీఎస్‌కేకే చెందిన జూనియర్ సూపర్ కింగ్స్ టీమ్ సభ్యుడిగా 2018లో సుదర్శన్ ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లగా, ఆ టీమ్‌కు అంబటి రాయుడు మెంటార్‌గా వ్యవహరించాడు. ఇప్పుడు అదే చెన్నైపై తన మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగడం కొసమెరుపు! **–సాక్షి క్రీడా విభాగం**

నెట్ ప్రాక్టీస్‌లో కోహ్లి

లండన్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ కోసం భారత ఆటగాళ్లు ఇంగ్లండ్‌లో కసరత్తు మొదలుపెట్టారు. స్టార్ బ్యాటర్ కోహ్లి ట్రెయినింగ్ సెషన్‌లో పాల్గొన్నాడు. లెఫ్టార్మ్ సీమర్ ఉనాద్కట్, ఉమేశ్ యాదవ్, సిరాజ్, వెటరన్ స్పిన్నర్ అశ్విన్‌లు కాసేపు ఎక్సర్‌సైజ్ చేశారు. కెప్టెన్ రోహిత్ శర్మ, యువ సంచలనం యశస్వి జైస్వాల్ తాజాగా ఇంగ్లండ్ చేరుకోగా... మంగళవారం నుంచి వీరిద్దరు ప్రాక్టీస్ మొదలుపెడతారు.



డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఆస్ట్రేలియా జట్టు ప్రకటన



హాజల్‌వుడ్

లండన్: భారత జట్టుతో వచ్చే నెల 7 నుంచి 11 వరకు ఓవల్‌లో జరిగే ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మ్యాచ్‌లో పాల్గొనే ఆస్ట్రేలియా జట్టును ప్రకటించారు. పక్కటెముకల్లో నొప్పితో ఐపీఎల్ టోర్నీ మధ్యలో నుంచి స్వదేశానికి వెళ్లిపోయిన పేస్ బౌలర్ జోష్ హాజల్‌వుడ్ (ఆర్సీబీ)కు 15 మందితో కూడిన ఆసీస్ జట్టులో చోటు లభించింది. అయితే ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్, బ్యాటర్ రెన్‌షాలకు స్థానం దక్కలేదు. 32 ఏళ్ల హాజల్‌వుడ్ 59 టెస్టులు ఆడి 222 వికెట్లు పడగొట్టాడు.

ఆస్ట్రేలియా టెస్ట్ జట్టు: కమిన్స్ (కెప్టెన్), వార్నర్, ఉస్మాన్ ఖ్వాజా, లబుషేన్, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, అలెక్స్ క్యారీ, మిచెల్ స్టార్క్, హాజల్‌వుడ్, నాథన్ లయన్, టాడ్ మర్ఫీ, స్కాట్ బోలాండ్, కామెరాన్ గ్రీన్, మార్కస్ హారిస్, ఇంగ్లిస్.

జొకోవిచ్ శుభారంభం

- ఫ్రెంచ్ ఓపెన్ టోర్నమెంట్
- రెండో రౌండ్‌లోకి అల్‌కరాజ్
- పదో సీడ్ ఫెలిక్స్ పరాజయం



జొకోవిచ్

పారిస్: కెరీర్‌లో 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ లక్ష్యంగా ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీలో బరిలోకి దిగిన సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్ శుభారంభం చేశాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో మూడో సీడ్ జొకోవిచ్ 6-3, 6-2, 7-6 (7/1)తో అలెగ్జాండర్ కొవాసెవిచ్ (అమెరికా)పై గెలుపొందాడు. 2 గంటల 26 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ 10 ఏస్‌లు సంధించాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన ఈ సెర్బియా స్టార్ 22 అనవసర తప్పిదాలు చేశాడు. వరుసగా 19వసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడుతున్న జొకోవిచ్ రెండుసార్లు టైటిల్ సాధించడంతోపాటు నాలుగుసార్లు రన్నరప్‌గా నిలిచాడు.

డిఫెండింగ్ చాంపియన్ రాఫెల్ నాదల్ (స్పెయిన్) గైర్హాజరీలో టైటిల్ ఫేవరెట్‌గా ఉన్న ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్) కూడా రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. క్వాలిఫయర్ ఫ్లావియో కొబొలి (ఇటలీ)తో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో అల్‌కరాజ్ 6-0, 6-2, 7-5తో విజయం సాధించాడు. గంటా 57 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేశాడు. మరోవైపు పదో సీడ్ ఫెలిక్స్ అగర్ అలియాసిమ్ (కెనడా) తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. ఫాబియో ఫాగ్‌నిని (ఇటలీ) 6-4, 6-4, 6-3తో ఫెలిక్స్‌ను ఓడించి రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. ఇతర మ్యాచ్‌ల్లో 14వ సీడ్ కామెరాన్ నోరి (బ్రిటన్) 7-5, 4-6, 3-6, 6-1, 6-4తో బెనోయి పెయిర్ (ఫ్రాన్స్)పై, మాజీ చాంపియన్ వావ్రింకా (స్విట్జర్లాండ్) 7-6 (7/5), 6-4, 6-7 (2/7), 1-6, 6-4తో రామోస్ వినోలస్ (స్పెయిన్)పై, షపోవలోవ్ (కెనడా) 6-4, 7-5, 4-6, 3-6, 6-3తో నకషిమా (అమెరికా)పై గెలిచి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.

12వ సీడ్ బెన్‌చిచ్ ఓటమి
మహిళల సింగిల్స్ విభాగంలో 12వ సీడ్ బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. 'లక్కీ లూజర్' ఎలీనా అలనెస్యాన్ (రష్యా) 6-3, 2-6, 6-4తో బెన్‌చిచ్‌ను ఓడించి తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఐదో సీడ్ కరోలినా గార్సియా (ఫ్రాన్స్) 7-6 (7/4), 4-6, 6-4తో జియు వాంగ్ (చైనా)పై, స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా) 6-0, 6-4తో కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)పై, కేలా డే (అమెరికా) 7-5, 6-1తో మ్లాడెనోవిచ్ (ఫ్రాన్స్)పై, స్వితోలినా (ఉక్రెయిన్) 6-2, 6-2తో మార్టినా ట్రెవిసాన్ (ఇటలీ)పై గెలిచారు.

'పోరాటం కొనసాగుతుంది'

పోలీసుల నిర్బంధం నుంచి విడుదలైన రెజ్లర్లు



న్యూఢిల్లీ: పోలీసు నిర్బంధం నుంచి ఆదివారం రాత్రి విడుదలైన భారత స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్ త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. 'మా తదుపరి కార్యాచరణ ఏంటనేది త్వరలోనే వెల్లడవుతుంది. మేమంతా ఇంకా కలుసుకోలేదు. మమ్మల్ని వేర్వేరు పోలీసు స్టేషన్లకు తరలించారు. నన్ను అర్ధరాత్రి దాటాక విడిచి పెట్టారు. మిగతా రెజ్లర్లను రాత్రి 11 గంటలకు విడుదల చేశారు. అందువల్లే అందరం కలువలేకపోయాం. అంతా కలిసి చర్చించుకున్నాకే తదుపరి పోరాటానికి దిగుతాం' అని బజరంగ్ తెలిపాడు. మరోవైపు ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులు రెజ్లర్లు మళ్లీ నిరసన చేసేందుకు అనుమతి కోరితే ఇస్తామని, అయితే జంతర్‌మంతర్ వద్ద మాత్రం శిబిరానికి అనుమతి లేదని, ఢిల్లీలో ఇంకెక్కడైనా దీక్ష చేపట్టవచ్చని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

వాళ్లనలా చూశాక నిద్రే రాలేదు: బింద్రా
దేశానికి ఒలింపిక్, ఆసియా క్రీడల్లో పతకాలు తెచ్చిపెట్టిన రెజ్లర్లతో పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణమని బీజింగ్ ఒలింపిక్స్ (2008) చాంపియన్ షూటర్ అభినవ్ బింద్రా అన్నాడు. మహిళా రెజ్లర్లపై దాష్టీకానికి పాల్పడిన దృశ్యాలు తనను కలచివేశాయని రాత్రంత నిద్రలేకుండా చేసిందని ట్వీట్ చేశాడు. స్టార్ రెజ్లర్లతో ఖాకీల కాఠిన్యం ఏమాత్రం ఆమోదయోగ్యం కానే కాదని భారత ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ చెత్రి అన్నాడు. రెజ్లర్లను పోలీసులు ఈడ్చుకెళ్లిన చిత్రాలు తనను బాధించాయని, సాధ్యమైనంత త్వరలో వారి సమస్య పరిష్కరించాలని మాజీ క్రికెట్ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ట్విట్టర్‌లో కోరారు.

సినిమా

రామ్.. సీతారామ్...




● ప్రభాస్, కృతీ సనన్

సీతారాముల ప్రేమ గాఢతను, వారి అనుబంధాన్ని తెలియజేసే 'రామ్ సీతా రామ్...' పూర్తి పాటను విడుదల చేసింది 'ఆదిపురుష్' టీమ్. ఈ చిత్రంలో రాముడిగా ప్రభాస్, సీతగా కృతీ సనన్, రావణుడిగా సైఫ్ అలీఖాన్ నటించారు. ఓం రౌత్ దర్శకత్వంలో భూషణ్ కుమార్, క్రిష్ణకుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతారియా, రెట్రోఫిల్స్ రాజేష్ నాయర్, యూవీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. కాగా సోమవారం ఈ చిత్రం నుంచి విడుదల చేసిన 'రామ్ సీతారామ్...' పాటను సచేత్-పరంపర స్వరపరచగా, రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. జూన్ 16న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం విడుదల కానుంది.

''అహింస' కథ చాలా కొత్తగా ఉంటుంది.. కథ కొత్తగా ఉన్నప్పుడు పాట సహజంగానే కొత్తగా వినిపిస్తుంది. ఈ చిత్రం పాటలకు మంచి స్పందన వస్తోంది'' అన్నారు సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్. అభిరామ్, గీతికా తివారి జంటగా తేజ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అహింస'. పి. కిరణ్ నిర్మించిన ఈ సినిమా జూన్ 2న రిలీజ్ కానున్న సందర్భంగా ఈ చిత్ర సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ– ''అహింస సిద్ధాంతం నమ్మే ఓ అబ్బాయిని పరిస్థితులు ఎలా కృష్ణతత్వంవైపు లాగాయనేది ఈ చిత్ర కథ. నా దర్శకత్వంలో ఒక మ్యూజికల్ ఫిల్మ్ ప్లాన్ చేస్తున్నాను. ఎన్నికల నేపథ్యంలో ఓ కథ రెడీ చేశాను. నిర్మాతలు దొరికితే ఏడాదికి 4 చిత్రాలకు దర్శకత్వం వహిస్తా. వెబ్ సిరీస్ కోసం రెండు కథలు రాశాను'' అన్నారు.

అహింస కొత్తగా ఉంటుంది
- ఆర్పీ పట్నాయక్



అలాంటి వారికి సమాధానమే టక్కర్
- హీరో సిద్ధార్థ్



● వివేక్ కూచిభొట్ల, కార్తీక్ జి. క్రిష్, సిద్ధార్థ్, మయాంక్

''మీరెప్పుడూ లవర్ బోయ్ పాత్రలు చేస్తుంటారు. కంప్లీట్ కమర్షియల్ సినిమా చేయొచ్చు కదా?' అని చాలామంది నన్ను ప్రశ్నిస్తుంటారు.. వారికి సమాధానమే 'టక్కర్'. ఫుల్ యాక్షన్ అండ్ రొమాంటిక్ టచ్‌తో ఈ ప్రేమకథ నడుస్తుంది'' అన్నారు సిద్ధార్థ్. కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వంలో సిద్ధార్థ్, దివ్యాంశా కౌశిక్ జంటగా నటించిన చిత్రం 'టక్కర్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ప్యాషన్ స్టూడియోస్‌తో కలిసి టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా జూన్ 9న తెలుగు, తమిళ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సిద్ధార్థ్ మాట్లాడుతూ– ''బాయ్స్'తో హీరోగా ఎంట్రీ ఇచ్చా. ఈ ఆగస్టుకి హీరోగా 20 ఏళ్ల కెరీర్ పూర్తవుతుంది. ఇప్పటికీ నా చేతిలో అరడజను సినిమాలు ఉండటం హ్యాపీ'' అన్నారు. ''టక్కర్' న్యూ జనరేషన్ సినిమా. ఇందులో సిద్ధార్థ్‌ని రగ్డ్ లవర్ బోయ్‌గా చూస్తారు '' అన్నారు కార్తీక్ జి. క్రిష్. ''ఈ సినిమాతో మళ్లీ పాత సిద్ధార్థ్‌ని చూస్తాం'' అన్నారు చిత్ర సహనిర్మాత వివేక్ కూచిభొట్ల.

నాంది క్రేజ్‌ని స్టూడెంట్ నిలబెడతాడు
- సతీష్ వర్మ



''బాహుబలి, హ్యాపీ డేస్, కొత్త బంగారులోకం' లాంటి కొన్ని సినిమాలు తప్పితే చాలావరకు ఏ సినిమానీ నేను రెండోసారి చూడలేదు. కానీ 'నేను స్టూడెంట్ సర్' చిత్రాన్ని నాలుగు సార్లు చూశాను.. ఎక్కడా బోర్ కొట్టదు. కోవిడ్ కారణంగా 40 ఏళ్లకు పైబడిన వారు 'నాంది' సినిమాని ఎక్కువగా థియేటర్‌కి వచ్చి చూడలేదు. కానీ 'నేను స్టూడెంట్ సర్' చిత్రం అన్ని వయసుల వారు థియేటర్‌కి వచ్చి చూసేలా ఉంటుంది'' అని నిర్మాత 'నాంది' సతీష్ వర్మ అన్నారు. బెల్లంకొండ గణేష్, అవంతిక దాసాని జంటగా రాకేష్ ఉప్పలపాటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నేను స్టూడెంట్ సర్'. సతీష్ వర్మ నిర్మించిన ఈ సినిమా జూన్ 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా సతీష్ వర్మ విలేకరులతో మాట్లాడుతూ– ''నేను స్టూడెంట్ సర్'లో యూనివర్సిటీలో స్టూడెంట్ లైఫ్‌ని చూపించాం. గణేష్ ఈ పాత్రకు సరిగ్గా సరిపోయాడు. మంచి థ్రిల్లర్ జోనర్‌లో కథ సాగుతుంది. 'నాంది'కి వచ్చిన క్రేజ్‌ని ఈ సినిమా నిలబెడుతుందని భావిస్తున్నాను. కృష్ణ చైతన్యగారి కథని రాకేష్ ఉప్పలపాటి చక్కగా తీశారు. నటి భాగ్యశ్రీ గారి అమ్మాయి అవంతికని మా సినిమా ద్వారా హీరోయిన్‌గా పరిచయం చేయడం హ్యాపీ. మా తర్వాతి సినిమా బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా రాకేష్ ఉప్పలపాటి దర్శకత్వంలోనే ఉంటుంది'' అన్నారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
30-5-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	345	62,846
నిఫ్టీ ▲	99	18,599

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి మూడు శుక్రవారం ముగింపు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	12,976	▲	278
డోజోన్స్	33,093	▲	329
ఎఫ్‌టీఎస్ఈ 100	7,627	▲	56
డాక్స్	15,953	▼	31
షాంఘై	3,221	▲	9
నికాయ్	31,234	▲	317

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	60,012
బంగారం (99.5 స్వచ్ఛత)	59,772
వెండి (కిలో)	70,782

అజియో 'బిగ్‌బోల్డ్' సేల్

ముంబై: అజియో 'బిగ్ బోల్డ్ సేల్' పేరుతో ప్రత్యేక అమ్మకాల కార్యక్రమాన్ని చేపట్టింది. జూన్ 1 నుంచి మొదలు కానుంది. ఫ్యాషన్, లైఫ్ స్టయిల్, హోమ్, డెకార్, బ్యూటీ, జ్యువెలరీ, పర్సనల్ కేర్ ఉత్పత్తులపై మంచి డీల్స్‌ను ఆఫర్ చేస్తున్నట్టు తెలిపింది. ఎస్‌బీఐ క్రెడిట్, డెబిట్ కార్డు చెల్లింపులపై అదనంగా 10 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్టు ప్రకటించింది. ప్రత్యేకమైన డీల్స్‌లో భాగంగా ఉత్పత్తులపై 50 నుంచి 90 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నట్టు తెలిపింది. బిగ్‌బోల్డ్ సేల్‌లో అధిక కొనుగోళ్లు చేసిన కస్టమర్లకు ఐఫోన్ 14ప్రో, యాపిల్ మ్యాక్ బుక్ ఎయిర్, రూ.లక్ష విలువైన బంగారం, శామ్‌సంగ్ ఎస్23ను ఇస్తున్నట్టు పేర్కొంది. ముగ్గురు విజేతలు ఒక్కొక్కరు రూ.3 లక్షల విలువైన బంగారం గెలుచుకోవచ్చని ప్రకటించింది.

భారత ఎగుమతులకు జర్మనీ మాంద్యం అడ్డు

సీఐఐ ఎగ్జిమ్ కమిటీ చైర్మన్ సంజయ్ బుధియా



న్యూఢిల్లీ: జర్మనీలో ఆర్థిక మాంద్యంతో భారత్ నుంచి చేసే రసాయనాలు, మెషినరీ, వస్త్రాలు, ఎలక్ట్రానిక్స్ తదితర ఎగుమతులపై ప్రభావం పడుతుందని సీఐఐ ఎగ్జిమ్ కమిటీ చైర్మన్ సంజయ్ బుధియా తెలిపారు. అదే సమయంలో జర్మనీలో ఆర్థిక మాంద్యం భారత్ ఎగుమతులపై ప్రభావం చూపించడం ఇప్పుడప్పుడే కనిపించకపోవచ్చన్నారు. 2023 మొదటి మూడు నెలల్లో జర్మనీ జీడీపీ 0.3 శాతం పడిపోయింది. 2022 చివరి మూడు నెలల్లోనూ 0.5 శాతం క్షీణించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-5-2023	
విశాఖ	500-00
చిత్తూరు	543-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	72.00
29-5-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	470-00
వరంగల్	472-00
రిటైల్ ధర	5.35

ఆర్‌క్యాప్ నష్టాలు తగ్గాయ్

క్యూ4లో రూ. 1,488 కోట్లు



న్యూఢిల్లీ: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని రుణ పరిష్కార ప్రణాళికలకు చేరిన అనిల్ అంబానీ కంపెనీ రిలయన్స్ క్యాపిటల్(ఆర్‌క్యాప్) గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నష్టాలను భారీగా తగ్గించుకుంది. రూ. 1,488 కోట్ల నికర నష్టం ప్రకటించింది. అంతక్రితం ఏడాది(2021-22) ఇదే కాలంలో రూ. 4,249 కోట్ల నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం రూ. 4,770 కోట్ల నుంచి రూ. 4,436 కోట్లకు క్షీణించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 8,982 కోట్ల నుంచి రూ. 5,949 కోట్లకు దిగివచ్చాయి. 2021 నవంబర్ 29న కంపెనీ దివాలా ప్రక్రియకు చేరిన సంగతి తెలిసిందే. ఇక స్టాండెలోన్ నష్టం భారీగా పెరిగి రూ. 1,389 కోట్లను తాకింది. అంతక్రితం కేవలం రూ. 25 కోట్ల నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 5 కోట్ల నుంచి రూ. 3 కోట్లకు తగ్గింది.

లాభాల్లోకి టొరెంట్ పవర్

మార్చి త్రైమాసికంలో రూ. 484 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ విద్యుత్ దిగ్గజం టొరెంట్ పవర్ 2022-23 చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. రూ. 484 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది(2021-22) ఇదే కాలంలో రూ. 487 కోట్లకుపైగా నికర నష్టం ప్రకటించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 4 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. ఇక మొత్తం ఆదాయం సైతం భారీగా ఎగసి రూ. 6,134 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 3,841 కోట్ల టర్నోవర్ నమోదైంది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 2,165 కోట్లకు జంప్ చేసింది. 2021-22లో కేవలం రూ. 479 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 14,493 కోట్ల నుంచి రూ. 26,076 కోట్లకు ఎగసింది. ఒకేసారి లేదా దశలవారీగా మార్పిడిరహిత డిబెంచర్ల(ఎన్‌సీడీలు) జారీ ద్వారా రూ. 3,000 కోట్ల సమీకరణకు బోర్డు అనుమతించినట్లు వెల్లడించింది.

టొరెంట్ పవర్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 0.6 శాతం బలపడి రూ. 556 వద్ద ముగిసింది.

బ్యాంకింగ్ ప్రైవేటీకరణ ఆగదు

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్



ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ ప్రణాళికాబద్ధంగా అనుకున్న ప్రకారం ముందుకు సాగుతుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ''బ్యాంకు ప్రైవేటీకరణ షెడ్యూల్ ప్రకారం కొనసాగుతుంది. దానిలో ఎటువంటి మార్పు లేదు'' అని ఆమె అన్నారు. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆమె ఇక్కడ ఒక మీడియా సమావేశంలో మాట్లాడారు.

మూడో రోజూ మార్కెట్ల జోరు

- 345 పాయింట్లు అప్
- 62,846 వద్దకు సెన్సెక్స్
- నిఫ్టీ 99 పాయింట్లు ప్లస్
- గ్లోబల్ మార్కెట్ల పుష్



ముంబై: ప్రపంచ మార్కెట్ల ప్రోత్సాహంతో దేశీ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు బలపడ్డాయి. సెన్సెక్స్ 345 పాయింట్లు జంప్‌చేసి 62,846 వద్ద ముగిసింది. నిఫ్టీ 99 పాయింట్లు ఎగసి 18,599 వద్ద నిలిచింది. యూఎస్ మార్కెట్లు పుంజుకోవడం, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ప్రభావంతో ఇన్వెస్టర్లు తొలి నుంచీ కొనుగోళ్లకే ఆసక్తి చూపారు. దీంతో మార్కెట్లు ఊగిసలాడినప్పటికీ లాభాల మధ్యే కదిలాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 524 పాయింట్లు పురోగమించి 63,026కు చేరింది. వెరసి 63,000 పాయింట్ల మైలురాయిని అధిగమించింది. నిఫ్టీ సైతం 18,641 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. సానుకూల సెంటిమెంటు నేపథ్యంలో మూడు రోజుల్లో సెన్సెక్స్ 1,072 పాయింట్లు జమ చేసుకోగా.. నిఫ్టీ 313 పాయింట్లు లాభపడింది. దీంతో మార్కెట్లు చరిత్రాత్మక గరిష్టాల సమీపానికి చేరాయి. యూఎస్ రుణ పరిమితిపెంపునకు ఆదివారం సూత్రప్రాయ అనుమతి లభించడంతో ఇన్వెస్టర్లకు జోష్ వచ్చినట్లు స్టాక్ నిపుణులు పేర్కొన్నారు.

ఎంఅండ్‌ఎం జూమ్

ఎన్‌ఎస్‌ఈలో కన్స్యూమర్ డ్యురబుల్స్, మెటల్, బ్యాంకింగ్, ఆటో, రియల్టీ 0.6 శాతం స్థాయిలో బలపడితే.. ఆయిల్-గ్యాస్, ఐటీ 0.4 శాతం స్థాయిలో డీలా పడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో క్యూ4 ఫలితాల అండతో ఎంఅండ్‌ఎం 3.4 శాతం ఎగసింది. ఇతర బ్లూచిప్స్‌లో టైటాన్, కోల్ ఇండియా, టాటా స్టీల్, అల్ట్రాటెక్, ఎస్‌బీఐ లైఫ్, గ్రాసిమ్, హిందాల్కో, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, ఎస్‌బీఐ, అదానీ పోర్ట్స్, ఇండస్‌ఇండ్, ఐటీసీ 2.6-1 శాతం మధ్య లాభపడ్డాయి. అయితే ఓఎన్‌జీసీ 3 శాతం పతనంకాగా.. దివీస్, పవర్‌గ్రిడ్, హెచ్‌సీఎల్ టెక్, మారుతీ, బీపీసీఎల్, బ్రిటానియా, అదానీ ఎంటర్, విప్రో 1.2-0.4 శాతం మధ్య క్షీణించాయి.

చిన్న షేర్లు

బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 0.3 శాతం చొప్పున బలపడ్డాయి. ట్రేడైన షేర్లలో 1,921 లాభపడగా.. 1,715 నష్టపోయాయి. ఇటీవల దేశీ స్టాక్స్‌పట్ల ఆసక్తి చూపుతున్న విదేశీ ఇన్వెస్టర్లు తాజాగా నగదు విభాగంలో రూ. 1,758 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. దేశీ ఫండ్స్ సైతం రూ. 854 కోట్ల విలువైన స్టాక్స్ సొంతం చేసుకున్నాయి. కాగా.. లండన్ మార్కెట్లో బ్రెంట్ చమురు బ్యారల్ 0.2 శాతం నీరసించి 76.82 డాలర్లకు చేరింది. డాలరుతో మారకంలో రూపాయి స్వల్పంగా 4 పైసలు తగ్గి 82.63కు చేరింది.


ఐసీఐసీఐ లంబార్డ్‌లో వాటా పెంపు

ప్రైవేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ బీమా రంగ అనుబంధ కంపెనీ ఐసీఐసీఐ లంబార్డ్ జనరల్‌లో వాటాను పెంచుకోనుంది. రానున్న 16 నెలల్లో 4 శాతం వాటా కొనుగోలు ప్రణాళికకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. ఐసీఐసీఐ లంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో బ్యాంక్‌కు 48.02 శాతం వాటా ఉంది. కాగా.. ప్రస్తుత షేరు ధర ప్రకారం 4 శాతం వాటా కొనుగోలుకి ఐసీఐసీఐ బ్యాంక్ రూ. 2,352 కోట్లకుపైగా వెచ్చించవలసి ఉంటుంది.

ఈ వార్తల నేపథ్యంలో ఐసీఐసీఐ లంబార్డ్ షేరు బీఎస్‌ఈలో 8.2 శాతం జంప్‌చేసి రూ. 1,190 వద్ద ముగిసింది.

బ్యాంకుల్లో గవర్నెన్స్ లోపాలు

- ఆర్‌బీఐ గవర్నర్ దాస్ వెల్లడి
- బోర్డులు, యాజమాన్యాలు జాగ్రత్త వహించాలని సూచన



ముంబై: కార్పొరేట్ గవర్నెన్స్‌కి సంబంధించి నిర్దిష్ట మార్గదర్శకాలు ఉన్నప్పటికీ కొన్ని బ్యాంకుల్లో వాటి అమలు తీరులో మాత్రం లోపాలు ఉన్నట్లు తెలిందని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. వాటిని అధిగమించగలిగామని, లేకపోతే ఎంతో కొంత ఒడిదుడుకులు తలెత్తేవని ఆయన పేర్కొన్నారు. 'కార్పొరేట్ గవర్నెన్స్‌పై స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ, బ్యాంకింగ్ రంగంలో ఒడిదుడుకులకు దారి తీసేలా కొన్ని బ్యాంకుల్లో గవర్నెన్స్‌పరమైన లోపాలు బైటపడటం ఆందోళనకరమైన విషయం' అని బ్యాంక్ బోర్డుల డైరెక్టర్లతో సోమవారం జరిగిన సమావేశంలో దాస్ పేర్కొన్నారు. బ్యాంకుల బోర్డులు, యాజమాన్యాలు ఇలాంటి లోపాలు తలెత్తకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

స్మార్ట్ మోసాలు..

మొండిపద్దులపరమైన ఒత్తిళ్లను దాచి పెట్టేందుకు, కృత్రిమంగా ఆర్థిక పనితీరును గొప్పగా చూపించుకునేందుకు బ్యాంకులు 'స్మార్ట్ అకౌంటింగ్' విధానాలను ఆశ్రయించడాన్ని దాస్ తీవ్రంగా తప్పుపట్టారు. ఇందుకోసం బ్యాంకులు పాటిస్తున్న విధానాలను ప్రస్తావించారు. ఖాతాల్లో మొండిబాకీల భారాన్ని తగ్గించుకునేందుకు ఒక బ్యాంకు మరొక బ్యాంకుకు సందర్భాన్ని బట్టి తమ రుణాలను విక్రయించి, తిరిగి బైబ్యాక్ చేయడం .. రుణగ్రహీత చెల్లించాల్సిన రీపేమెంట్లను అంతర్గతంగా ఖాతాల్లో సర్దుబాటు చేయడంలాంటివి వీటిలో ఉన్నట్లు దాస్ పేర్కొన్నారు.

డిజిటలైజేషన్, మొండిబకాయిలపై దృష్టి

బ్యాంకింగ్‌కు ఆర్థిక శాఖ సహాయమంత్రి కరాద్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ: బ్యాంకులు డిజిటలైజేషన్‌పై దృష్టి సారించాలని అలాగే ఒత్తిడితో కూడిన రుణాలపై (మొండిబకాయిలకు దారితీసే అవకాశమున్న ఖాతాలు) నిఘా ఉంచాలని ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కే కరాద్ సూచించారు. ఆర్థిక అక్షరాస్యత, అన్ని వర్గాలను ఫైనాన్షియల్ చట్రంలోకి తీసుకురావడంపై కూడా బ్యాంకులు దృష్టి పెట్టాలన్నారు. ఈఎస్‌ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ జోనల్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంకా ఆయన ఏమన్నారంటే, బ్యాంకులు నిరర్థక ఆస్తులను సకాలంలో గుర్తించాలి. బ్యాంకింగ్ వ్యవస్థ పటిష్ఠంగా ఉండేలా మొండిబకాయిలకు తగిన కేటాయింపులు (ప్రొవిజనింగ్స్) చేయాలి. టెక్నాలజీ వినియోగంపై పూర్తి స్థాయి దృష్టి సారింపు అవసరం. భవిష్యత్తు అంతా దీనిపైనే ఆధారపడి ఉంటుంది. డిజిటల్ బ్యాంకింగ్‌ను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

విద్య, ఉద్యోగ సమాచారం

డీఆర్‌డీఓలో 181 సైంటిస్ట్ ఉద్యోగాలు

భారత రక్షణ పరిశోధన సంస్థ (డీఆర్‌డీఓ).. సైంటిస్టు ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 181
» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కెమికల్ ఇంజనీరింగ్, ఏరోనాటికల్ ఇంజనీరింగ్, మ్యాథమేటిక్స్, సివిల్ ఇంజనీరింగ్ తదితరాలు.
» **వేతనం:** లెవెల్-10 పే మ్యాట్రిక్స్(రూ.56,100) లభిస్తుంది. అంటే.. మెట్రో నగరాల్లో నెలకు రూ.ఒక లక్షల వరకూ చేతికి అందుతుంది.
» **అర్హతలు:** పోస్టులను అనుసరించి బీటెక్/బీఈ, పీజీలో ఫస్ట్ క్లాసులో ఉత్తీర్ణత సాధించాలి. గేట్ పరీక్షలో సాధించిన స్కోరుకు ప్రాధాన్యత ఉంటుంది. చివరి సెమిస్టర్ విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు.
» **వయసు:** జనరల్ అభ్యర్థులు 28 ఏళ్లలోపు ఉండాలి(బీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది).
» **ఎంపిక విధానం:** అర్హులైన అభ్యర్థులను గేట్ స్కోరు ఆధారంగా 1:10 నిష్పత్తిలో షార్ట్ లిస్ట్ చేస్తారు. అనంతరం ఇంటర్వ్యూ ఉంటుంది.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి
» **దరఖాస్తు చివరి తేది:** ఉద్యోగ ప్రకటన వెలువడిన 21 రోజులలోపు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **వెబ్‌సైట్:** www.rac.gov.in

ఐడీబీఐ బ్యాంక్‌లో 1036 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్).. ఒప్పంద ప్రాతిపదికన 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి దేశవ్యాప్తంగా ఉన్న ఐడీబీఐ శాఖల్లో ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1036(ఎస్సీ-160, ఎస్టీ-67, ఓబీసీ-255, ఈడబ్ల్యూఎస్ -103, యూఆర్-451).
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.05.2023 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.29,000 నుంచి రూ.34,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ప్రీ రిక్రూట్‌మెంట్ మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.06.2023.
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:** 02.07.2023.
» **వెబ్‌సైట్:** www.idbibank.in

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో 548 అప్రెంటిస్‌లు

బిలాస్‌పూర్‌లోని సౌత్‌ఈస్ట్ సెంట్రల్ రైల్వే(ఎస్ఈసీఆర్)..పర్సనల్ డిపార్ట్‌మెంట్, డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం.. అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 548
» **కేటగిరీ వారీగా ఖాళీలు:** అన్ రిజర్వ్‌డ్-215, ఈడబ్ల్యూఎస్-59, ఓబీసీ-148, ఎస్సీ-85, ఎస్టీ-41.
» **విభాగాలు:** ఫిట్టర్, పెయింటర్, ప్లంబర్, మెకానిక్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్స్‌మ్యాన్, టర్నర్, వైర్‌మ్యాన్, గ్యాస్‌కట్టర్, ఫోటోగ్రాఫర్ తదితరాలు.
» **అర్హత:** పదో తరగతితోపాటు సంబంధిత స్పెషలైజేషన్‌ను అనుసరించి 10+2/ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 15 నుంచి 24 ఏళ్ల ఉండాలి.
» **అప్రెంటిస్‌షిప్ కాలవ్యవధి:** ఒక ఏడాది.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**03.06.2023
» **వెబ్‌సైట్:** www.secr.indianrailways.gov.in

జీజీహెచ్, నిజామాబాద్‌లో పారా మెడికల్ పోస్టులు

నిజామాబాద్‌లోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, సూపరింటెండెంట్ కార్యాలయం.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన పారామెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
» **పోస్టుల వివరాలు:** బయో కెమిస్ట్-01, రేడియాలజిస్ట్-01, ల్యాబ్ మేనేజర్-01, రేడియోగ్రాఫర్(మేల్)-01.
» **అర్హత:** డిప్లొమా, బీఎస్సీ, ఎంబీబీఎస్, ఎండీ, డీఎన్‌బీ, డీఎంఐటీ.
» **వేతనం:** నెలకు బయోకెమిస్ట్/రేడియాలజిస్ట్‌కు రూ.1,00,000, ఇతర పోస్టులకు రూ.30,000.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును వ్యక్తిగతంగా లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా సూపరింటెండెంట్ కార్యాలయం, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, నిజామాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 03.06.2023.
» **వెబ్‌సైట్:** www.nizamabad.telangana.gov.in

ఫైన్ ఆర్ట్స్‌తో కలర్‌ఫుల్ కెరీర్

కొన్ని రంగాల్లో సృజనాత్మకత ఉంటే.. ఆకాశమే హద్దు. క్రియేటివిటీతో కెరీర్‌లో దూసుకుపోవచ్చు. వ్యక్తిగత సృజనాత్మకతను సానపెట్టే కోర్సులు కొన్ని ఉన్నాయి. అవే.. ఫైన్ ఆర్ట్స్ కోర్సులు!! వీటిని బ్యాచిలర్ స్థాయిలో వివిధ సంస్థలు అందిస్తున్నాయి. వాటిలో ముఖ్యమైనది హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(జేఎన్‌ఏఎఫ్‌ఏయూ). ఈ విద్యాసంస్థ ఫైన్స్ ఆర్ట్స్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ వివరాలు..

» ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ కోర్సుల్లో ప్రవేశాలు
» ప్రకటన విడుదల చేసిన జేఎన్‌ఏఎఫ్‌ఏయూ

హైదరాబాద్‌లోని జేఎన్‌ఏఎఫ్‌ఏయూ.. ఫైన్ ఆర్ట్స్ కోర్సులను అందిస్తోంది. బ్యాచిలర్ స్థాయిలో బీఎఫ్‌ఏలో పెయింటింగ్, అప్లయిడ్ ఆర్ట్స్, స్కల్ప్చర్, ఫోటోగ్రఫీ, యానిమేషన్ కోర్సుల్లో ఈ యూనివర్సిటీ ప్రవేశాలు కల్పిస్తోంది. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(ఎఫ్‌ఏడీఈఈ)ని నిర్వహించనుంది. ఈ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా అడ్మిషన్ కల్పిస్తారు. ఇంటర్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష ఇలా

- అప్లయిడ్ ఆర్ట్స్, పెయింటింగ్, స్కల్ప్చర్ అండ్ యానిమేషన్ కోర్సులకు పేపర్-ఏలో మెమొరీ, డ్రాయింగ్, కలరింగ్ విభాగాల్లో 100 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ఏదైనా అంశాన్ని ఇస్తారు. దానికి దృశ్య రూపాన్ని ఇవ్వాలి. పరీక్ష సమయం 90 నిమిషాలు.
- పేపర్-బీ ఆబ్జెక్టివ్ తరహాలో 50 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం 50 నిమిషాలు. ఇందులో జీకే, కరెంట్ అఫైర్స్-15 ప్రశ్నలు, ఇంగ్లిష్-15 ప్రశ్నలు, జనరల్ ఆర్ట్ ఓరియంటెడ్ 20 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు.
- పేపర్ సీ ఆబ్జెక్టివ్ డ్రాయింగ్‌లో 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం 90 నిమిషాలు. ఇందులో భాగంగా ఏదైనా వస్తువు లేదా బొమ్మ చూపుతారు. ఆ దృశ్యాన్ని పెన్సిల్‌తో గీసి,దాని చుట్టూ పరిసరాలను ఊహించి వర్ణనాత్మక చిత్రాన్ని రూపొందించాలి. ఇందులో చిత్ర నైపుణ్యాలు, ఊహ, పరిజ్ఞానానికి ప్రాధాన్యం ఉంటుంది.



ఫోటోగ్రఫీ కోర్సుకు

కంపోజిషన్ అండ్ విజువల్ కమ్యూనికేషన్స్ పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 90 నిమిషాలు. ఇందులో డ్రాయింగ్, కంపోజిషన్ నైపుణ్యాలు పరిశీలిస్తారు. పెన్సిల్‌తో ఇచ్చిన చిత్రాలకు షేడ్‌లు ఇవ్వాలి. అక్కడున్న చిత్రాలను క్రమ పద్ధతిలో అమర్చాలి. ఏదైనా అసంపూర్ణ దృశ్యం ఇచ్చి.. దాని చుట్టు ఉండే అవసరమైన ఇతర అంశాలను అందులో చేర్చి తీర్చిదిద్దమంటారు. వీటన్నింటికీ పరీక్షలో ప్రాధాన్యం ఉంటుంది. మరో ఆబ్జెక్టివ్ టైప్ పేపర్ 50 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం 50 నిమిషాలు. ఇందులో జీకే, కరెంట్ అఫైర్స్ 15, ఇంగ్లిష్ 15, జనరల్ ఆర్ట్ ఓరియంటెడ్ 20 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు.

ఇంటీరియర్ డిజైన్‌లోనూ

ఈ పరీక్షను 200 మార్కులకు 3 గంటల వ్యవధితో నిర్వహిస్తారు. ఇందులో జీకే, కరెంట్ అఫైర్స్-20, కమ్యూనికేషన్ స్కిల్స్-50, ఇలస్ట్రేటివ్, అనలిటికల్ అండ్ డిజైన్ ఎబిలిటీ 50, మెమొరీ డ్రాయింగ్-30, కలర్ కో ఆర్డినేషన్ 30 మార్కులకు ప్రశ్నలు వస్తాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు.

ఉద్యోగావకాశాలు

ఆయా ఫైన్ ఆర్ట్స్ కోర్సుల ఉత్తీర్ణులకు నైపుణ్యాలుంటే.. విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. ఆర్ట్ స్టూడియోలు, అడ్వర్టైజింగ్ కంపెనీలు, గ్రాఫిక్, ప్రింటింగ్, పబ్లిషింగ్, ఫ్యాషన్ సంస్థలు, ఎలక్ట్రానిక్, టెక్స్‌టైల్ పరిశ్రమ,ఫిల్మ్ అండ్ థియేటర్,మల్టీమీడియా, యానిమేషన్..తదితర సంస్థలో ఉద్యోగాలు ఇస్తున్నాయి.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 05.06.2023
- రూ.200 లేట్ ఫీజుతో దరఖాస్తు చివరి తేదీ: 12.06.2023
- వెబ్‌సైట్: https://jnafauadmissions.com

పదితోనే పోస్టల్ కొలువు

ఆఫ్టర్ టెన్త్

తపాల విభాగంలో పోస్టుల భర్తీకి గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్) ప్రకటన విడుదలైంది. దీనిద్వారా ద్వారా దేశవ్యాప్తంగా 12,828 జీడీఎస్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎలాంటి రాత పరీక్ష లేకుండానే పదో తరగతిలో సాధించిన మెరిట్ మార్కుల ఆధారంగా నియామకం చేపట్టనున్నారు. వీటికి ఎంపికైన వారు బ్రాంచ్ పోస్టు మాస్టర్ (బీపీఎం), అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్(ఏబీపీఎం) గా విధులు నిర్వర్తిస్తారు.

- మొత్తం పోస్టుల సంఖ్య: 12,828
- తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు: ఆంధ్రప్రదేశ్-118, తెలంగాణలో 96.

అర్హతలు

- పదోతరగతి ఉత్తీర్ణత ఉండాలి. పదో తరగతిలో మ్యాథ్స్, ఇంగ్లిష్‌తోపాటు స్థానిక భాష చదివి ఉండటం తప్పనిసరి. కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు సైకిల్ తొక్కడం వచ్చి ఉండాలి.

» 12,828 జీడీఎస్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక

- **వయసు:** జూన్ 11, 2023 నాటికి 18-40 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనాలు

- **బ్రాంచ్ పోస్టు మాస్టర్(బీపీఎం):** ఈ పోస్టులకు ఎంపికైన వారికి రూ.12000 మూలవేతనంతో పాటు రూ.5040 డీఏ కూడా లభిస్తుంది. అంటే.. మొదటి నెల నుంచే వీరు రూ.17,040 వేతనం అందుకోవచ్చు. దీంతో పాటు ఇతర ప్రోత్సాహకాలు ఉంటాయి. ప్రతి ఆరు నెలలకు ఒక డీఏ, ఏటా ఇంక్రిమెంట్ వేతనంలో కలుస్తుంది.
- **అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్(ఏబీపీఎం):** ఈ పోస్టులకు ఎంపికైన వారికి రూ.10,000 మూలవేతనంతోపాటు రూ.4200 డీఏ అందుతుంది. వీరు విధుల్లో చేరిన మొదటి నెల నుంచి రూ.14200 వేతనం, ఇతర ప్రోత్సాహకాలు పొందవచ్చు. వీటితో పాటు ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంకుకు సంబంధించిన సేవలకు ప్రత్యేకంగా ఇన్సెంటివ్ రూపంలో బీపీఎం/ఏబీపీఎంలకు ప్రోత్సాహం అందిస్తారు.

ఆ సేవల విలువ ప్రకారం ఇన్సెంటివ్ చెల్లిస్తారు. స్వల్పమొత్తంలో హెచ్‌ఆర్‌ఏ కూడా దక్కుతుంది. వీరు రోజువారీ విధులు నిర్వర్తించడానికి ల్యాప్‌టాప్ /కంప్యూటర్/స్మార్ట్‌ఫోన్ లాంటివి పోస్టల్ శాఖ సమకూరుస్తుంది.

ఎంపిక విధానం

- అభ్యర్థులు పదోతరగతిలో సాధించిన మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు. ప్రకటనలో ఖాళీలు ఉన్న బ్రాంచీలు, ఏ హోదాలో ఖాళీ ఉంది. రిజర్వ్‌డ్/అన్ రిజర్వ్‌డ్ వివరాలు పేర్కొన్నారు. వాటిని అభ్యర్థులు పరిశీలించి, తమ ప్రాధాన్యం ప్రకారం ఆప్షన్లు ఇవ్వాలి. మొదటి ప్రాధాన్యం ఇస్తే ఆప్షన్-1, తర్వాత దానికి ఆప్షన్-2.. ఇలా నింపాలి.
- **కటాఫ్ అంచనా:** గత రిక్రూట్ విధానాన్ని పరిశీలిస్తే.. ఏపీ, తెలంగాణలో జనరల్, ఓబీసీ విభాగాల్లో సుమారు 95 శాతం, ఎస్సీ, ఎస్టీలైతే 93 శాతం మార్కులు పొందిన వారికి అవకాశం దక్కింది. పోస్టుల సంఖ్యను బట్టి కటాఫ్‌లో హెచ్చుతగ్గులుంటాయి.

విధులు ఇలా

బ్రాంచ్ పోస్టు మాస్టర్ (బీపీఎం)

వీరు బ్రాంచ్ కార్యకలాపాలను పర్యవేక్షించాలి. పోస్టల్ విధులతోపాటు ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకు వ్యవహారాలూ చూసుకోవాలి. రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ లావాదేవీలు, రోజువారీ కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడటం, ఉత్తరాల పంపిణీ జరిగేలా పర్యవేక్షించాలి. పోస్టల్‌కు సంబంధించిన మార్కెటింగ్ వ్యవహారాలూ చక్కబెట్టాలి. బృందనాయకుడిగా సంబంధిత బ్రాంచ్‌ను నడిపించాలి. పోస్టల్ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్(ఏబీపీఎం)

ఈ పోస్టులకు ఎంపికైన వారు స్టాంపులు/స్టేషనరీ అమ్మకం, ఉత్తరాల పంపిణీ, ఇండియన్ పోస్టు పేమెంట్స్ బ్యాంకుకు సంబంధించిన డిపాజిట్లు, పేమెంట్లు, పోస్టల్‌కు సంబంధించిన ఇతర వ్యవహారాలు చక్కబెట్టాలి. బ్రాంచ్ పోస్టు మాస్టర్ చెప్పిన పనులు పూర్తిచేయాలి. తపాలా స్కీముల గురించి ప్రజల్లో అవగాహన కలిగించాలి.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తులకు చివరి తేదీ: జూన్ 11, 2023
- వెబ్‌సైట్: https://indiapostgdsonline.gov.in


క్లుప్తంగా...

పరిశోధనలకు సింగపూర్ వర్సిటీ సహకారం

విద్యా మంత్రి సబితతో నాన్యాంగ్ టెక్నలాజికల్ వర్సిటీ ప్రతినిధుల భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలు విద్య, పరిశోధన రంగాల్లో సింగపూర్‌కు చెందిన నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ (ఎన్‌టీయూ) సహకారం తీసుకొనే దిశగా అడుగులు పడనున్నాయి. సింగపూర్‌లో ఉన్న అపార అవకాశాలతోపాటు భారతీయ విశ్వవిద్యాలయాలు, తెలంగాణ విశ్వవిద్యాలయాల్లోని పరిశోధన అవకాశాలపై చర్చించేందుకు నాన్యాంగ్ వర్సిటీ ప్రతినిధులు సోమవారం సచివాలయంలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో సమావేశమయ్యారు. ఎన్‌టీయూ ప్రత్యేకతలు, వర్సిటీ ఆధ్వర్యంలో తాజాగా చేపట్టిన పరిశోధనాభివృద్ధి కార్యకలాపాలను వివరించారు. రాష్ట్రంలోని వర్సిటీలను బలోపేతం చేయడంతో పాటు ఉమ్మడి ప్రాజెక్టులు చేపట్టేందుకు ఎన్‌టీయూ నుంచి అవసరమైన సహకారాన్ని అందిస్తామని చెప్పారు. మంత్రి సబిత మాట్లాడుతూ లైఫ్ సైన్సెస్, ఐటీ, బయోటెక్నాలజీ, ఫార్మా తదితర రంగాలకు హబ్‌గా అవతరించిన తెలంగాణ రాష్ట్రం... ఎడ్యుకేషన్, ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, పరిశోధన రంగాల్లో ముందంజలో ఉందని చెప్పారు. నాన్యాంగ్ వర్సిటీ ప్రతినిధి బృందం జూలైలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనుంది.

వారికి 12 నెలల జీతం



సాక్షి, హైదరాబాద్: గిరిజన సంక్షేమ శాఖ కమిషనరేట్ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయుల వేతన చెల్లింపులపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఈ పాఠశాలల్లో పనిచేస్తున్నకాంట్రాక్టు టీచర్లకు 10.5 నెలల వేతనాన్ని మాత్రమే ఇస్తుండగా.. తాజాగా 12 నెలల వేతనాన్ని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వేతనాల విడుదలపై హర్షం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉపాధ్యాయులకు 12 నెలల వేతనాలు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీచేయడంపై పీఆర్‌టీయూటీఎస్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేసినందుకు సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్‌కు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్ ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

బీటెక్ అభ్యర్థులకు టీజీటీ అవకాశం ఇవ్వండి: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: టీజీటీ మ్యాథమేటిక్స్, సైన్స్ పోస్టులకు బీటెక్ పూర్తిచేసిన అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. బీఎస్సీ మ్యాథమేటిక్స్ అభ్యర్థులతో సమానంగా బీటెక్ వారిని చూడాలని హైకోర్టు మరోసారి స్పష్టం చేసింది. హైకోర్టు డివిజన్ బెంచ్ గతంలో ఇదే అంశంపై తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 5న ఇచ్చిన టీజీటీ మ్యాథమేటిక్స్ పోస్టుల నోటిఫికేషన్‌లో తమనూ పరిగణనలోకి తీసుకోవాలని పలువురు బీటెక్ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్ల తరఫున వాదనలు విన్న జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం గత తీర్పును అమలు చేయాలని గురుకుల విద్యాసంస్థల రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఆదేశాలు జారీచేసింది.

సివిల్స్ ర్యాంకర్లకు సన్మానం

సాక్షి, హైదరాబాద్: పేదలకు నేరుగా సేవ చేసే అవకాశం సివిల్ సర్వెంట్లకే దక్కుతుందని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సివిల్స్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి మెరుగైన ర్యాంకులు సాధించిన నిధి (110వ ర్యాంకు), ఆర్.నవీన్ (550), దీప్తి చౌహాన్ (630), సాయినాథ్ (742), అక్షయ్ (759)లను సచివాలయంలోని తన చాంబరులో గంగుల సోమవారం సన్మానించారు. ఉత్తమ ర్యాంకులు సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని, ఇదే స్ఫూర్తితో సమాజానికి సేవ చేయాలని మంత్రి ఆకాంక్షించారు.

'బీసీ జూనియర్ కాలేజీ' ప్రవేశ పరీక్ష ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల సంస్థల సొసైటీ పరిధిలోని జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం అడ్మిషన్ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. సోమవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ సచివాలయంలోని తన చాంబరులో ఫలితాలను విడుదల చేశారు. అభ్యర్థులు బీసీ గురుకుల సొసైటీ వెబ్‌సైట్ నుంచి ఫలితాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎంపీసీలో 150 మార్కులకుగాను 122 మార్కులతో మొదటి స్థానంలో సిద్దిపేట జిల్లాకు చెందిన పి.జ్యోత్స్న, బైపీసీలో నల్లగొండ జిల్లాకు చెందిన పి.శ్రీవల్లి 108 మార్కులతో, సీఈసీలో పెద్దపల్లి జిల్లాకు చెందిన కె.సాయి సంహిత 107 మార్కులతో, ఎంఈసీలో మేడ్చల్ జిల్లాకు చెందిన ఎ.అర్చన 109 మార్కులతో అగ్ర స్థానంలో నిలిచారు. జూన్ 10లోగా విద్యార్థులు నిర్దేశించిన కాలేజీలో అడ్మిషన్ తీసుకోవాలని గంగుల చెప్పారు.



బ్యాక్ వాటర్ చేప..

భలే మజా..!

వైజాగ్ కాలనీ టు బంగ్లాదేశ్ వరకు ఎగుమతి

- సహజసిద్ధంగా ఎదిగే చేపలు కావడంతో మార్కెట్లో మంచి డిమాండ్
- సీజన్‌లో ప్రతిరోజూ 40 క్వింటాళ్ల వరకు ఎగుమతి
- ఆ ఊళ్లో అందరి వృత్తి చేపల వేటే..
- సాగర్ నిర్మాణ సమయంలో వచ్చి..ఇక్కడే స్థిరపడి..

సాక్షి ప్రతినిధి, నల్లగొండ

ఆహా ఏమి రుచి.. తినరా మైమరిచి.. అన్నట్లుగా ఉంటుంది నాగార్జునసాగర్ ప్రాజెక్టు వెనుక జలాల్లోని చేపల రుచి. నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలోని నేరెడుగొమ్ము మండలం వైజాగ్ కాలనీ వద్ద సాగర్ వెనుక జలాల్లో (బ్యాక్ వాటర్) సహజసిద్ధంగా ఎదిగే ఈ చేపలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దీంతో ఇక్కడి చేపలు దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేస్తారు. చేపలకే కాదు పర్యాటకులకూ ప్రత్యేకమైనదీ ప్రాంతం. ఎటుచూసినా కొండలు.. దట్టమైన అడవులు.. సందడి చేసే పక్షులు.. అడవిని చీల్చుకుంటూ సుడులు తిరుగుతూ ప్రవహించే కృష్ణమ్మ జలసవ్వడులు.. గంగమ్మే శివలింగాన్ని అభిషేకించే అద్భుత దృశ్యం.. మనస్సును ఇట్టే కట్టి పడేసే ప్రకృతి సోయగాలు వైజాగ్ కాలనీ సొంతం. చేపల వేటే ప్రధాన వృత్తిగా, పర్యాటకులను కృష్ణమ్మ ఒడిలో పడవల్లో జోలలాడించడమే ప్రవృత్తిగా జీవనం వెళ్లదీస్తున్నారు అక్కడి ప్రజలు. కృష్ణమ్మ మధ్యలో ఉండే చిన్న చిన్న ద్వీపాల్లో సేద తీరేందుకు వచ్చే పర్యాటకులతో ఆ ప్రాంతం నిత్యం కళకళలాడుతోంది.

సీజన్‌లో రోజుకు 40 క్వింటాళ్ల ఎగుమతి

సాధారణంగా చెరువులు, కుంటల్లో చేపలకు దాణా వేసి పెంచుతుంటారు. అయితే సాగర్ వెనుక జలాల్లో సహజ సిద్ధంగా ఎదిగే ఈ చేపలు రుచికరంగా ఉంటుండడంతో వీటిని అధికంగా ఇష్టపడుతుంటారు. ఈ కారణంగానే ఇక్కడికి వచ్చే పర్యాటకులు ఇక్కడి ప్రకృతిని ఆస్వాదించడంతో పాటు కచ్చితంగా చేపలు తిని వెళ్తుంటారు. అంతేకాదు పెద్ద మొత్తంలో ఇక్కడి నుంచి చేపలను గుంటూరు, కోల్‌కతా.. అక్కడి నుంచి బంగ్లాదేశ్‌కు, కేరళ, తమిళనాడు, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. వర్షాకాలంలో (సీజన్) ప్రతిరోజూ 40 క్వింటాళ్ల వరకు ఎగుమతి అవుతుండగా, సాధారణ సమయాల్లో 10 నుంచి 20 క్వింటాళ్లు ఎగుమతి చేస్తారు.

సాగర్ నిర్మాణ సమయంలో వచ్చి..

నాగార్జునసాగర్ నిర్మాణ సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లా నుంచి తొలుత 10 కుటుంబాలు వలస వచ్చాయి. క్రమంగా వలసలు పెరిగాయి. నక్కనపల్లి మండలం, పెద్ద తిరునాళ్ల గ్రామం, బంగారుపాలెం, పోలవరం రాజిపేట గ్రామాల నుంచి మత్స్యకారులు ఇక్కడికి వచ్చి స్థిరపడ్డారు. డ్యామ్ నిర్మాణ పనుల్లో పాల్గొన్న వీరంతా ఆ తర్వాత కూడా చేపలు పట్టడం ద్వారా ఉపాధి పొందుతూ ఇక్కడే ఉండిపోయారు. సాగర్ డ్యాం నిర్మించిన తర్వాతా వివిధ గ్రామాల నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడిన వారు ఉన్నారు. దీంతో ఈ ప్రాంతం వైజాగ్ కాలనీగా పేరుపడింది. వ్యవసాయానికి, ఇతర పనులకు ఇక్కడ అవకాశం లేకపోవడంతో అంతా పూర్తిగా చేపల వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వారి జీవనోపాధి కోసం వైజాగ్ కాలనీ, సమీపంలోని పెద్దమునిగల్, కాచరాజుపల్లి సాగర్ బ్యాక్ వాటర్‌లో మత్స్య శాఖ ఏటా 15 లక్షల చేప పిల్లలను వదులుతుంది. అత్యధిక మోతాదులో బొచ్చలు, రవ్వలు, పాంప్లెట్లు, జెల్లలు, పాము చేపలు, కొర్రమీను, దొమ్మలు, వాలుగలు, నార జల్లలు, చుక్క పాంప్లెట్లు ఇలా అనేక రకాల చేపలు లభిస్తాయి. చిన్న, పెద్ద చేపలను పెద్దమొత్తంలో ఎండబెట్టి కూడా ఎగుమతి చేస్తారు.



పడవల్లో ప్రకృతిని ఆస్వాదిస్తూ..

వైజాగ్ కాలనీ పరిసరాల్లోని ఏలేశ్వరం మల్లయ్య గట్టు వరకు పర్యాటకులు మరబోట్లలో ప్రకృతిని ఆస్వాదిస్తూ 2 గంటల పాటు ప్రయాణం చేస్తారు. శివరాత్రి సమయంలో ఎక్కువ మంది భక్తులు అక్కడికి వెళతారు. దేవరచర్లలోని మునిస్వామి దేవాలయానికీ అంతే. ఈ దేవాలయం గర్భగుడిలోని శివలింగాన్ని గుట్టల నుంచి జాలువారే నీటిధార నిత్యం అభిషేకిస్తుంటుంది. హర హర మల్లన్న అనే శబ్దంతో నీటి బింధువులు పడుతుంటాయని భక్తుల నమ్మకం.

ఎకో టూరిజం అభివృద్ధి చేస్తే మరింత ఆదరణ

వైజాగ్ కాలనీలో ఏకో టూరిజం అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అక్కడికి వచ్చే పర్యాటకులు విడిది చేసేందుకు కాటేజీలు నిర్మించి ఆ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఆరు నెలల కిందట శంకుస్థాపన చేసింది. 15 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. కానీ పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

చేపలు ఎగుమతి చేస్తున్నా..

ఇక్కడి నుంచి హైదరాబాద్, కేరళ, గుంటూరు, ఆంధ్రా ప్రాంతాలకు చేపలు ఎగుమతి చేస్తా. ఇతర రాష్ట్రాలు, బంగ్లాదేశ్‌కు కూడా వెళతాయి.



నిరీక్షణ, వైజాగ్ కాలనీ

ఇక్కడి చేపలకు రుచి ఎక్కువ

చేపలే జీవనాధారంగా బతుకుతున్నాం. ఇక్కడికి వచ్చే వారికి నోరూరించే చేపలు వండి పెడతాం. బొచ్చలతో పాటు మరికొన్ని చేపలు బాగా రుచిగా ఉంటాయి.



– కోదండ, వైజాగ్ కాలనీ

వెలుగులోకి ఇన్విజిలేటర్!

- టీఎస్‌పీఎస్సీ లీకేజ్ కేసులో కొత్త కోణం
- ఆధునిక పరికరాలతో కాపీయింగ్
- విద్యుత్ శాఖ డీఈ కీలక పాత్ర

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించిన పోటీ పరీక్షల ప్రశ్న పత్రాల లీకేజ్ కేసులో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. క్వశ్చన్ పేపర్లు బయటకు పంపటంలో ఓ ఇన్విజిలేటర్ పాత్ర వెలుగులోకి వచ్చింది. మరోవైపు ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు సోమవారం మరో నలుగురిని కటకటాల్లోకి పంపారు. దీంతో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య 50కి, మొత్తం నిందితుల సంఖ్య 51కి చేరింది.


గదులు తీసుకుని, సిద్ధం చేసి..

ఒకప్పుడు టీఎస్‌పీఎస్సీలో పని చేసిన సురేష్ (గతంలో అరెస్టు అయ్యాడు) ద్వారా డీఏఓ ప్రశ్నపత్రాలు పూల రవికిషోర్‌తో (ఇటీవల అరెస్టు అయ్యాడు) పాటు వరంగల్‌లో విద్యుత్ శాఖ డీఈగా పని చేస్తున్న ఇతడి సోదరుడు పూల రమేష్‌కు (ఆదివారం అరెస్టు అయ్యాడు) అందాయి. హైదరాబాద్, నల్లగొండల్లో పలువురు అభ్యర్థులను ఏర్పాటు చేసుకున్న రమేష్ వారి కోసం కొన్ని రూములు అద్దెకు తీసుకున్నాడు. కొత్తపేట, వరంగల్, సైదాబాద్ సహా ఐదు చోట్ల రూములు ఏర్పాటు చేసుకుని ఒక్కో దాంట్లో 10 నుంచి 15 మంది అభ్యర్థులను ఉంచి తన వద్ద ఉన్న ప్రశ్నపత్రంతో వారిని సిద్ధం చేశాడు. ఏఈఈ పరీక్ష పత్రం తన వద్ద లేకపోయినప్పటికీ ఏడుగురు అభ్యర్థులతో మాల్ ప్రాక్టీస్ చేయిస్తానంటూ ఒప్పందం చేసుకున్నాడు. వీరిలో ఒక్కొక్కరూ రూ.20 లక్షలు చెల్లించేలా అవగాహనకు కుదుర్చుకున్నాడు. ఈ హైటెక్ మాల్ ప్రాక్టీస్ కోసం చెవిలో ఇమిడిపోయే మైక్రో సైజులో ఉండే ఇయర్ ఫోన్లు, వాటికి సమాచారం ఇవ్వడానికి అవసరమైన మైక్రోఫోన్లు సిద్ధం చేసుకున్నాడు. కొందరిని అనుచరులుగా ఏర్పాటు చేసుకున్న ఇతగాడు వరంగల్‌లోని ఓ పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్ డ్యూటీ పడిన వ్యక్తితో ఒప్పందం చేసుకున్నాడు. ఆ ఏడుగురు అభ్యర్థులకు అదే పరీక్ష కేంద్రం ఎలాట్ అయింది. వీళ్ల కేంద్రంలోకి వెళ్లే ముందే ఇయర్ ఫోన్లు వారి చెవుల్లో పెట్టి పంపాడు. ఏఈఈ పరీక్ష ప్రారంభమైన 30 నిమిషాలకు సదరు ఇన్విజిలేటర్ వాట్సాప్ ద్వారా ప్రశ్నపత్రాన్ని బయట ఉన్న రమేష్‌కు పంపాడు. ఇతడు దాన్ని తన అనుచరులకు అందించడం ద్వారా చాట్ జీపీటీలో చూసి జవాబులు సిద్ధం చేయించాడు. వీటిని మరికొందరు ఓ అర్ధగంట తర్వాత మైకుల ద్వారా లోపల ఉన్న ఏడుగురికీ చెప్పారు. ఆదివారం రమేష్‌ను అరెస్టు చేసి విచారించిన నేపథ్యంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో సోమవారం తలకొండపల్లికి చెందిన ఎం.ప్రశాంత్, ఖమ్మం వాసి వదిత్య నరేష్, మహబూబ్‌నగర్ మూలమర్రితండలో నివసించే భూక్యా మహేష్‌లను పట్టుకున్నారు. మిగిలిన నలుగురు అభ్యర్థులతో పాటు పరారీలో ఉన్న రమేష్ ముఠా సభ్యుల కోసం సిట్ గాలిస్తోంది. సదరు ఇన్విజిలేటర్‌తో పాటు మరో నలుగురు అనుమానితులు సిట్ అదుపులో ఉన్నట్లు తెలిసింది. మరోపక్క ఏఈ పరీక్షకు సంబంధించిన మాస్టర్ ప్రశ్నపత్రాన్ని నగరానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి ఎనిమిది మందికి విక్రయించినట్లు సిట్ గుర్తించింది. శ్రీనివాస్‌ను సోమవారం అరెస్టు చేసిన అధికారులు ఆ అభ్యర్థుల కోసం గాలిస్తున్నారు.

కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాలకు 'ప్రైవేటు' చెక్?

ఎన్‌ఎంసీ అనుమతి రాకుండా అక్కడి ఓ ప్రైవేటు మెడికల్ కాలేజీ ప్రయత్నం!

- ప్రభుత్వ కాలేజీ వస్తే రోగులు తమ ఆస్పత్రికి రారనే అడ్డుకుంటోందని చర్చ
- ఇతర జిల్లాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలలకు ఇప్పటికే అనుమతులు



సాక్షి, హైదరాబాద్: కరీంనగర్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుమతి రాకుండా ఒక ప్రైవేటు కాలేజీ యాజమాన్యం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అక్కడ రెండు ప్రైవేటు కాలేజీలు ఉండటంతో అందులో ఒక కాలేజీ యాజమాన్యం ప్రభుత్వ కాలేజీకి అనుమతి రాకుండా అడ్డుకుంటున్నట్లు సమాచారం. 2023–24 వైద్య విద్యాసంవత్సరంలో 9 ప్రభుత్వ మెడికల్ కాలేజీల సాధనకు సర్కారు అన్ని ఏర్పాట్లు చేసింది. అందులో 8 కాలేజీలకు ఇప్పటికే జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) అనుమతులు ఇచ్చింది. కానీ కరీంనగర్ మెడికల్ కాలేజీకి మాత్రం ఇప్పటివరకు అనుమతి రాలేదు. పైగా ఇటీవల నీట్ పరీక్షలు పూర్తయ్యాయి. త్వరలో ఫలితాలు కూడా రానున్నాయి. అనంతరం ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియ మొదలు కానుంది. ఇప్పటికీ కరీంనగర్ మెడికల్ కాలేజీకి అనుమతులు రాకపోవడంతో వైద్య, ఆరోగ్యశాఖ యంత్రాంగం టెన్షన్‌లో ఉంది. ఆ కాలేజీకి అనుమతి కోసం వైద్య విద్య డైరెక్టర్ (డీఎంఈ) కార్యాలయం తీవ్రంగా కృషిచేస్తుంది. కరీంనగర్ మెడికల్ కాలేజీకి అనుమతి విషయంలో ఎన్‌ఎంసీ నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. వర్చువల్ పద్ధతిలో తనిఖీలు జరిగినా దీనిపై ఎన్‌ఎంసీ ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదని తెలిసింది. అన్ని రకాల ఏర్పాట్లు చేశామని, దానికి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం కోరినట్లు సమాచారం.

రోగులు తమ ఆస్పత్రికి రారనే ఉద్దేశంతోనే.

కరీంనగర్ జిల్లాలో ఇప్పటికే రెండు ప్రైవేటు మెడికల్ కాలేజీలున్నాయి. వాటికితోడు ప్రభుత్వ మెడికల్ కాలేజీ వస్తే తమకు వైద్య సిబ్బంది కొరత వెంటాడే అవకాశముందని, రోగులు ప్రైవేటు బోధనాసుపత్రులకు బదులుగా ప్రభుత్వ బోధనాసుపత్రికి వెళ్లే అవకాశం ఉందన్న భయం ఆయా ప్రైవేటు మెడికల్ కాలేజీల యాజమాన్యాల్లో నెలకొందన్న చర్చ జరుగుతోంది. పైగా ప్రైవేటు కాలేజీల కంటే ప్రభుత్వంలోనే వైద్య, మౌలిక సదుపాయాలు, సిబ్బంది, అధ్యాపకులు సరిపడా ఉంటారు. ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్లలోనూ ప్రభుత్వ కాలేజీకే విద్యార్థులు ప్రాధాన్యం ఇస్తారు. ఇలాంటి భయాలతోనే ఒక ప్రైవేటు కాలేజీ యాజమాన్యం అడ్డుకట్ట వేస్తోందన్న చర్చ నడుస్తోంది. కాగా, ఎలాగైనా కరీంనగర్ మెడికల్ కాలేజీకి అనుమతి తెస్తామని డీఎంఈ డాక్టర్ రమేష్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. ఎన్‌ఎంసీకి తాము విన్నవించామన్నారు.

కొనసాగుతున్న భవనాల నిర్మాణం

ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న సీఎం కేసీఆర్ కల తుది దశకు చేరింది. ఈ ఏడాదితో రాష్ట్రంలో 75 శాతం జిల్లాల్లో మెడికల్ కాలేజీలు రాబోతున్నాయి. తెలంగాణ ఏర్పడే నాటికి కేవలం 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలే ఉండేవి. తర్వాత ప్రభుత్వం మొదటి దశలో 4, రెండో దశలో 8 కాలేజీలు నెలకొల్పింది. ఈ ఏడాది మరో 9 కాలేజీలు ఏర్పాటు జరుగుతోంది. దీంతో కాలేజీల సంఖ్య 26కు చేరనుంది. ఇప్పటికే కామారెడ్డి, కొమురంభీం ఆసిఫాబాద్, ఖమ్మం, వికారాబాద్, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, రాజన్న సిరిసిల్లలో మెడికల్ కాలేజీలకు ఎన్‌ఎంసీ అనుమతులు వచ్చాయి. కానీ కరీంనగర్ మెడికల్ కాలేజీకి మాత్రం అనుమతి రాలేదు. వాస్తవానికి ఇప్పటికే అన్ని కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీల భవనాల నిర్మాణం కూడా కొనసాగుతుంది. ఇతరచోట్ల మాదిరిగానే కరీంనగర్‌లోనూ నిర్మాణం జరుగుతోంది. మౌలిక సదుపాయాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. కానీ ఈ ఒక్క కాలేజీకి ఎన్‌ఎంసీ అనుమతి రాకపోవడంపై డీఎంఈ కార్యాలయంలోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రిజిస్ట్రార్.. నేనంటే నేనే

- తెయూలో మరోసారి 'కుర్చీ' వివాదం
- వాదులాడుకున్న ప్రొఫెసర్లు యాదగిరి, కనకయ్య
- ఇరువర్గాలుగా చీలిన వర్సిటీ వర్గాలు
- వీసీ, రిజిస్ట్రార్ చాంబర్‌లకు తాళాలు

తెయూ (డిచ్‌పల్లి): వివాదాలకు మారుపేరుగా మారిన తెలంగాణ యూనివర్సిటీ (తెయూ)లో మరో వివాదం తారస్థాయికి చేరుకుంది. రిజిస్ట్రార్ కుర్చీ కోసం ప్రొఫెసర్ యాదగిరి, ప్రొఫెసర్ కనకయ్య వాదులాడుకోవడం గల్లీ కొట్లాటను తలపించింది. వివరాల్లోకి వెళితే.. తెయూ పాలకమండలి (ఈసీ) రిజిస్ట్రార్‌గా నియమించిన ప్రొఫెసర్ యాదగిరి ఉదయాన్నే వచ్చి రిజిస్ట్రార్ చాంబర్‌లో కూర్చుని ఫైళ్లను పరిశీలిస్తున్నారు. అంతలోనే వీసీ రవీందర్ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించిన ప్రొఫెసర్ కనకయ్య చాంబర్‌కు వచ్చారు. తనకు వీసీ ఇచ్చిన ఆర్డర్స్ ఉన్నాయని రిజిస్ట్రార్ కుర్చీలో మీరెలా కూర్చుంటారని యాదగిరిని ప్రశ్నించారు. ఈసీ ఆదేశాలతోనే తాను రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు యాదగిరి తెలిపారు. రిజిస్ట్రార్ కుర్చీ నాదంటే నాదని ఇరువురూ వాదనకు దిగారు. వీసీ మీకు ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా 2023 మే 26న ఆర్డర్స్ ఇచ్చారని, విషయం తెలియగానే రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వీసీకి లేఖ పంపారని యాదగిరి తెలిపారు. రిజిస్ట్రార్‌ను నియమించే అధికారం వీసీకి లేదని, ఈసీకి మాత్రమే ఉందంటూ విద్యాశాఖ కార్యదర్శి పంపిన లేఖను చూపారు. ఇంతలోనే చాంబర్‌లోకి అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థి సంఘాల నాయకులు, పూర్వ విద్యార్థులు, దళిత సంఘాల నాయకులు వచ్చారు. ఇరువర్గాలుగా చీలిన విద్యార్థి సంఘాల నాయకులు కొందరు యాదగిరికి, మరికొందరు కనకయ్యకు మద్దతుగా నిలిచారు. దళిత సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు కనకయ్యకు మద్దతుగా మాట్లాడితే విద్యార్థి సంఘాల నాయకులు అడ్డుకున్నారు. వర్సిటీలో కుల రాజకీయాలు వద్దని, బయట వ్యక్తులకు సంబంధం లేదని వారించారు. 3 గంటలపాటు అధ్యాపకులు, విద్యార్థి సంఘాలు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. చివరకు అందరూ కలిసి వర్సిటీకి రిజిస్ట్రార్ ఎవరో తేలేవరకు వీసీ, రిజిస్ట్రార్ చాంబర్లకు తాళాలు వేయాలని నిర్ణయించారు. అప్పటివరకు రిజిస్ట్రార్ కుర్చీలో ఎవరూ కూర్చోకూడదంటూ సిబ్బంది చాంబర్‌లకు తాళం వేశారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను

యూనివర్సిటీ అభివృద్ధి కోసమే రిజిస్ట్రార్‌గా చేయడానికి అంగీకరించాను. ఈసీ తీర్మానం, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి, కళాశాల విద్యాకమిషనర్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించాను. దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను.

–ప్రొఫెసర్ యాదగిరి

వీసీ ఆదేశాలతోనే ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ..

నేను తెయూ వీసీ ఆదేశాల మేరకే ఈ నెల 26న బాధ్యతలు స్వీకరించాను. 90 రోజుల లోపు ఈసీ ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది. ఈసీ ఆమోదిస్తే రిజిస్ట్రార్‌గా కొనసాగుతాను లేదంటే మరొకరు వస్తారు. ఇప్పుడు ఈసీ తీర్మానం పేరిట యాదగిరి రిజిస్ట్రార్ కుర్చీలో కూర్చోవడం సమంజసం కాదు.

– ప్రొఫెసర్ కనకయ్య

క్రీడాకారులపై దాడులు సిగ్గుచేటు

- అట్టహాసంగా సీఎం కప్ ప్రారంభ వేడుకలు
- హాజరైన మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో మల్లారెడ్డి, నిఖత్ జరీన్

గన్‌ఫౌండ్రి: జాతీయపతాకాన్ని ప్రపంచవేదికపై నిలిపిన క్రీడాకారులపై దేశరాజధానిలో దాడి సిగ్గుచేటని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారులకు అండగా నిలుస్తుందన్నారు. క్రీడాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఎం కప్ వేడుకలను ఎల్బీస్టేడియంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు రూ.2 కోట్ల నగదు ఇస్తున్నామని, ఉద్యోగాల్లో 2 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశామన్నారు. ఇక ప్రతి యేటా సీఎం కప్ వేడుకలు కొనసాగుతాయని, ప్రతిభ, క్రమశిక్షణ కలిగిన క్రీడాకారులను గుర్తిస్తామని వెల్లడించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అవినీతిలో కూరుకుపోయిందని, అవినీతికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలుంటాయని, త్వరలోనే అధునాతన క్రీడాపాలసీ రాబోతుందని తెలిపారు. కార్యక్రమంలో బాక్సర్ నిఖత్ జరీన్, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయ గౌడ్, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, అంజయ్య యాదవ్, క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, క్రీడాశాఖ అధికారులు, ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆస్కార్ అవార్డు విజేత రాహుల్ సిప్లిగంజ్, సాంస్కృతిక శాఖ కళాకారుల జానపద నృత్య ప్రదర్శనలతో వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 33 జిల్లాల క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది.

అమెరికాకు తరలిన తెలంగాణ శిల్పాలు



విగ్రహాలను తరలిస్తున్న దృశ్యం

తొలుత ఢిల్లీకి, అక్కడి నుంచి న్యూయార్క్‌కు

- జూన్ 17 నుంచి మెట్రోపాలిటన్ మ్యూజియంలో ప్రదర్శన
- అంతర్జాతీయ సంస్థ ఆధ్వర్యంలో ప్యాకింగ్, రూ.కోట్లలో బీమా
- పగుళ్లుండటంతో నాగ ముచలింద విగ్రహం ఉపసంహరణ
- గోప్యత పాటిస్తున్న అధికారులు



శిల్పాలు తరలి వెళ్తున్నాయి.

సాక్షి, హైదరాబాద్: అమెరికా, కొరియా దేశాల్లోని చరిత్ర అభిమానులను కనువిందు చేసేందుకు తెలంగాణ నుంచి శాతవాహన, ఇక్ష్వాకుల కాలం నాటి ఎనిమిది అద్భుత శిల్పాలు తరలి వెళ్లాయి. 'ఎవల్యూషన్ ఆఫ్ ది ఎర్లీ బుద్ధిజం ఇన్ ఇండియా' ఇతివృత్తంగా న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియంలో జూలై 17 నుంచి నవంబర్ 13 వరకు నిర్వహించే అంతర్జాతీయ ప్రదర్శనలో వీటిని ప్రదర్శిస్తారు. ఆ తర్వాత కొరియా రాజధాని సియోల్ నగరంలోని నేషనల్ మ్యూజియంలో డిసెంబర్ 22 నుంచి వచ్చే ఏప్రిల్ 24 వరకు ప్రదర్శనలో ఉంచుతారు. ఇందుకోసం మన దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 94

నాగ ముచలిందకు పగుళ్లతో..

న్యూయార్క్ మ్యూజియం క్యూరేటర్ జాన్ గై ఈ ప్రదర్శన శిల్పాలను కొన్ని నెలల క్రితమే ఎంపిక చేసుకున్నారు. అందులో తెలంగాణ నుంచి 9 శిల్పాల జాబితా రూపొందించుకున్నారు. ఫణిగిరిలో బుద్ధుడి జీవిత చరిత్ర అంశాలతో కూడిన సున్నపురాయి తోరణాల భాగాలు రెండు, బుద్ధుడి జాతక కథల ప్యానెల్, బుద్ధ పాద, బుద్ధుడి విగ్రహ తల భాగం, నేలకొండపల్లిలో లభించిన బుద్ధుడి శిల్పం, మరో కాంస్య విగ్రహంతోపాటు ధూళికట్టలో లభించిన బుద్ధ నాగ ముచలింద విగ్రహాలున్నాయి. వాటిలో దాదాపు 2 వేల ఏళ్ల నాటి నాగ ముచలింద విగ్రహానికి భారీగా పగుళ్లుండటంతో, దాన్ని తరలిస్తే విరిగిపోయే ప్రమాదముందని ఉపసంహరించుకున్నట్టు తెలిసింది.

పకడ్బందీ ప్యాకింగ్..

ఎంపిక చేసిన 8 శిల్పాలను అంతర్జాతీయ ట్రాన్స్‌పోర్టు సంస్థ ఆధ్వర్యంలో పక్కాగా ప్యాకింగ్ చేసి విమానంలో ఢిల్లీకి తరలించారు. రూ.కోట్లలో బీమా చేసిన ఈ శిల్పాలకు ఇబ్బంది కాకుండా ప్రత్యేక మెటీరియల్‌తో అన్ని వైపులా కుషన్ ఏర్పాటు చేసి చెక్క పెట్టెల్లో ప్యాక్ చేశారు. కింద పడ్డా శిల్పాలకు ఏమీ కాకుండా ఏర్పాట్లు చేశారు.

అంతా గోప్యం..

క్రీ.పూ. 2 నుంచి క్రీ.శ. 2 సంవత్సరాల మధ్య రూపొందించిన ఈ అతి పురాతన, అత్యంత విలువైన శిల్పాలను విదేశాలకు తరలిస్తున్న విషయాన్ని పురావస్తుశాఖ అధికారులు గోప్యంగా ఉంచారు. ఏ శిల్పాలను ఎంపికచేసి పంపుతున్నారన్న విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. శిల్పాలను ప్యాక్ చేసి ఢిల్లీకి పంపిన తర్వాత కూడా వివరాలు వెల్లడించకుండా గోప్యత పాటిస్తుండటం విశేషం.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.